thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 151 | కరీంనగర్ శనివారం, 9 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య కృషి

న్యూఢిల్లీ : వ్యవసాయాభివృద్ధికీ, రైతు సంక్షేమానికీ తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే, దేశంలోని తక్కువ పంట దిగుబడి, ఉత్పాదకత ఉండే వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు పీఎం ధన ధాన్య కృషి యోజన పథకానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా తొలుత ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

2025-26 బడ్జెట్‌కు సంబంధించి వ్యవసాయం-గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటుచేసిన వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యవసాయ సంబంధ కార్యక్రమాలను ముందుగా మొదలుపెట్టాలని అధికారులను కోరారు. ప్రస్తుతం దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగిందని, అయినప్పటికీ దేశీయ వినియోగంలో 20% ఇప్పటికి దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు.




# అట్లుంటది మోదీతోని!

## దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయ్యిందిగా...!

### ట్రంప్‌కు ఈ రేంజ్ లో భారత్ షాక్ ఇస్తుందని ఎవ్వరు ఊహించుకోలేదు !!!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 50 శాతం సుంకాలు విధిస్తానని బెదిరించిన నేపథ్యంలో భారత్ ఒక కీలక నిర్ణయం తీసుకుని ట్రంప్‌కు గట్టి షాక్ ఇచ్చింది. రష్యా నుండి చమురు దిగుమతులు చేసుకుంటున్నందుకు గాను భారత్‌పై ట్రంప్ ఈ బెదిరింపులకు దిగారు. అయితే ఇదే సమయంలో అమెరికా, యూరోపియన్ దేశాలు కూడా రష్యా నుండి చమురు, గ్యాస్, ఎరువులను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుండటాన్ని భారత్ చాలాసార్లు ఎత్తి చూపింది. ఈ ద్వంద్వ వైఖరికి లొంగకుండా భారత్, అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీతో చేసుకున్న 31,500 కోట్ల రూపాయల విలువైన రక్షణ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ చర్య ట్రంప్ బెదిరింపులకు భారత్ ఇచ్చిన బలమైన జవాబుగా భావించవచ్చు. భారత నౌకాదళం కోసం ఆరు %ూ-8×% పోసిడాన్ నిఘా విమానాలను కొనుగోలు చేయడానికి బోయింగ్ కంపెనీతో ఈ ఒప్పందం జరిగింది. ఈ విమానాలు హిందూ మహాసముద్రంలో చైనా కార్యకలాపాలను పర్యవేక్షించడంలో చాలా కీలకమైనవి. మొదట ఈ డీల్ విలువ 21,000 కోట్లుగా అంచనా వేసినప్పటికీ, జులై 2025 నాటికి అది 31,500 కోట్లకు పెరిగింది. అధిక వ్యయం ఉన్నప్పటికీ, నౌకాదళం ఈ డీల్‌ను ముందుకు తీసుకెళ్లాలని భావించింది. కానీ ట్రంప్ సుంకాల ప్రకటన ఈ డీల్‌ను రద్దు చేయడానికి దారితీసింది. ఈ నిర్ణయం బోయింగ్ కంపెనీకి ఆర్థికంగా భారీ నష్టాన్ని కలిగించనుంది, అంతేకాకుండా భారత్‌లో ఆ సంస్థ వ్యాపారంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. బోయింగ్ భారత్‌లో సుమారు 5 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నందున ఈ నిర్ణయం గణనీయమైన పరిణామాలకు దారితీయవచ్చు. ఈ డీల్ రద్దు వల్ల భారత నౌకాదళ సామర్థ్యంపై కొంత ప్రభావం పడవచ్చు. అయితే భారత్ దేశీయంగా నిఘా విమానాలను అభివృద్ధి చేయడానికి డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) వంటి సంస్థలతో కలిసి పని చేస్తోంది. అందువల్ల, ప్రభుత్వం ఇప్పుడు స్వదేశీ విమానాలకే ప్రాధాన్యత ఇవ్వవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్య ద్వారా భారత్ తన జాతీయ ప్రయోజనాల కోసం దృఢమైన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడదని అమెరికాకు స్పష్టమైన సంకేతాలు పంపింది. ఈ సంఘటన భవిష్యత్తులో అమెరికా-భారత్ సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో, మరియు భారత్ తన రక్షణ అవసరాలను ఎలా తీర్చుకుంటుందో వేచి చూడాలి.

**ఇండియాకు నో టెన్షన్.. సుంకాల పోరులో ట్రంప్ తగ్గాల్సిందే! :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల రష్యా నుంచి చమురు దిగుమతులు చేసుకుంటున్నందుకు గానూ ఇండియాపై 50 శాతం సుంకాలు విధిస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ప్రకటన ప్రకారం.. భారతీయ వస్తువులపై ఆగస్టు 27 నుంచి 50 శాతం సుంకాలు అమల్లోకి వస్తాయి. అయితే దీని వల్ల భారత్ కంటే అమెరికాకే ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంది. ఎందుకంటే సుంకాల కారణంగా అమెరికాలో భారతీయ వస్తువుల ధరలు పెరిగి, ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఈ చర్య భారత్-అమెరికా మధ్య సంబంధాలను దెబ్బతీసే అవకాశం ఉన్నప్పటికీ, భారత్ ప్రజలపై దాని ప్రభావం తక్కువగా ఉంటుంది.

**భారత్-చైనా-రష్యా కలిస్తే అమెరికా పరిస్థితి ఏంటి?....** ట్రంప్ విధించిన సుంకాల వల్ల భారత్ కంటే అమెరికాకే ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సుంకాలో పోరులో ట్రంప్ తన కాళ్లపై తానే గొడ్డలి పెట్టుకున్నారని.. భారత్ గట్టిగా నిలబడితే అమెరికానే వెనక్కి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. ఈ సుంకాలపై భారత్ గట్టిగా స్పందించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ చర్య అన్యాయమైనదని, అసంబద్ధమైనదని, తార్కికం లేనిదని తీవ్రంగా ఖండించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ విషయంలో తన వైఖరిని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్ తన రైతులకు సంబంధించిన ప్రయోజనాల విషయంలో రాజీపడదని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు భారత్ తన విధానాలపై స్థిరంగా నిలబడుతుందని సూచిస్తున్నాయి.

**అమెరికాకు నష్టాలు.. నిపుణుల విశ్లేషణ...** ట్రంప్ విధించిన ఈ సుంకాల వల్ల భారత్‌కు కొంత నష్టం జరిగే అవకాశం ఉన్నప్పటికీ, అమెరికాకు జరిగే నష్టం అంతకంటే ఎక్కువ ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. భారత్ నుంచి దిగుమతి అయ్యే చవకైన ముడిసరుకు, ఎలక్ట్రానిక్స్(ముఖ్యంగా ఐఫోన్ విడిభాగాలు)పై ఆధారపడిన అమెరికన్ కంపెనీలు భారీగా ప్రభావం అవుతాయి. ఇది ఉత్పత్తి వ్యయాన్ని పెంచుతుంది, తద్వారా ఆపిల్ వంటి కంపెనీల ప్రపంచ పోటీతత్వం దెబ్బతింటుంది. అమెరికా భారత్ నుంచి దిగుమతి అయ్యే జనరిక్ ఔషధాలపై ఎక్కువగా ఆధారపడుతుంది. సుంకాల వల్ల ఈ ఔషధాల ధరలు పెరిగి అమెరికన్ పౌరులకు ఆరోగ్య సంరక్షణ ఖర్చు పెరుగుతుంది. భారతీయ ఉత్పత్తులపై ఆధారపడిన చిన్న అమెరికన్ వ్యాపారాల లాభాలు తగ్గుతాయి. ఎందుకంటే దిగుమతి వ్యయాలు పెరుగుతాయి.

**ట్రంప్‌కు భారత్ బిగ్ షాక్.. రూ.31,500 కోట్ల కీలక ఒప్పందం రద్దు!...** భారత్ తన వైఖరికి కట్టుబడి ఉంటే, ట్రంప్ వెనక్కి తగ్గవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ నిర్ణయంపై నిరాశ వ్యక్తం చేస్తూ, ఇది ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు హానికరమని నాటో సలహాదారు ఎఫ్ క్రిస్టల్ కౌర్ అన్నారు. ఈ నిర్ణయం కేవలం ట్రంప్ శక్తిని ప్రదర్శించే పద్ధతి అని ఆమె విమర్శించారు.




విశాఖపట్నం: సృష్టి ఫెర్టిలిటీ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. శిశువుల అక్రమ రవాణా, మధ్యవర్తుల హస్తంతో నడిచిన ఈ అమానవీయ ఘటనలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. విశాఖ కేంద్రంగా జరిగిన ఈ స్కాంలో ఇప్పటి వరకూ ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా, హైదరాబాద్ పోలీసులు విచారణలో భాగంగా విశాఖలో ముగ్గురు మధ్యవర్తులు అయిన విజయ్, సరోజ, రత్నాను అరెస్టు చేశారు.

ఈ మధ్యవర్తులు శిశువుల కొనుగోలు, అమ్మకాల్లో కీలకంగా వ్యవహరించినట్లు ఆధారాలు లభించాయని సమాచారం. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారంలో నవజాత శిశువులను పేద కుటుంబాల నుంచి తీసుకొని దరఖాస్తు చేసుకున్న జంటలకు పెద్ద మొత్తాలకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఇది పూర్తిగా వ్యాపార ధోరణితో నడిచిన శిశువుల అక్రమ ముఠాగా భావిస్తున్నారు.

## ఎక్కడా ఛాన్స్ ఇవ్వకుండా.. ముప్పేట దాడితో బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి..!

హైదరాబాద్ : ప్రతిపక్షానికి ఎక్కడా ఛాన్స్ ఇవ్వకుండా దెబ్బ మీద దెబ్బ కొడుతుంది అధికార పక్షం. మొన్న ఫోన్ ట్యాపింగ్, తాజాగా కాళేశ్వరం కమిషన్ అంటూ.. ముప్పేట దాడితో.. బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరవుతుంది. ఇదే అదునుగా ప్రత్యర్థి బీజేపీ సైతం తన పావులు కదుపుతోంది. ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో గులాబీ నేతలకు గాలం వేసింది. తెలంగాణలో బీఆర్ఎస్‌కు గడ్డు కాలం నడుస్తుంది. ఒకవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు కొనసాగుతుండగానే, కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ రూపంలో బీఆర్ఎస్‌పై మరో పిడుగు పడింది. నేడో, రేపో స్థానిక ఎన్నికలంటూ హీట్ కొనసాగుతున్న వేళ.. వరుసగా బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టే అంశాలతో పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ముప్పేట దాడి కారణంగా.. తెలంగాణలో బర్నింగ్ టాపిక్ అయినటువంటి బీసీ రిజర్వేషన్ అంశంపై ఫోకస్ చేయలేకపోతుంది బీఆర్ఎస్. నిన్న మొన్నటి వరకు ఈ కార్ రేసింగ్, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల పంపిణీ కేసులంటూ ఎటాకింగ్‌కు దిగిన కాంగ్రెస్.. తాజాగా కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను ప్రజల ముందుంచింది. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌లో బీఆర్ఎస్ పెద్ద తలకాయలను టార్గెట్ చేశారు.




మాజీ సీఎం కేసీఆర్, హరీష్‌రావు పేర్లు ప్రస్తావించింది కమిషన్. దీంతో.. రివర్స్ ఎటాక్‌కు దిగింది బీఆర్ఎస్. అది కమిషన్ రిపోర్ట్ కాదు.. కాంగ్రెస్ రిపోర్ట్ అని స్వయంగా కేసీఆరే విమర్శించారు. అంతేకాదు.. కమిషన్ రిపోర్ట్ పేరుతో జరిగే డ్యామేజీని కంట్రోల్ చేసేందుకు నాయకుల్ని రంగంలోకి దింపారు. ఇందులో భాగంగానే ఇవాళ హరీష్‌రావు ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నారు. కమిషన్ పూర్తి రిపోర్ట్ బయటపెట్టకుండా.. కేసీఆర్ మీద నిందలు మోపడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శిస్తున్నారు. మరోవైపు.. కాంగ్రెస్ ఎటాక్‌తో ఇబ్బందుల్లో ఉన్న బీఆర్ఎస్‌ను బీజేపీ కూడా దెబ్బ కొడుతుంది. బీఆర్ఎస్ లాయలిస్టులకు గాలాలు వేసి.. బీజేపీలో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నల్లమల ప్రాంతానికి చెందిన గువ్వల బాలరాజును తమ దారికి తెచ్చుకోవడంలో సక్సెస్ అయ్యారు. రేపో, మాపో గువ్వల బీజేపీ కండువా కప్పుకోబోతున్నారు. ఒక్క గువ్వలే కాదు.. మరికొందరు గులాబీ నేతలు కూడా బీజేపీలోకి రావడం గ్యారంటీ అంటున్నారు రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు. అధికార కాంగ్రెస్ ముప్పేట దాడితో సతమతం అవుతున్న బీఆర్ఎస్‌కు,.. బీజేపీ కంట్లో నలుసుగా మారింది. ఎప్పుడు ఏ నాయకుడికి ఎర వేస్తుందనే టెన్షన్‌లో ఉన్నారు గులాబీ నేతలు. ఏదేమయినా.. కాంగ్రెస్, బీజేపీ వ్యూహాలకు బీఆర్ఎస్‌పై కారు మేఘాలు కమ్మాయి. దీంతో.. రెండు పార్టీలకు స్ట్రాంగ్ కౌంటర్స్ ఇస్తూ.. ప్రజలకు వాస్తవాలు వివరించే ప్రయత్నం చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. మరోవైపు బీసీ కోటాపై బీఆర్ఎస్ స్టాండ్‌ను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతుంది.

# రూటు మార్చిన రేవంతుడు

## రేవంత్ రెడ్డి నయా రాజకీయం!




### ఆవేశమే లేదు అంతా పక్కా ప్లానింగ్‌తోనే!

హైదరాబాద్ : రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పడిన బాధలు, చేసిన ఆవేశపూరిత ప్రసంగాలు, ఇప్పుడు బహిరంగసభల్లో ఇస్తున్న ప్రసంగాలు చూస్తే ఆయన తొందరపడతారేమో అని కొంత మంది కంగారు పడుతూ ఉంటారు. కానీ రేవంత్ రెడ్డి రాజకీయాన్ని రాజకీయంగా.. పాలనను పాలనగా చేస్తున్నారు. అదే సమయంలో ఆయన చేయాలనుకున్నది చేస్తున్నారు. పద్ధతిగా చేస్తున్నారు. కక్ష సాధింపులన్న ప్రచారం రాకుండా చేస్తున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులను చావుదెబ్బ కొట్టడానికి ఏం చేయాలో అది చేస్తున్నారు. కాళేశ్వరం రిపోర్టు విషయంలో రేవంత్ స్లో అండ్ స్టడీ వ్యూహం బీఆర్ఎస్‌ను ఉక్కిరిబిక్కిరి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

**ప్రజల్లో చర్చకు కాళేశ్వరం రిపోర్టు...** కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో అడ్డగోలుగా దోచుకున్నారన్న అభిప్రాయాన్ని ప్రజల్లోకి బలంగా నాటడంలో రేవంత్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే సక్సెస్ అయ్యారు.

ఇపుడు దాన్ని నిరూపించాల్సి ఉంది. నేరుగా కేసులు పెట్టి అరెస్టులు చేస్తే.. అది బ్యాక్ ఫైర్ అవుతుంది. అందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ కు ప్రభుత్వం తరపున సమాచారం ఇచ్చారు. సహజంగానే కేసీఆర్ అన్ని నిబంధనలు ఉల్లంఘించి అంతా తాను అనుకున్నట్లే చేశారు కాబట్టి అదే విషయాన్ని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పారు. బాధ్యులెవరో చెప్పారు. ఇక రేవంత్ ఆట ప్రారంభించారు.

**అసెంబ్లీలో చర్చ - రేవంత్ మాస్టర్ స్ట్రోక్...** కాళేశ్వరం రిపోర్టుపై ప్రాథమికమైన అంశాలను ప్రజల ముందు ఉంచారు. పూర్తి రిపోర్టును ప్రజల ముందు ఉంచుతామని అసెంబ్లీలో అందరి అభిప్రాయాలు వింటామన్నారు. అంటే అసెంబ్లీలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన 665 పేజీల నివేదికపై సమగ్రమైన చర్చ జరుగుతుంది. అందులో ఉన్న వన్నీ బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవకవతకలే. ఎక్కడెక్కడ కేసీఆర్ ను ఇరికించవచ్చో.. ఎక్కడెక్కడ హరీష్ ను రోడ్డున పడేయవచ్చో చూసుకుని మరీ క్రిమినల్ చర్యలకు ఆదేశిస్తారు. అప్పటికే అసలు విషయాలు అసెంబ్లీ ద్వారా ప్రజలకు చేరిపోతాయి కాబట్టి.. కక్ష సాధింపులన్న ఆలోచనలు.. ఆరోపణలు రావు.

**కేసీఆర్ కూడా ఊహించని వ్యూహాలు...** తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ రిటైర్డ్ చాణక్య అయిపోయారు. ఆయన పార్టీని గెలిపించలేకపోయారు. పార్టీ పతనాన్ని అడ్డుకోలేకపోతున్నారు. ఆయనను కూడా కార్నర్ చేసే విధంగా రేవంత్ రెడ్డి కొత్త చాణక్యుడిగా అవతరించారు. రేవంత్ రెడ్డి ఎలాంటి వ్యూహాలు పన్నుతారో అర్థం చేసుకోలేకపోతున్నారు. ఆయనకు కౌంటర్ ఇవ్వడానికి ఏం చేయాలో కూడా తెలుసుకోలేకపోతున్నారు. ఫలితంగా కేటీఆర్ లోని అసహనం.. పరిధులు దాటుతోంది. దాన్ని కూడా రేవంత్ తనకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. రేవంత్ ఆగి ఆగి.. కొట్టబోయే దెబ్బలను బీఆర్ఎస్ ఎలా కాచుకుంటుందన్నదే ఇప్పుడు అత్యంత కీలకం.




హైదరాబాద్: దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. హైదరాబాద్ నగరంలో నేడు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడనున్నట్లు పేర్కొంది. నల్గొండ, యాదాద్రి, నాగర్‌కర్నూలు, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.




## బాంబు పేల్చిన తెలంగాణ బీజేపీ చీఫ్

హైదరాబాద్, ఆగస్ట్ 08: తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు బాంబు పేల్చారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. ఆ ఎమ్మెల్యేలు ఎవరనేది త్వరలో చెబుతామన్నారు. ఆ ఎమ్మెల్యేలు.. మా పార్టీలో చేరే తేదీలు సైతం తెలియజేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏబీఎన్‌తో రాష్ట్ర బీజేపీ చీఫ్ రాంచందర్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంపై నమ్మకం లేక తమ వైపు వారు చూస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఆ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలే కాదని.. ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఆగస్ట్ 10వ తేదీన బీజేపీలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేరనున్నారని తెలిపారు. బీజేపీలో చేరికలకు ఇది ఆరంభం మాత్రమేనని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇలా పార్టీలో చేరే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగిస్తేనే అసలు దోషులు బయటకు వస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం లేదన్నారు. అయితే ఓటర్ల జాబితా అంశంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అయన అసహనానికి పరాకాష్టగా తెలంగాణ బీజేపీ చీఫ్ అభివర్ణించారు. బీసీల మీద ప్రేమ.. సీఎం రేవంత్ రెడ్డికి కొత్తగా వచ్చిందంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.



## 'రిజర్వేషన్' కోసం ఎందుకింత ఆ(పో)రాటం!

హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం చేరువ అవుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం రిజర్వేషన్ కోసం పంతానికి పోతోంది. తాము అసెంబ్లీలో ఆమోదించిన బీసీ రిజర్వేషన్(42 శాతం) బిల్లును ఎట్టి పరి స్థితిలోనూ రాష్ట్రపతి ఆమోదించాలని పట్టుబడుతోంది. ఢిల్లీ వేదికగా ధర్నాలు, నిరసనలకు కూడా దిగిం ది. అయితే.. బీసీల రిజర్వేషన్ కోసం ఇంత ఆరాటం, పోరాటం ఎందుకు? అది లేకుండా ఎన్నికలకు వెళ్తే.. ప్రభుత్వానికి వచ్చిన నష్టమేంటి? అనేది ప్రశ్న. మంచి చేయడం తప్పుకాదు. కానీ, ఆ పేరుతో కాలహరణం చేసేలా ఢిల్లీకి వెళ్లి నిరసనలు చేపట్టడంపైనా సోషల్ మీడియాలో పెద్ద చర్చే జరుగుతోంది. వాస్తవానికి రిజర్వేషన్ కల్పించడం ద్వారా గ్రామ,మండల, జిల్లాపరిధిలోని స్థానిక సంస్థల్లో పాగా వేయాలన్నది సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం. 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత తమకు దక్కుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే.. రిజర్వేషన్ ఆమోదం, అమలుపై పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. కానీ, నిజానికి ఇప్పటికిప్పుడు రిజర్వేషన్ అమలు చేయడం కూడా సాధ్యంకాదని.. అధికార వర్గాలు చెబు తున్నాయి. కుల గణన జరిగినా.. కూడా క్షేత్రస్థాయిలో రిజర్వేషన్ అమలు చేసేందుకు మరో కసరత్తు జరగాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. కుల గణనలో ఎంత మంది ఏయే కులాల వారు ఉన్నారన్నది మాత్రమే ఖరారైందని, దీనిని ఆధారంగా చేసుకుని రిజర్వేషన్ ప్రక్రియను అమలు చేసే అవకాశం ఉండకపోవచ్చని వారు చెబుతున్నారు. ప్రస్తుతం బీసీ, బీసీ–ఏ, బీ, సీ, డీ వర్గీకరణలు ఉన్నాయని, కొత్తగా కల్పించే రిజర్వేషన్ కేటగిరీకి ప్రామాణికతను నిర్ధారించాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు కనీసంలో కనీసం మూడు మాసాల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. అంటే.. ఇప్పటికిప్పుడు రాష్ట్రపతి సంతకంచేసినా.. అది వెంటనే అమలు జరగడం అనే ది కుదరదని చెబుతున్నారు. కానీ, సీఎం మాత్రం దీని కోసం ఆరాటం, పోరాటం చేస్తున్నారు. ఇదిలావుం టే.. ఎంత రిజర్వేషన్ ఇచ్చినా.. క్షేత్రస్థాయిలో సర్కారు చేపట్టే పనులు, అభివృద్ధి, పాలన తీరుకే మార్కులు పడతాయని, కేవలం రిజర్వేషన్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రజలు ఓటు వేస్తారని చెప్పలేరని అంటున్నారు. కాబట్టి.. హడావుడిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టే బదులు, ప్రశాంతంగా వ్యవహరిస్తే.. ఎలాంటి ఇబ్బందులు రాకుండా రిజర్వేషన్‌ను అమలు చేసుకునేందుకు ఛాన్స్ ఉంటుందని చెబుతున్నారు.




హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కాసేపట్లో సిట్ విచారణకు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన వద్ద ఉన్న రికార్డులు, ఆధారాలను సిట్ అధికారులకు అప్పగిస్తానని చెప్పారు. కేంద్ర మంత్రిగా, బాధ్యత గల పౌరుడిగా ఆధారాలు సమర్పిస్తానని పేర్కొన్నారు. "తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్‌ను మొదట బయటపెట్టింది నేనే. విచారణకు రావాలని గత వారమే సిట్ నాకు నోటీసులు ఇచ్చింది. పార్లమెంట్ సమావేశాల దృష్ట్యా విచారణకు రాలేకపోతున్నట్లు చెప్పాను. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌కు మొదటి బాధితుడిని నేనే. కాంగ్రెస్ ప్రభుత్వం, సిట్ అధికారుల మీద నాకు నమ్మకం లేదు. సిట్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇవ్వట్లేదు. కేసీఆర్ కుటుంబంలో ఇప్పటి వరకూ ఎవరినీ అరెస్టు చేయలేదు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగిస్తే మొత్తం వివరాలను బయటపెడతా" అని బండి సంజయ్ అన్నారు. సిట్ విచారణకు వెళ్తూ మార్గ మధ్యలో ఖైరతాబాద్ హనుమాన్ మందిరంలో బండిసంజయ్ పూజలు చేశారు. ఆయన వెంట భారీ ఎత్తున కార్యకర్తలు, నేతలు తరలివచ్చారు. అనంతరం పాదయాత్రగా ఆయన విచారణకు హాజరయ్యేందుకు దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌కు బయలుదేరారు.

**సిట్ విచారణకు బండి సంజయ్.. రాజ్‌భవన్ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్**... ఫోన్ ట్యాపింగ్ కేసులో తన వాంగ్మూలం ఇచ్చేందుకు కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. అంతకుముందు ఖైరతాబాద్ హనుమాన్ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాదయాత్రగా సిట్ విచారణ జరిగే దిల్‌కుషా గెస్ట్ హౌజ్‌కు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెద్దసంఖ్యలో కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు. దీంతో రాజ్‌భవన్ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది.



## సాయంత్రంలోగా చంపేస్తాం..

### ఎంపీ రఘునందన్‌రావుకు బెదిరింపులు

హైదరాబాద్: మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి దుండగులు ఫోన్ చేసి బెదిరించారు. హైదరాబాద్‌లోనే ఉన్నామని, సాయంత్రం లోగా చంపేస్తామని హెచ్చరించారు. ఆయనకు ఇలా బెదిరింపు ఫోన్ కాల్ రావడం ఆరోసారి. తాజాగా 9404348431 నెంబర్ నుంచి ఫోన్ వచ్చినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## గత ప్రభుత్వం పదేళ్ల పాటు ఎవరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదు: మంత్రి పొంగులేటి



హనుమకొండ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏ పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా ఎంపిక చేసినట్లు చెప్పారు. హనుమకొండ బాలసముద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. "పార్టీలకు అతీతంగా పేదవాడైతే చాలు.. ఇళ్లు ఇవ్వాలని అధికారులకు చెప్పాం. పేదల ముఖంలో నవ్వు చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లను కొందరికి మాత్రమే ఇచ్చింది. పదేళ్ల పాటు ఎవరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 6.50 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చాం. రైతుభరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు జమ చేశాం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం వేల కోట్ల కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కూలింది. నిర్మాణంలో జరిగిన అక్రమాలను విచారణ కమిషన్ బయటపెట్టింది. బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను కేంద్రంలోని భాజపా ఆమోదించలేదు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న భాజపాకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి" అని పొంగులేటి తెలిపారు.




## కీలక పరిణామం.. బీజేపీలోకి గువ్వల బాలరాజు

హైదరాబాద్: నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరనున్నారు. ఈ మేరకు ఇవాళ (శుక్రవారం) తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఇంటికి గువ్వల వెళ్లారు. తార్నకలోని ఇంట్లో రాంచందర్ రావు, గువ్వల బాలరాజు భేటీ అయ్యారు. బీజేపీలో గువ్వల చేరికను రాంచందర్ రావు అధికారికంగా ప్రకటించారు. గువ్వల ఈనెల 10వ తేదీన కమలం పార్టీలో చేరనున్నారు. ఆయనతోపాటు మరికొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూడా బీజేపీలో చేరే అవకాశం కనిపిస్తోంది.

**బీఆర్ఎస్‌ను వీడి.. సంచలన ఆరోపణలు**... బీఆర్ఎస్‌ను గువ్వల బాలరాజు వీడిన తర్వాత ఆ పార్టీపై బుధవారం నాడు సంచలన ఆరోపణలు చేశారు. తనను చంపుతానంటూ వేలాది ఫోన్లు వచ్చాయని, ఇంత జరిగినా బీఆర్ఎస్‌లో ఎవ్వరూ తనను పట్టించుకోలేదని బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఫామ్ హౌస్ కేసులో వంద కోట్లకు అమ్ముడుపోయానంటూ తనపై అబాండాలు మోపారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల ప్రకారమే తనకు ఇచ్చిన రోల్‌ను ఫాంహౌస్‌లో పోషించానని, ఆ విషయం పార్టీ పెద్దలకూ తెలుసని వెల్లడించారు.

## ఢిల్లీ వెళ్లిన హరీష్ రావు.. న్యాయ నిపుణులతో మీటింగ్



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌పై సుప్రీంకోర్టుకు వెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ కీలక నేత, నీటి పారుదల శాఖ మాజీ మంత్రి హరీష్ రావు ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలో న్యాయ నిపుణులను ఆయన కలవనున్నారు. బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్లాలో చర్చించనున్నారు. హరీష్ రావు ఇప్పటికే పలుమార్లు కేసీఆర్‌తో ఈ విషయంపై చర్చలు జరిపారు. రెండు రోజుల క్రితం హరీష్ రావు కాళేశ్వరం కమిషన్ నివేదికపై మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి గుండెకాయ అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కుప్పకూలిందంటూ కాంగ్రెస్ నేతలు బోగస్ మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆ ప్రాజెక్ట్ వల్ల పోయిన సారి లక్షల ఎకరాల్లో పంటలు పండాయని తెలిపారు. కాళేశ్వరం మూడు బ్యారేజీల్లో ఒక బ్యారేజీలో రెండు పిల్లర్లు మాత్రమే కుంగాయని, అలాంటప్పుడు కాళేశ్వరం మొత్తం కూలిందని ఎలా చెప్తారని ప్రశ్నించారు.




హైదరాబాద్, ఆగస్ట్ 08: బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం నాంపల్లిలోని గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. నువ్వు నా క్యారెక్టర్ అంచనా వేయలేవంటూ కొత్త ప్రభాకర్ రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో ఎవర్ని అడిగినా నా క్యారెక్టర్ గురించి చెబుతారన్నారు. నా క్యారెక్టర్‌కి, ప్రభాకర్ రెడ్డి క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఉన్నంత ఆస్తి నా వద్ద ఉంటే ప్రజలకి ఎప్పుడో పంచేసే వాడినని తెలిపారు.

**మా అమ్మనాన్న ఇచ్చిన ఆస్తి..** పంచే గుణం మా అమ్మనాన్న నాకు ఇచ్చిన ఆస్తి అని చెప్పారు. భవిష్యత్తులో నేను రూ. వేల కోట్లు సంపాదించినా వాటిని ప్రజలకే పంచుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నా ఆస్తి నా పిల్లల కోసం కాదని.. ప్రజల కోసమని తెలిపారు. రూ. 1000 కోట్లు కొన్ని గంటల్లోనే పంచేస్తానన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఎలా పంచాలో కూడా తెలియదని ఆక్షేపించారు. నేను ఎలాంటి వాడినో కేసీఆర్, హరీష్ రావుని అడిగి తెలుసుకోవాలంటూ ప్రభాకర్ రెడ్డికి సూచించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి.. నీవు మగాడవయితే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ రెడ్డిది నా స్థాయి కాదన్నారు. కొన్ని విషయాల్లో ఎమోషనల్ కావ్వడం నా బలహీనత అని తెలిపారు. ప్రజల సమస్య వింటే వాళ్ళ కంటే ముందు నాకే ఏడుపు వస్తుందన్నారు. నా చుట్టూ పేదలు ఉంటారని.. నా వద్దకు క్యాన్సర్ పేషెంట్లు సైతం వస్తారని చెప్పారు.

**ఆ ఫ్యామిలీకి ఆ టైటిలే కరెక్ట్‌గా..** తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ దోచుకున్నారని మండిపడ్డారు. ఎంత దొరికితే అంత దోచుకున్నారని విమర్శించారు. ఇంకా చెప్పాలంటే అంచనా వేయలేనంతగా రాష్ట్రాన్ని దోచి పడేశారని తెలిపారు. అవినీతి ఎలా చేయాలో అనే యూనివర్సిటీకి కేసీఆర్ ప్రొఫెసర్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల ఖజానా దోచుకోవడంలో కేసీఆర్ ఫ్యామిలీ దిట్ట అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొని.. సుద్దపూసలాగా.. నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫ్యామిలీపై నిప్పులు చెరిగారు. అలీబాబా నలభై దొంగలు అనే టైటిల్ కేసీఆర్ ఫ్యామిలీకి కరెక్ట్ సెట్ అవుతుందని స్పష్టం చేశారు. వారు స్థాపించిన పార్టీలోని కొత్త ప్రభాకర్ సుద్దపూసలాగా మాట్లాడుతున్నాడని చెప్పారు. ప్రజలకి ఏమైనా చేద్దామంటే ఖజానాలో మిగుల్చకుండా దోచుకొని పోయారంటూ కేసీఆర్ ఫ్యామిలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# "వేదోద్ధరణ అవతారమే హయగ్రీవుడు"



"జ్ఞానానందమయం దేవం, నిర్మలం స్ఫటికాకృతిం, ఆధారం సర్వ విద్యానాం హయగ్రీవ ముపాస్మహే" పురాణేతిహాసాలలో ప్రసిద్ధములైన విష్ణువు అవతారాలలో హయగ్రీవావతారం ఒకటి. దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం శ్రీహరి దాల్చిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. సమస్త విద్యలను, జ్ఞానాన్ని పాండిత్యాన్ని అనుగ్రహించే శ్రీ గురుమూర్తి హయగ్రీవ స్వామి. వేదోద్ధరణకై సంభవించిన అవతారమే ఇది. మధుకైటభులు అనే రాక్షసులు వేదాలను దొంగిలిస్తే, విష్ణుమూర్తి హయగ్రీవ అవతారాన్ని ధరించి, ఆ మధుకైటభులను వధించి...వేదాలను రక్షించాడు. హిందూమతంలో, హయగ్రీవ స్వామిని కూడా విష్ణుమూర్తి అవతారముగా భావిస్తారు. గుర్రపుముఖంతో, నరశరీరంతో, చతుర్భుజుడై శంఖచక్రాలను ధరించి వామాంకంలో లక్ష్మీదేవి సహితంగా ఆవిర్భవించిన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే హయగ్రీవ స్వామి. ఆయనలో సకల దేవతలూ కొలువై ఉన్నారని పురాణాలు పేర్కొంటున్నాయి. సూర్యచంద్రులు కళ్లుగా, దేవతలు ఎముకలుగా, అష్టవసువులు పాదాలుగా, అగ్ని నాలుకగా, సత్యం వాక్కుగా, బ్రహ్మ హృదయంగా... ఇలా ఆయనలోని అణువణువూ దేవతామయమని అంటారు. హయగ్రీవున్ని జ్ఞానమునకు, వివేకమునకు, వాక్కుకు, బుద్ధికి, అన్ని విద్యలకు దేవుడుగా భావిస్తారు. హయగ్రీవ స్వామిని చదువుల యొక్క దేవుడుగా పూజిస్తారు. జ్ఞానం, వాక్కు, ఆచారము నాశనం కాకుండా సాగునట్లు అనుగ్రహించిన హయగ్రీవ మూర్తిగా శ్రావణ పూర్ణిమ నాడు మహా విష్ణువును కొలవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. హయగ్రీవుడనగా గుర్రం శిరస్సు, మానవ దేహం కలిగిన స్వామి, నరసింహ స్వరూపం వలే వైకుంఠ నాథుడు హయగ్రీవ ధారియైనారు. 'హయ' అనగా విజ్ఞానం . 'గ్రీవ' అనగా కంఠం. అన్ని విద్యలూ కంఠస్థమై ఉన్న సర్వ విద్యా రూపమే హయగ్రీవ మూర్తి. భాగవతంలో సప్తమ స్కంధంలో హయగ్రీవుడు బ్రహ్మ చేసిన యజ్ఞంలో ఆవిర్భవించినట్లు, స్కంద పురాణంలో దేవతల ప్రార్ధనలతో విష్ణువు అశ్వముఖులై అవతరించినట్లు, పూర్వగాథాలహరి లోనూ హయగ్రీవ వృత్తాంతాలు పేర్కొనబడినాయి. దేవీ భాగవతం ప్రకారం ఒకానొక సమయాన మహావిష్ణువు రాక్షసులతో పదివేల ఏళ్ళు భీకర యుద్ధం చేసి అలసి పోయి, అల్లెత్రాడు గట్టిగా బిగించి ఉన్న ధనుస్సును నేలమీద నిలబెట్టి, దాని కోపుమీద తమ గడ్డాన్ని ఆనించి, నిలబడే నిద్ర పోయారు. విష్ణువును వెదకుతూ వచ్చిన దేవతలు, నిద్ర లేపడానికి భయపడి, బ్రహ్మ దేవుడు ఒక చెద పురుగును సృష్టించి, వింటి నారిని కొరకమని చెబుతారు. పురుగు కొరకడంతో ధనుస్సు విసురుగా తుళ్ళి, వింటికి ఉన్న బాణం కొన విష్ణువు మెడకు తగిలి, ఆయన శిరస్సు తెగి, ఎగిరి పోయింది. దేవతలంతా మహాదేవిని ప్రార్ధించగా, ఆమె ప్రత్యక్షమై సూచించిన విధంగా గుర్రాన్ని వధించి, దాని తలను తెచ్చి దేవశిల్పి యైన త్వష్ట ద్వారా విష్ణువు మొండానికి అతికించారు. బ్రహ్మ ప్రాణం పోయగా, హయగ్రీవులైనారు. సృష్టి ఆరంభంలో అగణిత ఏళ్ళ క్రింద చతుర్ముఖ బ్రహ్మకు కు పరమాత్మ వేదశాస్త్రాలను బోధించారు. మధుకైటభులనే ఇరువురు అసురులు, బ్రహ్మ నుండి వేద విద్యను దొంగిలించి, రసాతలానికి పారి పోయారు. హయగ్రీవ రూపంలోని శక్తితో మాత్రమే తాను మరణించునట్లు, హయగ్రీవుడనే రాక్షసుడు, బ్రహ్మ ద్వారా పొందిన వరం కారణంగా, దేవి కృప వల్ల హయగ్రీవ అవతారులైన విష్ణు అదే పేరుగలిగిన అసుర సంహారం చేయడం జరిగింది. తాను చంద్రమండల వాసియైన హయగ్రీవుడు, మహానంద స్వరూపుడు, ఆయన నాసిక నుండి వేదాలు ఆవిర్భవించాయని పురాణ కథనం. హయగ్రీవ విరాట్ స్వరూపాన సత్యలోకం శిరస్సుగా, భూలోకం నాభిగా, పాతాళం పాదాలుగా, అంతరిక్షం కళ్ళుగా, సూర్యుడు కంటి గుడ్డుగా, చంద్రుడు గుండెగా, దిక్పాల కులు భుజాలుగా, అగ్ని ముఖంగా, సముద్రాలు ఉదరంగా, నదులు నదులు, పర్వతాలు ఎముకలు, మేఘాలు కేశాలుగా, సర్వ దేవతా స్వరూపులైనారు. హయగ్రీవుడు తెల్లని శరీరం కలవాడు. లక్ష్మీదేవిని తొడపై కూర్చోబెట్టుకుని, తెల్లని పద్మాసీనులై ఉంటారు. కుడిచేతిలో చక్రం, పై ఎడమ చేతిలో శంఖం, కింది ఎడమ చేతిలో పుస్తకం, కింది కుడిచేయి చిన్ముద్ర ధరించి ఉంటారు. శ్వేతపద్మం సమస్త ఐశ్వర్యాలకు చిహ్నం. చిన్ముద్ర జ్ఞానానికి, పుస్తకం సకల విద్యలకు, శంఖం సకల సృష్టికి కారణభూతమైన నాదానికి, చక్రం అజ్ఞాన సంహారానికి చిహ్నాలు. హయగ్రీవుని ఉపాసించిన వారికి సకలం కలుగుతాయని విశ్వాసం. ఏ దేవతకైనా నామమే శరీరమని, ఆ నామంలోని అక్షరాలే అవయవాలని శాస్త్రవచనం. అందుకే వైష్ణవులకు ఆధ్యాత్మిక విద్యాభ్యాసం హయగ్రీవ నామోపదేశంతో ప్రారంభించడం సంప్రదాయం. హయగ్రీవ నామాన్ని ఉచ్చరించే వారు శివస్వరూపులుగా, పలికిన వారు విష్ణు స్వరూపులుగా, విన్నవారు బ్రహ్మ స్వరూపులుగా అవుతారని బ్రహ్మ చెప్పడాన్ని బట్టి హయగ్రీవ నామ ప్రాధాన్యత స్పష్టం అవుతుంది. భారతావనిలో చాలా చోట్ల హయగ్రీవ ఆలయాలు ఉన్నాయి.హయగ్రీవుని విశాల ఆలయం అస్సాంలో ఉంది. తిరుమల శ్రీహరి ఆలయ మహా ప్రదక్షిణ మార్గంలో శ్రీ లక్ష్మీహయగ్రీవ ఆలయం ఉంది.ప్రతినిత్యం చదువుకునే ఈ లలితా సహస్రనామాలు కూడా హయగ్రీవుని ద్వారానే వచ్చాయి. హయగ్రీవుడు చదువులకు అధిదైవం. మన శాస్త్రాలు అంటే ఎంతో కాలంగా ఆచరించి పొందిన అనుభవాల సారాలు. అందుకే "ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః" చాలా కాలంగా చేసిన ఆచారములే ధర్మములు, అవి మనల్ని రక్షించేవి కనుక వాటిని చెప్పేవి శాస్త్రాలు అయ్యాయి. శాస్త్రాలను బట్టి ఆచారాలు సంప్రదాయాలు ఏర్పడ్డాయి. జ్ఞానం, విద్య, సద్య స్ఫురణ, సృజనాత్మకత కావాలనుకునే వారు హయగ్రీవుని ఆరాధించాలి. హయగ్రీవ జయంతిని శుభప్రదంగా భావించి, అక్షరాభ్యాసం కూడా చేసుకుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**



# "రాఖీ ప్రాశస్త్యం:

హయగ్రీవ జయంతి"గా జంధ్యాల,","రాఖీ", "నార్లీ" పూర్ణిమగా పేరెన్నిక గన్న శ్రావణ పౌర్ణమి సర్వజనులకు పర్వదినం. ఉపవాసాలకు ఉద్దిష్టమైన పండుగ కాక, హిందువులలో అన్ని తరగతుల వారూ నిర్వహించుకునే పర్వం ఇది. వర్షాకాలపు రాకకు సంతసిస్తూ, మధుర పదార్థాలు భుజించడం అనుసరణీయమైన ఆచారం. వరుణ దేవుని కరుణకోసం కొబ్బరి కాయలు సమర్పించడం చేత 'నార్లీ' లేదా 'నారికేళ పూర్ణమి అని మరో పేరుంది. దక్షిణ భారతా వనిలో శ్రావణ పూర్ణిమ 'పౌతి పౌర్ణమి అంటారు. ఆ రోజున విష్ణు, శివ, గణేశులను పూజిస్తారు. ముంబాయి ప్రాంతంలో నార్లీ పూర్ణిమ అనబడే ఈ దినం నాడు వరుణుని కరుణ కోసం సముద్రుని పూజించే ఆచారం ఉంది. ఆ రోజులలో సముద్రం ప్రశాంతంగా ఉంటుందని నమ్మకం. కనుక పూర్వకాలంలో సముద్రాంతర వర్తకానికి ఈ రోజునే ప్రారంభించే వారు. తిరిగి రావడానికి ఈరోజు ఎంచుకునే వారు. యజ్ఞోపవీతాలు, నారికేళం శ్రావణ పూర్ణిమ నాడే సముద్రంలో పడవేసేవారు. పూర్వ కాలంలో శ్రావణ పూర్ణిమ నాడు ఉపాకర్మానంతరం వేదవిద్య ప్రారంభించడం జరిగేది. ఉపాకర్మ పండుగకాక అధ్యయయానికి సంబంధించిన కర్మ. ఉప నయనమనగా అదనపు కన్ను. గురువు తన ప్రజా ప్రాభవం చేత వటువునకు జ్ఞాన నేత్రమును తెరిపించడమన్నది పరమార్థం. యజ్ఞం, ఉపవీతంతో కలిస్తే యజ్ఞోపవీతం. ఉప వీతమంటే దారము. యాగకర్మచేత పునీతమై మూడు పోచల దారం. సృష్టి స్థితి, లయకారులైన త్రిమూర్తులను సూచించేవి ఒక్కో ముడిలోని మూడు తాళ్ళు. జంధ్యాల పౌర్ణమి నాడు చేయు కర్మనే ఉపాకర్మ. మాతా పితరుల వల్ల ఏర్పడేది ప్రథమ జన్మకాగా, మౌంజీ బంధనం వల్ల ఏర్పడునది ద్వితీయ జన్మ అయినందుకే ద్విజులు" పేరు. శ్రావణి పర్వాన్ని ద్విజులు వేద శాఖలకు చెందిన రుషుల అనుగ్రహానికై రుషి పూజ, రుషి తర్పణాలు చేస్తారు. శతపథ బ్రాహ్మణ ప్రకారం "గౌతమ, భరద్వాజ, విశ్వా మిత్ర, జమదగ్ని, వశిష్ఠ, కశ్యప, అత్రి"ని సప్త ఋషులు అంటారు. అయితే "మరీచి, అత్రి, అంగీ రస, పులహ, క్రతు, పులస్త్య, వసిష్ఠులను" సప్త రుషులుగా మహాభారతం చెపుతున్నది. వేదకాండర్షుల అనుగ్రహం ఉపాకర్మానుష్టానం చేయడం వల్ల కలుగుతుంది. సంవత్సర పాప నాశనానికి విరజాహోమం చేస్తారు. "శ్రౌత స్మార్త నిత్య నైమిత్తిక కామ్య కర్మానుష్టాన యోగ్యతా సిధ్యత్తం యజ్ఞోపవీత దారణం" నిర్దేశితమైనది. వేదశాస్త్ర పురాణేతిహాసాది సమస్త వ్మాయార్థం పితృ తర్మణం, బ్రహ్మయజ్ఞం చేస్తారు. ఉపాకర్మకు యజుర్వేదులకు పూర్ణిమ తిథి, రుగ్వేదులకు శ్రవణ నక్షత్రం, సామవేదులకు హస్తా నక్షత్రం ప్రధా నాలు. శ్రావణంలో ఉపాకర్మ కారణాంతరాలవల్ల చేయలేకపోతే ఆషాఢ లేదా భాద్రపద పౌర్ణమి నాడు చేస్తారు.

**రాఖీ పౌర్ణమి ప్రాశస్త్యం...** సర్వరోగ ఉపశమనం, సర్వాశుభ వినాశనం కోసం ధర్మజుడు శ్రీకృష్ణుడిని ఉపాయం అడుగగా, రక్షాబంధన విధి ఉపదేశించినట్లు, దేవాసుర యుద్ధంలో ఇంద్రుని, ఇంద్రాణి రక్షాబంధనం చేసి, విజయం సాధింప చేసినట్లు శ్రీకృష్ణుడు వివరించిన సందర్భం పురాణ కథనం. రక్షాబంధనం భార్య, భర్తకు కట్టాలని ఉన్నా, ఆచరణలో సోదరియో, కూతురో కట్టే ఆచారాన్ని వ్రతోత్సవ చంద్రిక వివరిస్తున్నది. శ్రావణ పూర్ణిమ రాఖీ పూర్ణిమ. రాఖీ అంటే తోరము, తోరం పట్టు దారంతో లేదా నూలుదారంతో చేయబడుతుంది. రాఖీ అనేది ఒక ఆభరణం లాంటిది. రంగుదారంతో లేదా కాగితంతో చేసి, దానికి తోరం జోడించి, దానిని సోదరి సోదరుని ముంజేతికి కట్టడం సాంప్రదాయం. బొట్టుపెట్టి హారతినివ్వడం, సోదరుడు, సోదరికి కట్నకాను కలు సమర్పించడం ఆచారం. రాఖీ ప్రాధాన్యతను బట్టి ఒక స్త్రీ, పురుషునికి రాఖీ పంపి లేదా కట్టి ఆతని రక్ష కోరే ఆచారం ఏర్పడింది. దానిని అందుకోవడంతోనే ఆతడు ఆమెకు సోదరుడైరక్షకుడవుతాడని భావన.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# "దేశాన్ని ఊపేసిన నినాదం అది"

## క్విట్ ఇండియా నినాద సృష్టి కర్త యూసుఫ్ మెహరల్లీ - ఆగస్టు 9... 'క్విట్ ఇండియా డే'




భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రధాన ఘట్టం, అనాడు దేశాన్ని ఊపేసిన నినాద మైన ఇండియా' (భారత్ ను వీడిపోండి' అనే నినాదాన్ని సూచించింది నాటి ముంబై మేయర్ మెహరల్లీ. సోషలిస్టు నాయకుడైన ఆయన దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఎనిమిది సార్లు జైలుకెళ్లారు. ఉద్యమం నాటికి ముంబై మేయర్‌గా పనిచేస్తున్న 39 ఏళ్ల యూసుఫ్ మెహరల్లీ. మేయర్ పదవికి ఎన్నికైన తొలి సోషలిస్ట్ మెహరల్లీ. ఆయన స్వాతంత్ర్యోద్యమానికి ఊపునిచ్చిన 'క్విట్ ఇండియా' అనే పదం ఎలా పుట్టుకొచ్చిందో కే. గోపాలస్వామి రాసిన 'గాంధీ అండ్ బాంబే' పుస్తకంలో వివరించారు. దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వ్యూహ రచన చేస్తున్న మహాత్మాగాంధీ తన సహచరులతో ముంబైలో సమావేశమైనప్పుడు స్వాతంత్ర్య పోరాటానికి పనికి వచ్చే మంచి నినాదాలను సూచించాల్సిందిగా వారిని కోరారు. అందుకు 'గెటవుట్' అని ఎవరో సూచించారు. అదంత మర్యాదగ లేదని గాంధీ తిరస్కరించారు. 'రిట్రీట్ ఆర్ విత్ డ్రా' అన్న పదాన్ని రాజగోపాలచారి సూచించారు. అక్కడే ఉన్న యూసుఫ్ మెహరల్లీ 'క్విట్ ఇండియా' పదాన్ని సూచించారు. బాగుందని గాంధీజీ మెచ్చుకున్న వెంటనే ఆ పదాన్ని ఆమోదించారు. 1942 ఆగస్టు 8న ముంబయిలోని గౌవాలియా బ్యాంక్ మైదానంలో జరిగిన సభలో ఆయన ఈ నినాదాన్ని ఇచ్చారు. 'క్విట్ ఇండియా' నినాదం భారత స్వాతంత్ర్య సమరాన్ని కొత్తపుంతలు తొక్కించింది. గాంధీజీ పిలుపు మేరకు ఆగస్టు 9 నుంచి 'క్విట్ ఇండియా' ఉద్యమం దేశవ్యాప్తంగా ఆరంభమైంది.గాంధీజీ దక్షిణాఫ్రికా నుండి భారత్ వచ్చాక దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య ఉద్యమం పలు రూపాల్లో విస్తరించింది. స్వపరిపాలన హోదా ఇవ్వకుంటే సత్యాగ్రహం ఉధృతం చేస్తామన్న తీర్మానాలు, రాజకీయ అసంతృప్తి, లాహోర్లో జరిగిన చారిత్రాత్మక సమావేశంలో సంపూర్ణ స్వతంత్ర సాధన పిలుపునకు క్రమానుగత హేతువులయ్యాయి. 1930 జనవరి 26న దేశం మొత్తం 'సంపూర్ణ స్వాతంత్ర్య దినంగా పాటించాలని నిర్ణయం జరిగింది. అనంతర పరిణామాలతో దశాబ్దకాలం పాటు కొనసాగిన వివిధ ఆందోళనలు సత్యాగ్రహాలు, నిరసనలు, బాంబు దాడులు, విధ్వంసం క్రమంలో- 'క్విట్ ఇండియా' (భారత్ ను వీడిపోండి' అనే నినాదాన్ని గాంధీజీ ఇచ్చారు. క్విట్ ఇండియా' నినాదాన్ని సూచించింది. క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రకటించడానికి ఒక నెలకు ముందుగానే 1942 జూలై 14వ తేదీ నుంచి అఖిల భారత కాంగ్రెస్ సమావేశం పూర్తి స్వాతంత్ర్యం లభించాలని తీర్మానం చేసింది. 1942 ఆగస్టు ఎనిమిదో తేదీ ముంబైలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేపట్టాలని తీర్మానించింది. 1942 ఆగస్టు 8 న, బొంబాయిలో గోవాలియా ట్యాంక్ మైదానంలో చేసిన క్విట్ ఇండియా ప్రసంగంలో గాంధీ "డూ ఆర్ డై" కి పిలుపునిచ్చాడు. గాంధీ ప్రసంగించిన గంటల్లోనే భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వం మొత్తాన్నీ విచారణనేది లేకుండా జైల్లో వేసింది. వీళ్ళలో చాలా మంది జైలులోనే, ప్రజలతో సంబంధం లేకుండా గడిపారు. ఆల్ ఇండియా ముస్లిం లీగ్, రాచరిక సంస్థానాలు, ఇండియన్ ఇంపీరియల్ పోలీస్, బ్రిటిషు ఇండియన్ ఆర్మీ, హిందూ మహాసభ, ఇండియన్ సివిల్ సర్వీస్, వైస్రాయ్ కౌన్సిల్ (ఇందులో ఎక్కువ మంది భారతీయులు ఉన్నారు) లు బ్రిటిషు వారికి మద్దతుగా నిలిచాయి. ఉద్యమంలో పాల్గొన్న గాంధి, పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ వంటి పలువురు నాయకులను బ్రిటిష్ పోలీసులు అరెస్ట్ చేసి అహమ్మద్ నగర్‌లోని పోర్ట్ కారాగారంలో బంధించారు. ఆగస్టు తొమ్మిదో తేదీ ఉదయం ముంబై బహిరంగ సమావేశానికి మూడు లక్షల మంది ప్రజలు హాజరయ్యారు. అయితే ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపించే నేతలు లేకపోవడంతో, యువ వీరవనిత అరుణా ఆసఫ్ అలీ ఈ కాంగ్రెస్ బహిరంగ సభకు నాయకత్వం వహించి, జెండా ఆవిష్కరణ గావించారు. 1942 ఆగస్టు 9 నుండి 1942 సెప్టెంబరు 21 వరకు, క్విట్ ఇండియా ఉద్యమంలో స్థానిక నిర్ణయాల మేరకు 550 పోస్టాఫీసులు, 250 రైల్వే స్టేషన్లపై దాడి చేసారు. అనేక రైలు మార్గాలను దెబ్బతీసారు. 70 పోలీస్ స్టేషన్లను ధ్వంసం చేసారు. 85 ఇతర ప్రభుత్వ భవనాలను తగలబెట్టడమో, ధ్వంసం చెయ్యడమో చేసారు. టెలిగ్రాఫ్ వైర్లు కత్తిరించిన సందర్భాలు సుమారు 2,500 ఉన్నాయి. బీహార్‌లో అత్యధిక స్థాయిలో హింస జరిగింది. శాంతి భద్రతలను పునరుద్ధరించడానికి భారత ప్రభుత్వం 57 బెటాలియన్ బ్రిటిషు దళాలను మోహరించింది. ఇలాంటి సంఘటనలకు ఆందోళన చెందిన బ్రిటిషు వారు వెంటనే స్పందించి గాంధీని, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (జాతీయ నాయకత్వం) సభ్యులందరినీ జైలులో పెట్టగా, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీని బ్రిటిషు ప్రభుత్వం నిషేధించింది. గాంధీ అహింసాయుత సిద్ధాంతాలకు వ్యతిరేకంగా 1943 వ సంవత్సరానికి క్విట్-ఇండియా ఉద్యమం నీరసించింది. అయితే క్విట్ ఇండియా ఉద్యమం యొక్క స్వర్ణోత్సవానికి గుర్తుగా 1992 లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1 రూపాయి స్మారక నాణెం జారీ చేసింది. ఏది ఏమైనప్పటికీ కోట్లాది ప్రజలు, చరిత్రలో అపూర్వమైన విధంగా, ఒక త్రాటిపై నిలచి, ఏకకంఠంతో స్వాతంత్ర్యమే ఏకైక లక్ష్యమని ప్రకటించడమే స్వాతంత్ర్య సాధనకు ముఖ్యకారణమని విస్మరించరాదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు - ఆగస్టు 9...అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం



1982, ఆగస్టు 9న జెనివాలో అటవి వనరుల హక్కులకు సంబంధించిన సమస్యలపై 26 మంది స్వతంత్ర మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూప్‌ల సమావేశాన్ని జరిగింది. ఈ సమావేశంలో 140 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివాసీల కోసం కూడా ఒక రోజు ఉండాలని ఐక్య రాజ్య సమితిని కమిటీ కోరగా, ఆదివాసుల సంరక్షణ చట్టాలకు ఐక్యరాజ్య సమితి ఆమోదం తెలిపింది. మేధావుల వర్కింగ్ కమిటీ 1992 నుండి పది సంవత్సరాల పాటు ప్రపంచ వ్యాప్తంగా తిరిగి ఆదివాసీల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషించింది. అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించ బడుతుంది. ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని 1994లో ప్రకటించింది. 1994 నుండి 2014 వరకు ఆ మధ్య కాలాన్ని ఆదివాసీల అభివృద్ధి కాలంగా పరిగణించి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవంగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీలు అంతరించి పోతున్న తరుణంలో వారి సంరక్షణ దిశగా ఐక్యరాజ్య సమితి చర్యలు చేపట్టింది. 1997లో గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులను కల్పిస్తూ, ప్రపంచ దేశాల ప్రతినిధులను తీర్మానానికి ఆహ్వానించింది. 143 ఐరాస సభ్యదేశాలు ఓటింగ్‌లో పాల్గొనగా 125 దేశాల ప్రతినిధులు తీర్మానాన్ని ఆమోదించారు. 14 మంది తటస్థ వైఖరి తెలపగా, కేవలం నలుగురు వ్యతిరేకించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఈ సనాతన ప్రజలను కాపాడవలసిన బాధ్యత మనపై ఉన్నది. అందుకు ప్రతి దేశం కొత్త చట్టాలు రూపొందించడం, వాటిని అమలు చేయడం, తద్వారా జీవించే హక్కుతో సహా ఆధునిక మానవునికి గల అన్ని హక్కులూ వారికి ఇవ్వవలసి ఉన్నది' అని 1994 డిసెంబర్ 23న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 49/214 తీర్మానంలో పేర్కొన్నది. అప్పటి నుంచి గిరిజన హక్కులు, వారికి ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీల గురించి అవగాహన కల్పించేందుకు ఏటా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. బ్రతుకు పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు కూడా లేవు. ప్రపంచంలో సుమారు ఏడు వేల భాషలు ఉంటే అందులో ఆదివాసీ తెగలు మాట్లాడే బాషలే నాలుగు వేలు ఉన్నట్లు రికార్డులు చెపుతున్నాయి. నేడు అత్యధికులు మాట్లాడే, వాడే ఆరు భాషలు గతంలో అంతరించి పోయిన ఆదివాసీ తెగలు వాడినవే. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**


చురకలు

# సంపాదకీయం

## వైసీపీ.... కాంగ్రెస్‌లో విలీనం అవుతోందా?!

కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల.. గత ఎన్నికలకు ముందు నుంచి ఇప్పటి వరకు కూడా తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్‌పై విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. వివేకా హత్య కేసు నుంచి తన ఆస్తుల వ్యవహారాల వరకు షర్మిల అనేక విషయాలను ప్రస్తావిస్తూనే ఉన్నారు. అయితే.. తాజాగా షర్మిల యూటర్న్ తీసుకుని.. మరో కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. వరుస నాలుగు రోజులుగా షర్మిల చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. నేరుగానే వైసీపీని టార్గెట్ చేస్తున్న షర్మిల.. కాంగ్రెస్‌ను మహా సముద్రంతో పోల్చుతున్నారు. మహా సముద్రం వంటి కాంగ్రెస్‌లో పిల్లకాలువలు కలిసిపోతాయని షర్మిల చెబుతున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ పేరును కూడా ఆమె చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మహాసముద్రం. దేశంలో ఉన్న అన్ని పిల్లకాలువలు.. సముద్రంలో కలిసిపోవాల్సిందే. వైసీపీ కూడా ఏదో ఒక రోజు ఇదే పనిచేస్తుంది. అని షర్మిల వ్యాఖ్యానిస్తున్నారు. గత నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న షర్మిల జిల్లాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నానని చెబుతున్నారు. ఈ క్రమంలోనే వైసీపీని పిల్లకాలువతో పోల్చిన ఆమె.. సముద్రంలో కలిసిపోతుందన్నారు. వాస్తవానికి గత ఏడాది ఎన్నికల తర్వాత.. కూడా ఈ తరహా చర్చ అయితే వచ్చింది. పార్టీ ఘోరంగా ఓడిపోయిన దరిమిలా.. జగన్ పరిస్థితి ఇబ్బందిగా మారిందన్న చర్చ తెరమీదికి వచ్చింది. బీజేపీతో గత ఐదేళ్లు కలిసి ఉన్న జగన్ ఎన్నికలకు ముందు ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. దీంతో కూటమితో కలిసి బీజేపీ అధికారం పంచుకుంది. ఈ పరిణామాలతో జగన్‌పై ఉన్న సీబీఐ, ఈడీ కేసులు తిరగదోడడం ఖాయమని చర్చ వచ్చింది. ఇదే జరిగితే.. రాజకీయంగా తనకు రక్షణ అవసరమని జగన్ భావించారు. దీంతో ఆయన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమిలో చేరుతారన్న చర్చ జరిగింది. తద్వారా తనను తాను కేసుల నుంచి రక్షించుకుంటారని కూడా విశ్లేషకులు కొందరు చెప్పుకొచ్చారు. అయితే.. ఇప్పటి వరకు అలాంటి పరిణామాలేవీ జరగలేదు. పైగా.. వైసీపీ వాదన కూడా మరోలా వుంది. బీజేపీకి-కాంగ్రెస్‌కు మధ్య తీవ్ర ఘర్షణ ఉందని.. అలాంటి సమయంలో జగన్ పోయి పోయి కాంగ్రెస్ కూటమిలో చేరితే.. లేనిపోని ఇబ్బందులు వస్తాయన్నది వైసీపీ వాదన. ఈ క్రమంలో తటస్థంగా ఉంటేనే మంచిదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు ఆతరహా సంకేతాలు అయితే.. వైసీపీ నుంచి రాలేదు. కానీ, తాజాగా మరోసారి షర్మిల చేస్తున్న వ్యాఖ్యలతో ఏం జరుగుతుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

## శాశ్వత భారతీయతకు శబ్దరూపం - సంస్కృతం - శ్రావణ పౌర్ణమి... ప్రపంచ సంస్కృత భాషా దినోత్సవం సందర్భంగా




సంస్కృతం భారతీయ సంస్కృతి యొక్క మూల స్వరూపం. వేదాల పరంపరగా వికసించిన ఈ భాష, అనేక శతాబ్దాలుగా భారత దేశపు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, విద్యా, శాస్త్ర, సాహిత్య రంగాలకు ఆధార భూతంగా నిలిచింది. ఇది ఒక భాష మాత్రమే కాదు, ఒక జీవన తత్వం. భారతీయతకు నాభి సంధానంగా, భౌతిక విజ్ఞానానికి ఆధారంగా, పరమార్థాన్ని వ్యక్తీకరించే మహా మాధ్యమంగా నిలిచింది. అలాంటి సంస్కృత భాషను ఘనతపరిచే ఉత్సవమే ప్రపంచ సంస్కృత భాషా దినోత్సవం. ప్రతి సంవత్సరం శ్రావణ పూర్ణిమ నాడు ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఆచరిస్తారు. ఈ ప్రత్యేక దినాన్ని శ్రావణ పూర్ణిమ నాడు నిర్వహించటానికి ఉన్న ప్రాముఖ్యత వెనుక గాఢమైన భాషాత్మక, ఆధ్యాత్మిక పునాది ఉంది. ఈ రోజే ఉపాకర్మ, గాయత్రీ జప పరంపరలకు ఆరంభంగా పరిగణించ బడుతుంది. వేదాధ్యయనానికి దీక్ష తీసుకునే ఆరంభ దినంగా దీన్ని పూర్వీకులు పేర్కొన్నారు. విద్యకు, జ్ఞానానికి, భక్తికి ద్వారంలా నిలిచే ఈ సంధి కాలంలో భాష మహిమను అభివర్ణించడం ఒక పరమార్థ సమర్పణ. సంస్కృత భాష తోటివాటితో పోల్చితే విలక్షణమైనది. ఇది అత్యంత నియమ బద్ధంగా, శాస్త్రీయంగా నిర్మితమైన భాష. వ్యాకరణంలో పాణినీయ సరళి, ధాతు పాఠములు, ప్రత్యయ నిర్మాణం, సమాస భేదాలు, అన్వయ సూత్రాలు వంటి విద్యా రూపాలు, వాక్య నిర్మాణం పరిపక్వత, అర్థ ఘనత దీనికి ప్రత్యేకత. శబ్దాల శుద్ధత, భావాల సహజ ప్రకాశం సంస్కృత భాషకు లక్షణాలుగా నిలిచాయి. ఒక్క పదానికి పదహారు ప్రయోగాలు, ఒక్క శ్లోకంలో నాలుగు స్థాయిల అర్థాలు – ఈ భాషకు మాత్రమే సాధ్యం. సంస్కృత భాషే భారతీయ విజ్ఞాన సంపదకు మూలాధారం. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ధర్మశాస్త్రాలు, న్యాయశాస్త్రం, వైద్య విజ్ఞానం, ఖగోళ శాస్త్రం, గణితం, – అన్నీ సంస్కృత భాషలోనే అభివృద్ధి చెందాయి. వేదాంగాలు, షడ్దర్శనాలు, అష్టాదశ పురాణాలు, ఇతి వృత్తాలు, ఉప పురాణాలు, లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామం వంటి భక్తి లలిత రచనలన్నీ సంస్కృతంలో వెలిసిన ఆధ్యాత్మిక పథకాలే. కాళిదాసుడు, భవభూతి, భరతముని, దండిని, బాణ భట్టుడు, మేఘదూతం నుండి శాకుంతలము వరకు, రఘువంశం నుండి కుమారసంభవం వరకు – సంస్కృత సాహిత్యంలో అలంకార కవిత్వం, నాటక సాహిత్యం, మిమాంసా తత్త్వాలు అపారమైనవి. ఇది సాహిత్యానికి శబ్ద సౌందర్యాన్ని కలిగించిన మహా భాష. గానస్వరాలు లాంటి సంగీతం, నాట్యం, వాచక పఠనం – అన్నీ సంస్కృత భాషను ప్రాణంగా మార్చుకున్న రంగాలే. సంస్కృత భాష ప్రాచీన కాలంలో మాత్రమే పరిమితంగా మిగలలేదు. సమకాలీన సాంకేతిక విజ్ఞానానికి కూడా ఇది సత్వర అన్వయమయ్యే భాష. కంప్యూటర్ యుగంలో, సంస్కృత భాష గణిత, లాజికల్ ప్రాసెసింగ్‌కి అనుకూలమైన భాషగా మారింది. అమెరికాలోని నాసా లాంటి సంస్థలు, యూనివర్సిటీలు సంస్కృత భాషను ప్రయోగాత్మక పరిశోధనలకు ఉపయోగిస్తున్నాయి. ఇందులోని వ్యాకరణ శాస్త్ర నిర్మాణం సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్ రూపొందించడంలో ప్రేరణగా నిలుస్తోంది. ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంస్కృతానికి ఆదరణ పెరుగుతోంది. అమెరికా, యుకె, జర్మనీ, ఫ్రాన్స్, రష్యా, ఆస్ట్రేలియా వంటి దేశాలలో సంస్కృత అధ్యయన కేంద్రాలు పెరుగుతున్నాయి. హార్వర్డ్, యేల్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి విశ్వవిద్యాలయాల్లో సంస్కృత భాష ప్రాథమిక కోర్సులుగా, పీహెచ్‌డీ స్థాయికి అందుబాటులో ఉన్నవి. జర్మనీలో కొన్ని స్కూళ్లలో ఐచ్ఛిక భాషగా సంస్కృతాన్ని బోధిస్తున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సంస్కృత అండ్ ఇండాలజీ లాంటి కేంద్రాలు సంస్కృతాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి. మన దేశంలోనూ కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం, రాష్ట్రీయ సంస్కృత సంస్థానాలు, రాష్ట్రాల వారీగా సంస్కృత విశ్వ విద్యాలయాలు భాషాభివృద్ధికి పాటు పడుతున్నాయి. 'సంస్కృత వార్తా', 'సంస్కృత రేడియో', 'సంస్కృత టీవీ', 'సంస్కృత న్యూస్ రీడింగ్', 'సంస్కృత నాటకోత్సవాలు' వంటి కార్యక్రమాలు భాష ప్రజల జీవితాల్లోకి చేరే విధంగా పునరుద్ధరిస్తున్నాయి. మన ప్రాంతాల్లోనూ తుంగభద్ర తీరం,, కంచీపురం, వారణాసి, నాశిక్, ఉజ్జయిని, శృంగేరి వంటి కేంద్రాల్లో సంస్కృతం జీవ భాషగా కొనసాగుతోంది. ఈ భాష మౌలికంగా మనిషి వ్యక్తిత్వ వికాసానికి మార్గం చూపుతుంది. భావ ప్రకాశం, శబ్ద విశుద్ధత, బుద్ధి నిశితత్వం, చింతనా సామర్థ్యం %–% ఇవన్నీ సంస్కృత భాష శిక్షణతో సాధ్యమయ్యేవే. చిన్నతనం నుండే సంస్కృతాన్ని బోధించటం వల్ల అభ్యాస.శీలత, వ్యాకరణ జ్ఞానం, పద సంయోగ సామర్థ్యం, అన్వయ దృక్పథం పెరుగుతాయి. సంస్కృత భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని, మనం ఈ భాషను సజీవంగా ఉంచే కృషిలో భాగస్వాము లవ్వాలి. సంస్కృత భాషను సాధారణ జీవితంలో వినియోగంలోకి తేవాలి. ఇంట్లో, పాఠశాలలో, దేవాలయంలో, సాహిత్యంలో, నాటకరంగంలో %–% అన్ని స్థాయిలలో ఇది వినియోగిస్తే, అది ఒక రాతబల్ల కాదు %–% జీవభాషగా పునర్జన్మ పొందుతుంది. వేద ధ్వని నుంచి మానవతా ధర్మం వరకు, యోగ శాస్త్రం నుంచి భౌతిక శాస్త్రం వరకు, అర్చన నుంచి అర్థతత్త్వం వరకు సంస్కృతం కలుపుకు పోయిన బంధమిది. ఈ బంధాన్ని పునర్వ్యక్తీకరించే ప్రక్రియగా ఈ దినోత్సవాన్ని పరిగణించి, మనం కూడా జయతు సంస్కృతం %–% జయతు భారతం అనే ఘోషతో ముందుకు సాగాలి. మన భవిష్యత్తు తరం, ఈ భాష గర్వించదగ్గ భవిష్యత్తుగా తీర్చిదిద్దాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల –**
**సీనియర్ జర్నలిస్టు, కాలమిస్ట్...9440595494**

## పుస్తకంలోనే ప్రపంచం: జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం సందేశం - ఆగస్టు 9...జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం




పుస్తకం అనేది కేవలం కాగితపు పుటల సమాహారమే గాక, అది మానవ చైతన్యానికి, మేధస్సుకు, సంస్కృతికి ప్రతిబింబం. ఇది భావనలకు పరిమితం కాకుండా, విస్తృతంగా విరాజిల్లే మానసిక పరిపక్వతకు మార్గదర్శి. జ్ఞానాన్ని అక్షరాల్లో బంధించిన మహాత్మ్యం పుస్తకానికి మాత్రమే చెల్లుతుంది. చదివే ప్రతి పుట ఒక కొత్త లోకాన్ని ఆవిష్కరిస్తుంది. ఈ భావోద్వేగ, విజ్ఞాన మార్గదర్శి పుస్తకాన్ని గౌరవించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ఆగస్టు 9న జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం జరుపు కుంటారు. పుస్తకాన్ని ప్రేమించడమంటే జీవితం పట్ల ప్రేమను పొందడమే. పఠనాన్ని అలవాటు చేసుకోవడం అంటే మనుషుల్ని, సమాజాన్ని, ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే ఆత్మ కాంక్ష. ఈ దినోత్సవాన్ని ఎవరు ప్రారంభించారన్న దానిపై స్పష్టత లేకున్నా, ఈ రోజు ఉద్దేశం మాత్రం అపారంగా ఉంది. పఠన సంస్కృతిని నిలబెట్టడం, ముద్రిత పుస్తకాల విలువను గుర్తు చేయడం, చదవడం అనే నిర్జీవంగా మారుతున్న మానవ గుణాన్ని మళ్లీ జీవింప జేయడం ఈ దినోత్సవ ప్రయోజనంగా భావించాలి. డిజిటల్ యుగంలో చదువులు తెరవెనుక సెల్‌ఫోన్ తెరలకే పరిమితమై పోతున్న తరుణంలో, ముద్రిత పుస్తకాలను మళ్లీ జీవితంలోకి తీసుకొచ్చే ప్రయత్నంగా ఈ దినోత్సవాన్ని చూసుకోవాలి. చదవడం అనేది వ్యక్తిగత సాధన అయినప్పటికీ, సమాజ నిర్మాణంలో దీని పాత్ర అమూల్యం. చదివిన ప్రతి వ్యక్తి ఆలోచించ గలడు. ఆలోచన చేసిన ప్రతి ఒక్కరూ మార్పును ఆవిష్కరించ గలరు. మార్పే మానవ అభివృద్ధికి పునాది. పుస్తకం చదవడం అనేది చింతనకు మూలం. అది ఊహకు ఊత మందించే ఆచార వ్యవస్థ. ఒక్క పుస్తకం మనిషి జీవితాన్ని దిద్దుబాటు చేయగలదు. చదవడం ద్వారా వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటాడు. శ్రద్ధ, ఏకాగ్రత, భావ వ్యక్తీకరణ, భాషా పటిమ, వివేచన, నిశ్చలత %–% ఇవన్నీ చదివే అలవాటుతోనే వస్తాయి. ముఖ్యంగా చిన్ననాటి నుంచే చదివే అలవాటు పెంచితే, పిల్లలలో మేధో వికాసం, భావ ప్రకటన సామర్థ్యం, అపూర్వ ఆలోచన శక్తి అభివృద్ధి చెందుతాయి. చదివే పుస్తకం ఓ లోక దర్శనం, చదివిన పుటలు అనుభవాల చరిత్ర. భారతదేశం ప్రపంచానికి శబ్ద బ్రహ్మగా మారిన దేశం. ఇది శ్రుతి సంప్రదాయానికి పుట్టినిల్లు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, గృహసూత్రాలు, స్మృతులు మొదలైన అనేక పాఠ్య సంపదలు తరతరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. తాళ పత్రాలపై రాయడం మొదలై, అక్షరాల రూపంలో జ్ఞానం ముద్రించ బడింది. మనకున్న ప్రాచీన పుస్తక సంపద ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసే స్థాయిలో ఉంది. వేదాలలో విజ్ఞానం, వ్యాకరణ, ఛందస్సు, సాహిత్య గ్రంథాలు, చాణక్య అర్థశాస్త్రం, శాస్త్రీయ దర్శనాలలో ఉపనిషత్తుల లోతు, మహాభారత రామాయణాల అఖండత, పురాణాల పురాతనత – ఇవన్నీ పుస్తక రూపాల్లో మానవ చైతన్యానికి అక్షర ప్రతిరూపాలు. తెలుగు సాహిత్యంలో కూడా అనేక అపురూప గ్రంథ సంపద ఉంది. నన్నయ్య భావార్థంగా ముద్రించిన మహాభారతం, తిక్కన్న సాహిత్యం, పోతన భాగవతం, వేమన పద్యాలు, వివిధ శతకాలు, తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనలు, త్యాగయ్య కీర్తనలు%–% ఇవన్నీ కేవలం భక్తి భావనకే కాదు, భాషా శిల్పానికి, పాఠ్య పరంపరలకు చక్కటి ఉదాహరణలు. ఆధునిక తెలుగు సాహిత్యంలో విశ్వనాథ, మల్లాది, శ్రీశ్రీ, కందుకూరి, గురజాడ, ఆరుద్ర, వట్టికోట, యండమూరి, జంధ్యాల, రచయిత్రులు – అనేక రచయితలు తమ రచనలతో పాఠకులను తాకిన తీరు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంకల్ప భరితమైన రచనలు పఠనానికి ప్రేరణగా నిలిచాయి. పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు లెక్కలేనివి. పుస్తకం మనకు నూతన భావనలు అందిస్తుంది, ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది, భాషలో మాధుర్యాన్ని పెంచుతుంది, లోతైన ఆలోచనకు అవకాశాన్ని ఇస్తుంది. ముఖ్యంగా ఊహా శక్తిని ప్రేరేపించి, మనలోని సృజనాత్మకతను మేల్కొలిపే సాధన పుస్తకం. చదవడం అనేది మానసిక దృష్టి కోణాన్ని శుద్ధి చేస్తుంది. అది మనల్ని మెదడుతో, మనస్సుతో, కలుపుతుంది. ఇది యాంత్రికతను అధిగమించి ఆలోచనను పురిగొలిపే ప్రక్రియ. ఈ దినోత్సవాన్ని వ్యక్తిగతంగా జరుపుకోవడం కన్నా సామూహికంగా జరుపుకుంటే అధిక ప్రయోజనం. పాఠశాలలలో పఠన ప్రోత్సాహక కార్యక్రమాలు, గ్రంథాలయాల సందర్శనలు, పుస్తకాల చర్చలు, రచయితల ఉపన్యాసాలు వంటి కార్యక్రమాలు సమాజాన్ని పఠన పట్ల ఆకర్షించ గలవు. ఇంట్లో చిన్నారులకు పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం ద్వారా వారికి చదవడం పట్ల ఆసక్తి కలిగించ వచ్చు. పాత పుస్తకాలను పాఠశాలలకు, స్వచ్ఛంద సంస్థలకు దానం చేయడం వల్ల పఠన వనరులు పెరుగుతాయి. ఈ దినోత్సవం రోజున ఒక్క మంచి పుస్తకాన్ని పరిచయం చేయడం కూడా సమాజ మార్పుకు పునాది వేయగలదు. చదవడమంటే కేవలం గడిపిన సమయం కాదు, అది మనిషిగా మనలో పెరిగిన క్షణం. ఒక పుస్తకం మన జీవితాన్ని మార్చ గలదు. మనం మారితే సమాజం మారుతుంది. అందుకే పుస్తకాన్ని ప్రేమించాలి, పఠనాన్ని అభివృద్ధి పరచాలి, పుస్తక ప్రేమికుల దినోత్సవాన్ని జ్ఞానోత్సవంగా మార్చాలి. మానవ వికాసానికి పుస్తకం కీర్తి పతాక. జీవితాన్ని నిర్మించుకునే మార్గంలో పఠనం మనకు తోడుగా ఉండే కాంతి రేఖ. జ్ఞానం మాత్రమే నిజమైన శక్తి. ఆ శక్తిని మన చేతుల్లోకి తేవాలంటే పుస్తకాన్ని ఒడిసిపట్టాలి. చదవడమే మార్గం, పుస్తకమే సాధనం. **రామ కిష్టయ్య సంగన భట్ల – సీనియర్ జర్నలిస్టు, కాలమిస్ట్...9440595494**

## "బాంధవ్యానికి ప్రతిరూపం రక్షా బంధనం"




"యేన బద్ధో బలీరాజా దానవేంద్రో మహాబలః తేనత్వా మభిబద్నామి రక్షే మాచల మాచల"...ఓ రక్షా బంధమా! మహా బలవంతుడూ, రాక్షసరాజు అయిన బలి చక్రవర్తిని బంధించావు..కాబట్టి నేను నిన్ను ధరిస్తున్నాను. సోదరి ప్రేమకు ప్రతిరూపంగా రక్షాబంధనాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం భారతావనిలో అనాదిగా ఆచరరణలో ఉన్న సత్సంప్రదాయం. మహావిష్ణువు, మహాబలి కోరిక మేరకు ఆయనతో పాతాళంలో ఉండిపోతారు. దేవతల కోరిక మేరకు మహాలక్ష్మి, పాతాళానికి వెళ్ళి, బలిరాజుకు రక్షాబంధనం గావించి, బలి ఇచ్చిన వరంతో తిరిగి వైకుంఠ నాథుని తీసుకు వెళుతుంది. ఇతిహాసాధారంగా శిశుపాలుని సంహరించే సమయాన సుదర్శన చక్ర ప్రయోగంలో శ్రీకృష్ణుని చూపుడు వేలు రక్తసిక్తమవుతుంది. వెంటనే ద్రౌపది తన పట్టుచీర కొంగును చించి, ఆ వేలుకుకడుతుంది. దానికి కృతజ్ఞతగా గోపాలుడు, ద్రుపద రాజ తనయకు అన్ని వేళలా అండగా ఉంటానని మాట ఇచ్చి, దుశ్శాసనుడు వలువలు వొలిచే సమయాన పంచభర్తృకకు రక్షణ ఉంటారు. భవిష్యత్ పురాణాధారంగా పూర్వం దేవతలకు, దానవులకు యుద్ధం జరగగా, ఓడిపోయిన దేవేంద్రుడు నిర్వీర్యుడై, పరివార సహితంగా అమరావతిలో తల దాచుకుంటాడు. చింతాక్రాంతుడైన స్వర్గాధిపతి దీన స్థితిని గాంచి, ఇంద్రాణి తరుణోపాయం యోచించి, రాక్షస రాజు అమరావతిని ఆక్రమించకుండా, దేవేంద్రునికి పార్వతీ పరమేశ్వరులను, లక్ష్మీనారాయణులను పూజించి, రక్షను కట్టి దేవేంద్రుని సమరోత్సాహ భరితుని గావిస్తుంది. దీనితో ఇంద్రుడు యుద్ధంలో గెలుపొంది, త్రైలోక్య ఆధిపత్యం పొందుతాడు. జగజేతగా నిలవాలనే పట్టుదలతో దేశాలను జయిస్తూ, చరిత్రలో క్రీ.పూ.326లో అలెగ్జాండర్ భారత దేశ దండయాత్ర గావిస్తాడు. ఈ క్రమంలో అలెగ్జాండర్ బాక్ట్రియా (నేటి అఫ్ఘనిస్థాన్)కు చెందిన యువరాణి రోక్సానాను వివాహమాడతాడు. ఈ వివాహ బంధాన్ని వినియోగించుకుని, ఆయన మధ్య ఆసియా దేశాలు... ప్రధానంగా జీలం, చీనాబ్ మధ్య రాజ్యాలను జయించ ముందుకు సాగుతాడు. తక్షశిల రాజు పురుశోత్తముని శతృవు అంబి, అలెగ్జాండర్‌ను భారత దేశం లోకి ఆహ్వానిస్తాడు. పురుశోత్తముడు యుద్ధానికి సర్వసన్నద్ధమవుతాడు. అలెగ్జాండర్ భార్య రోక్సానా, తక్షశిల రాజు పురుశోత్తముని సోదరునిగా భావించి, రాఖీ కడుతుంది. తన సోదరుని చంపొద్దని భర్తను కోరుతుంది. ఫలితంగా అలెగ్జాండర్ యుద్ధ విరమణ గావిస్తాడు. మొఘల్ చక్రవర్తి హుమాయూన్, చిత్తోరు ఘడ్ ను ఆక్రమణ చేసిన సమయంలో రాణా సతీమణి విధవ కర్మవతి, హుమాయూన్ కు రక్షను పంపి, తన కోరికను తెలియ జేసిన క్రమంలో మొఘల్ చక్రవర్తి, మాట ఇస్తే బహదూర్ షాతో యుద్ధం చేసి, రక్షించినట్లు కథనాలు. ఇలా పూర్వకాలం నుండి భార్య ప్రేమకు, అనురాగాలకు, రక్షణకు ప్రతీకగా రక్షాబంధనానికి ప్రత్యేకత ఉంది. "హయగ్రీవ జయంతి'గా, 'జంధ్యాల', 'రాఖీ', 'నారీ పూర్ణిమగా పేరెన్నిక గన్న శ్రావణ పౌర్ణమి సర్వజనులకు పర్వ దినం. ఉపవాసాలకు ఉద్దిష్టమైన పండుగ కాక, హిందువులలో అన్ని తరగతుల వారూ వర్షాకాలపు రాకకు సంతసిస్తూ, మధుర పదార్థాలు భుజించడం అనుసరణీయమైన ఆహారం. పూర్వకాలంలో శ్రావణ పూర్ణిమ నాడు ఉపాకర్మానంతరం వేదవిద్య ప్రారంభించడం జరిగేది. ఉపాకర్మ పండుగకాక అధ్యయయానికి సంబంధించిన కర్మ. ఉప నయనము అనగా అదనపు కన్ను. గురువు తన ప్రజ్ఞా ప్రాభవముల చేత వటువునకు జ్ఞాన నేత్రమును తెరిపించడమన్నది పరమార్థం. యజ్ఞం, ఉపవీతంతో కలిస్తే యజ్ఞోపవీతం. ఉప వీతమంటే దారము. యాగకర్మ చేత పునీతమైన మూడు పోచల దారం. సృష్టి స్థితి, లయకారులైన త్రిమూర్తులను సూచించేవి ఒక్కో ముడిలోని మూడు తాళ్ళు.

**ప్రాశస్త్యం...** సర్వరోగ ఉపశమనం, సర్వాశుభ వినాశనం కోసం ధర్మజుడు శ్రీకృష్ణుడిని ఉపాయం అడుగగా, రక్షాబంధన విధి ఉపదేశించినట్లు, దేవాసుర యుద్ధంలో ఇంద్రుని ఇంద్రాణి రక్షాబంధనం చేసి, విజయం సాధింప చేసినట్లు శ్రీకృష్ణుడు వివరించిన సందర్భం పురాణ కథనం. రక్షాబంధనం భార్య, భర్తకు కట్టాలని ఉన్నా ఆచరణలో సోదరియో, కూతురో కట్టే ఆచారాన్ని ప్రతోత్సవ చంద్రిక వివరిస్తుంది. శ్రావణ పూర్ణిమ రాఖీ పూర్ణిమ. రాఖీ అంటే తోరము. తోరం పట్టుదారముతో లేదా నూలుదారంతో చేయబడుతుంది. రాఖీ అనేది ఒక ఆభరణం లాంటిది. రంగుదారంతో లేదా కాగితంతో చేసి, దానికి తోరం జోడించి, దానిని సోదరి సోదరుని ముంజేతికి కట్టడం సాంప్రదాయం. బొట్టుపెట్టి హారతి నివ్వడం, సోదరుడు, సోదరికి కట్నకానుకలు సమర్పించడం ఆహారం. రాఖీ ప్రాధన్యతను బట్టే ఒక స్త్రీ పురుషులు రాఖీ పంపి లేదా కట్టి ఆతనిరక్ష కోరే ఆచారం ఏర్పడింది. దానిని అందుకోవడం తోనేఅతడు ఆమెకు సోదరుడై రక్షకుడవుతాడని భావన.

**రామ కిష్టయ్య సంగన భట్ల – సీనియర్ జర్నలిస్టు, కాలమిస్ట్...9440595494**

# ఉన్నత విద్యపై నిశిత దృష్టి

మెట్‌పల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారుగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3 వేలమంది, రెండో సంవత్సరం 2500 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఉత్తమ విద్యనందించేందుకు ప్రతి కళాశాలకు 13 సీసీ కెమెరాలతోపాటు ఒక కంప్యూటర్‌ను ఏర్పాటు చేశారు. తరగతి గదులతోపాటు ప్రిన్సిపల్ కార్యాలయంలో, కళాశాల ఆవరణలో తదితర చోట్ల వాటిని బిగించారు. ప్రిన్సిపల్ గదిలో ఏర్పాటుచేసిన కంప్యూటర్‌కు సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. ఎప్పటికప్పుడు వీటి పర్యవేక్షణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించారు.

**మెట్‌పల్లిలో 16 కెమెరాల పర్యవేక్షణలో**

మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి సుమారు 563 మంది విద్యార్థులున్నారు. వీరికి సీసీ కెమెరాల నడుమ ఉత్తమ బోధన అందిస్తున్నారు. 13



కొత్తవి కాగా పాతవి మూడింటితో మొత్తం 16 కెమెరాలను బిగించారు.

**ప్రతి కళాశాలపై ప్రత్యేక దృష్టి**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనపై ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు సీసీ కెమెరాలను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చూసేలా ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల సంఖ్య తక్కువ లేకుండా చూడటం.. బోధన, అధ్యాపకుల పనితీరు తదితర అంశాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉండనుంది. ఏడాదిపాటు ఓ సంస్థకు సీసీ కెమెరాల బాధ్యతలను అప్పగించారు.

**ఉత్తమ ఫలితాల కోసమే..**విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసింది. గత 20 రోజుల క్రితం జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమెరాలను బిగించి ప్రస్తుతం వాటి పర్యవేక్షణలోనే కళాశాలలు కొనసాగుతున్నాయి. విద్యార్థులతోపాటు అధ్యాపకులపై హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల ప్రత్యేక పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉంటుంది. – నారాయణ, ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి

# ఆకట్టుకునే రంగు.. శుభ్రత కరవు

వేములవాడ: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి కాలంలో హోటళ్లు, రెస్టారెంట్లు, తినుబండారాల తయారీలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి వాటిని ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందేలా చూడాల్సిన అధికార యంత్రాంగం నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేములవాడ పట్టణంలో మున్సిపల్ రికార్డుల ప్రకారం 4 బార్ అండ్ రెస్టారెంట్లు, 7 హోటళ్లు, 31 టిఫిన్ సెంటర్లున్నట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ అనధికారికంగా అనేకం కొనసాగుతున్నాయి. తినుబండారాల దుకాణాలూ ఎక్కువగానే ఉన్నాయి. వీటిలో ఆహార భద్రత నియమ, నిబంధనలు గాలికొదిలేసి పదార్థాలను తయారు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పట్టణంలోని ఓ హోటల్‌లో ఇటీవల ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలో పెద్దఎత్తున కుళ్లిన మాంసం, ఆహార పదార్థాలు, బిర్యానీ వంటి వెలుగు చూడటం కలకలం రేపింది. ఈ సంఘటన పట్టణంలోని హోటళ్లలోని పరిస్థితికి అద్దం పట్టింది.

**అపరిశుభ్ర వాతావరణంలో..**

వేములవాడ ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో ఇక్కడికి రాష్ట్రంలోని భక్తులు, ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు



వస్తుంటారు. ఇలాంటి వారు భోజనాలను, టిఫిన్స్‌ను పట్టణంలోని వివిధ రెస్టారెంట్లు, హోటళ్లలో, టిఫిన్ సెంటర్లలో ఆహార పదార్థాలను వినియోగిస్తుంటారు. ఇలాంటి పట్టణంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను ప్రజలకు, భక్తులకు అందించే విధంగా చర్యలు చేపట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఆకర్షణీయ రంగులతో, శుచి శుభ్రత లేని ఆహార పదార్థాలను ప్రజలకు అంటగట్టి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలున్నాయి.

రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో వంటకాలు అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్నారు. వంట గదులు దుర్వాసన, కుళ్లిన వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉన్నప్పటికీ అందులోనే ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. శుభ్రమైన నీటితో, ఏ రోజుకు సరిపడా ఆరోజు మాంసం వండాల్సి ఉండగా చాలా హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో వాటిని రిఫ్రిజిరేటర్లలో నిల్వ చేస్తూ చాలా రోజుల తరబడి వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడో ఓసారి తనిఖీలు చేసి నామమాత్రం జరిమానాలు వేసి వదిలేయడంతో తిరిగి యథావిధిగా కొనసాగుతున్నాయి.

'వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని హోటళ్లను తనిఖీ చేసి దాదాపు పది కేసుల వరకు నమోదు చేశామ'ని ఆహార భద్రత తనిఖీ జిల్లా అధికారిణి అనూష పేర్కొన్నారు.

# పంద్రాగస్టుకు.. పాలు పొంగేనా..!



నల్గొండ : పేదలకు సొంతింటిని సమకూర్చాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పదేళ్లయినా పూర్తి కావడం లేదు. రెండు విడతలుగా ఇళ్లు మంజూరు చేసినా కొన్ని పనులు ప్రారంభానికి నోచుకోలేదు.. నిర్మాణం చేపట్టినవి పూర్తి కాలేదు. కొన్ని పూర్తయినా లబ్ధిదారులను ఎంపిక చేసి అప్పగించలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఈనెల 15 వరకు రెండు పడక గదుల కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులు పూర్తి చేయించి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఆ మేరకు అక్కడక్కడ మౌలిక వసతులకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. అయితే ఈ పనులు ఈ నెల 15 వరకు పూర్తి అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5.30 లక్షలు, మౌలిక వసతులకు రూ. 75 వేలను కేటాయించింది. వసతుల కల్పనకు కేటాయించిన నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో పనులు జరగడం లేదు. రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించలేదు. జిల్లాలో 2859 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పూర్తైంది. వీటిలో ఇప్పటివరకు 908 మంది లబ్ధిదారులకు అప్పగించారు. కొన్ని గ్రామాల్లో గృహాలు నిర్మించి అయిదేళ్లు అయినా మౌలిక వసతులు కల్పించక నిరుపయోగంగా మారాయి. దర్వాజలు, కిటికీలు చెదలు పడుతున్నాయి. గృహాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాలు తస్కరణకు గురవుతున్నాయి.

నల్గొండ పట్టణంలోని గొల్లగూడలో 522(జీ+2) గృహాలను నిర్మించారు. వీటిలో మౌలిక వసతులకు ఇటీవల పనులు చేపట్టారు. మురుగుకాల్వల పైపులైన్లు ఏర్పాటు, భూగర్భ డ్రైనేజీ ట్యాంకు నిర్మాణం కొనసాగుతోంది. అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు ఇంకా చేపట్టలేదు. కొన్ని గృహాలకు కిటికీలకు ఏర్పాటు చేసిన అద్దాలు పగిలిపోయాయి. గృహాలకు లబ్ధిదారులను ఎంపిక చేసి ఏడాదైనా వారికి అప్పగించలేదు. ఇటీవల కొందరు ఆక్రమించుకునేందుకు వెళ్లగా పోలీసులు, అధికారులు అడ్డుకోవడంతో ఆందోళనకు దిగారు.

కనగల్ మండలం పొనుగోడులో 75, నల్గొండ మండలం అన్నారెడ్డిగూడెంలో 75 చొప్పున ఇళ్లను నిర్మించారు. వసతులు కల్పించారు. లబ్ధిదారులకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాయి. నల్గొండ మండలం దోమలపల్లిలో 70, తిప్పర్తిలో 100(జీ+2), కనగల్ మండలం చర్లగౌరారంలో 70 ఇళ్ల నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. మిగతా పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు.

# గుట్టుగా మట్టిదందా..!



భువనగిరి : నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు.. అనుమతులు ఉల్లంఘిస్తున్నారు.. చెరువు కుంటల్లో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారు.. దళారులు మట్టిని తరలిస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. సీనరేజికి గండీ కొడుతున్నారు.. యాదాద్రి భువనగిరి జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న మట్టి దందాను పరిశీలన చేయగా.. పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలో 1200లకు పైగా చిన్న, పెద్ద చెరువులు, కుంటలు ఉన్నాయి. వర్షాలు పడక, చెరువులు నిండకపోవడంతో మట్టి తవ్వకాలు జోరుగా చేస్తున్నారు. నీటి పారుదలశాఖ అధికారులు చెరువులు పరిశీలించి తవ్వకాలకు అనుమతులు ఇస్తారు. వాటికి ముప్పు కలగకుండా నిర్దేశించిన మేరకు రుసుములు చెల్లించి తవ్వకాలు చేపట్టాలి. కొంత భాగాన్ని అనుమతి తీసుకుంటూ.. ఎక్కువ తవ్వకాలు చేపడుతున్నారు. రూ. 26 చొప్పున సీనరేజీ, ఇతర పన్నులు రూ. 35, మొత్తంగా రూ. 56 టన్నుకు చెల్లించాలి. నింబంధనలు ఉల్లంఘిస్తే సీనరేజి టన్నుకు రూ. 26కు ఐదు రెట్లు జరిమానా విధిస్తారు. బొమ్మలరామారం మండలంలోని చీకటి మామిడి, లక్ష్మీతండా, దేవునితండా, బీబీనగర్ మండలంలోని ఇటుకబట్టీల వద్ద గుట్టలను తలపించే డంపులు కనిపిస్తాయి. ఆ దిబ్బలను లెక్కిస్తే ఏ మేరకు అక్రమాలు జరిగాయో లెక్కతేలుతుంది.

ప్యారారం చెరువులోంచి ఇటీవల సుమారుగా 400 టిప్పర్లలో మట్టి తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది మర్యాల చెరువుల్లో నియోజకవర్గ ముఖ్య నేత అనుచరుడు అనుమతులకు మించి తవ్వకాలు జరిపినట్లు ఫిర్యాదు చేయగా.. మైనింగ్ అధికారులు విచారణ జరిపి జరిమానా విధించారు. మోటకొండూరు, కాటేపల్లి, మాటూరు, చాడ చెరువులలో ఇటీవల వరకు అనుమతులకు మించి మట్టి తరలించుకుపోయారు.

మోత్కూరు పురపాలిక పరిధిలో ఇంగీసమ్మ కుంట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. స్థానికంగా ఇళ్ల నిర్మాణానికి బరంతిలు నింపడానికి ఉపయోగిస్తున్నారు.

రాజపేట మండలం చల్లూరు, నెమిల, దూదివెంకటాపురం, చల్లూరు, బేగంపేట గ్రామాల శివారుల్లోని చెరువుల నుంచి మట్టి తరలింపు జోరుగా సాగుతోంది. ఇటీవల రాజపేట మండలంలో తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సుమారుగా రూ. 1.30 లక్షలు జరిమానా విధించారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటున్నాం

మట్టి అక్రమ తవ్వకాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటున్నా. చెరువుల్లో తవ్వకాలకు నీటిపారుదల శాఖ అధికారులు అనుమతుల మేరకు సీనరేజీ వసూళ్లు చేస్తున్నాం. నీటి పారుదల శాఖ ఇచ్చిన అనుమతుల మేరకు తహసీల్దార్ ఎన్‌వోసీ జారీ చేస్తే మాత్రమే తవ్వకాలు జరపాలి.

రాఘవరెడ్డి, ఏడీఏ భూగర్భ శాఖ

# విధుల లేమితో.. నిరుపయోగం



గోదావరిఖని : వయోవృద్ధులు, విశ్రాంత కార్మికుల మానసిక, శారీరక ఉల్లాసం కోసం రామగుండం నగరపాలక ప్రాంతంలోని అయిదు కాలనీల్లో కేంద్రాల(సీనియర్ సిటీజన్ హాళ్లు) నిర్మాణం చేపట్టారు. పుష్కరకాలం కిందట ఒక్కొక్కటి రూ. 10 లక్షల అంచనా వ్యయంతో భవన నిర్మాణాలు చేపట్టగా అంచనాలను మార్చడంతో నిధులు సరిపోక నిర్మాణాలను అర్థాంతరంగా ఆపేశారు. తర్వాత మరో రూ. 5 లక్షలు కేటాయించడంతో భవన నిర్మాణాలు పూర్తయినా వాటిని వినియోగంలోకి తేవడాన్ని అధికారులు విస్మరిస్తున్నారు. శాసనసభ నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ. 5 లక్షలతో సుమారు ఒకటిన్నర దశాబ్దం కిందట ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో చేపట్టిన వయోవృద్ధుల కేంద్ర భవనం నిధుల లేమితో నిర్మాణం పూర్తికాలేదు. సుమారు నాలుగేళ్ల కిందట రామగుండం ప్రాంతాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక నిధులతో నగరంలోని పది చోట్ల సీనియర్ సిటీజన్ హాళ్ల నిర్మాణానికి రంగం సిద్ధం చేసినప్పటికీ స్థలాభావంతో ఆచరణకు నోచుకోలేదు.**సదుపాయాలు కల్పించి** నగరపాలక ప్రాంతంలోని వయోవృద్ధుల కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన సదుపాయల కల్పనపై దృష్టి సారించాల్సి ఉంది. అదనంగా నిధులు కేటాయించి ఆయా భవనాల్లో టెలివిజన్, తాగునీరు, మరుగుదొడ్లు, బల్లలు, కుర్చీలు, వయోవృద్ధులకు ఉపయోగపడేలా వ్యాయామ పరికరాలు, దిన పత్రికలను సమకూర్చాల్సి ఉంది.

నెరవేరని లక్ష్యంవయోవృద్ధుల కేంద్రం ఆవరణలో ఆహ్లాదాన్ని పంచే ఉద్యానవనం, భవనంలో గ్రంథాలయం, టెలివిజన్, బల్లలు, కుర్చీలు, దిన, వార పత్రికలు, మూత్రశాలలు, తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉండగా కేవలం భవన నిర్మాణాలకే నగరపాలిక పరిమితమైంది. రామగుండంతో పాటు గోదావరిఖనిలోని లాల్‌బహదూర్‌నగర్, మల్లికార్జున్‌నగర్, తిలక్‌నగర్, విఠల్‌నగర్‌లో వయోవృద్ధుల కేంద్రాలు నిర్మించారు. ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. రామగుండంలోని వయోవృద్ధుల కేంద్రం ఆవరణలో పట్టణ ప్రకృతి వనం, విఠల్‌నగర్‌లో ఉద్యానవనం ఏర్పాటు చేశారు. మల్లికార్జున్‌నగర్, తిలక్‌నగర్, లాల్‌బహదూర్‌నగర్‌లోని వయోవృద్ధుల భవన నిర్మాణాలు పూర్తయినా విద్యుత్తు, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించడం లేదు. వయోవృద్ధుల కేంద్రాన్ని ప్రారంభించేందుకు గతంలో ప్రయత్నించినప్పటికీ ప్రజాప్రతినిధుల్లో నెలకొన్న విబేధాలతో వాయిదా వేశారు. ఆయా భవనాల సమీపంలో అభివృద్ధి పనులు చేపడుతున్న గుత్తేదార్లు గోదాములుగా వినియోగించుకుంటున్నారు.

# చకచకా విద్యుత్తు పనులు

ధర్మపురి : ధర్మపురి పురపాలికలో దశాబ్దాలుగా పలు విద్యుత్తు సమస్యలు నెలకొనగా వీటిని పరిష్కరించేలా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇటీవల ధర్మపురి పట్టణానికి చెందిన వివిధ రకాల విద్యుత్తు తీగలు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు స్తంభాలు ఇతరత్రా అంశాలపై మంత్రి లక్ష్మణ్‌కుమార్ విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. రూ. 1.16 కోట్ల నిధులతో పనులు చేపట్టేందుకు పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రతిపాదించగా నిధులు మంజూరయ్యాయి. ఆయా పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

**ప్రధాన వీధుల్లో త్రీఫేజ్**

పురాతన విద్యుత్తు తీగలు, తరచూ కోతుల బెడద వెరసి విద్యుత్తు సరఫరాలో పలు సమస్యలు నెలకొంటున్నాయి. క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు దీనిపై సర్వే చేపట్టారు. ప్రస్తుతం 15 స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారుల పక్కన వేలాడే విద్యుత్తు తీగలు తొలగించి నూతన తీగలను ఏర్పాటు చేశారు. చిన్న వీధుల్లో త్రీఫేజ్ విద్యుత్తు కనెక్షన్లను కేటాయించారు. ఆయా పనులు వేగంగా కొనసాగు



తుండగా.. ప్రధాన వీధుల్లో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా అవుతోంది.

**పరిష్కరించే దిశగా చర్యలు**

శివారు కాలనీల్లో ఇంకా విద్యుత్తు లోవోల్టేజీ సమస్యలు నెలకొని ఉండగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో నిర్మాణంలోని అదనపు విద్యుత్తు సబ్ స్టేషన్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి. 8 మీటర్ల విద్యుత్తు స్తంభాలు 111, తొమ్మిది మీటర్ల స్తంభాలు 500 మంజూరు చేశారు. ధర్మపురి నుంచి కమలాపూర్‌కి వెళ్లే మార్గంలో రహదారి పక్కన విద్యుత్తు త్రీఫేజ్ లైన్లు ఏర్పాటు చేశారు. 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణం దాదాపుగా పూర్తయింది.

**అభివృద్ధి దశలో ఉన్నాయి**ధర్మపురి పట్టణంలో మెరుగైన విద్యుత్తు సేవలకు ప్రభుత్వానికి రూ. 1.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగా ఆయా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో పట్టణంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరాతో సమస్యలు తొలగిపోనున్నాయి. – రవి, ఏఈ, ధర్మపురి

# పత్తిపాకకు మోక్షం

పెద్దపల్లి : జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణకు పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన పత్తిపాక జలాశయం నిర్మాణానికి ఎట్టకేలకు కార్యాచరణ మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉద్దేశించిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి జలాశయం(పత్తిపాక) డీపీఆర్(ప్రాజెక్టు నిర్మిత ప్రాంతం నైసర్గిక స్వరూపం, సర్వే నివేదిక) కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.10 కోట్లు విడుదల చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన ఈ జలాశయం నిర్మాణం జరిగితే పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురితో పాటు చొప్పదండి నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. అయితే ఇన్నాళ్లు కాగితాలకే పరిమితమైన ఈ ప్రాజెక్టు కోసం రైతుల ఎదురుచూపులు త్వరలో ఫలించనున్నాయి.

**ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోత..**

పత్తిపాక జలాశయం ప్రతిపాదిత స్థలం మూడువైపులా గుట్టలతో ప్రాజెక్టు నిర్మాణానికి అత్యంత అనుకూలమైందని నీటిపారుదలశాఖ అధికారులు గతంలో గుర్తించారు. 3 నుంచి 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని పంపిస్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 400 ఎకరాల అటవీభూమి, 1,300 ఎకరాల రెవెన్యూ భూమి సేకరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులోకి ఆరు లింకుల ద్వారా నీటిని పంపిస్తారు. ఇందు కోసం మేడారం జలాశయం నుంచి దేవికొండ వరకు ఇదివరకే లిఫ్ట్ పనులు జరిగాయి. దేవికొండ నుంచి పత్తిపాక జలాశయానికి లిఫ్టు ద్వారా, గ్రావిటీ కాలువ ద్వారా రెండు విధాలా నీటిని పంపించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రాజెక్టు నీటిని నేరుగా కాకతీయ కాలువలోకి పంపించి రేవెల్లి సమీపంలో హెడ్ రెగ్యులేటర్ ద్వారా డి–83, నుంచి డి–94 కాలువల వరకు నీరందిస్తారు.

**చివరి ఆయకట్టుకు తొలగనున్న కష్టాలు**

కొన్నేళ్లుగా జిల్లాలోని ఎస్సారెస్పీ కాలువ చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడటం, నీటి కోసం ఆందోళనలు చేయడం పరిపాటిగా మారింది. జిల్లాలో ప్రధానమైన డి–83, డి–86 కాలువల ద్వారా పంట పొలాలకు సాగు నీరు చేరుతుంది. డి–83 ద్వారా పెద్దపల్లి, ధర్మారం, రామగుండం, మంథని, అంతర్గాం, పాలకుర్తి, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు డి–86 ద్వారా సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు సాగునీరు అందుతుంది. చొప్పదండి, ధర్మపురి నియోజకవర్గాలలో మరో 10 వేల ఎకరాలకు అదనంగా సాగు నీరందుతుంది.

# విశిష్టతల సమాహారం.. వెయ్యేళ్ల వైభవం

మంథని పశ్చిమాభిముఖ ఆలయం.. ధ్వజ స్తంభం లేని మందిరం.. హనుమంతుడు ద్వార పాలకుడిగా ఉన్న క్షేత్రం.. ఇలా ఎన్నో విశిష్టతల సమాహారంగా విరాజిల్లుతోంది మంథనిలోని శ్రీ భిక్షేశ్వరాలయం.. పూర్వం మంత్రపురిగా పిలిచిన మంథనిలో కాకతీయుల కాలంలో నిర్మించిన అయిదు శివాలయాల్లో ఈ దేవస్థానం ఒకటి. దాదాపు వెయ్యేళ్ల కిందట ప్రతాపరుద్రుడి పాలనలో ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలున్నాయి. శ్రీ భిక్షేశ్వరాలయంలో గణపతి, అయిదు పడగల నాగదేవత, నందీశ్వరుడి విగ్రహాలున్నాయి. పానవట్టం లేకుండా దక్షిణామూర్తి(లింగం), తపస్సు చేస్తున్న రూపంలో అన్నపూర్ణాదేవి, పశ్చిమాభిముఖంగా శ్రీ భిక్షేశ్వరుడు(శివుడు) దర్శనమిస్తారు. పశ్చిమాభిముఖంతో ఉన్న శివాలయాలు ఖజూరాలోని ఖండలీయ మహాదేవ, నేపాల్‌లోని ఖాట్మండ్‌లోని పశుపతినాథ్ ఆలయాలతో పాటు తెలంగాణలో మంథనిలో మాత్రమే ఉన్నాయి. గర్భగుడిలోని లింగం(శ్రీ భిక్షేశ్వరుడు)పై బ్రహ్మసూత్రం కనిపిస్తుంది. ఆలయాన్ని స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల భక్తులు దర్శించుకుంటారు. దక్షిణామూర్తి విగ్రహం(లింగం) తమిళనాడులోని చిదంబరంతో పాటు మంథనిలోనే ఉంది. దాదాపు 900 ఏళ్లుగా ఆలయానికి ధ్వజ స్తంభం లేదని పూర్వీకులు చెబుతున్నారు. నిత్యం అభిషేకాలతో పాటు ప్రతి సోమవారం, శనివారం, నెలలో వచ్చే రెండు ఏకాదశులు, మాస శివరాత్రి, మహా శివరాత్రి సమయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. భక్తులే స్వయంగా గర్భాలయంలోకి వెళ్లి స్వామివారిని స్పృశించి అభిషేకాలు చేసుకోవచ్చు.

చురకలు



## అదిలించొద్దు.. బెదిరించొద్దు

సూర్యాపేట : వీధి కుక్కలు కనిపిస్తే వాటిని ఏమనకుండా ఉండాలి. అదిరించినా.. బెదిరించినా తిరిగి దాడిచేసే అవకాశం ఉంది. ఆగస్టు, సెప్టెంబరు శునకాల పునరుత్పత్తికి అనువైన సమయం. వాటి గోప్యతకు భంగం కలిగించొద్దు. వ్యతిరేక స్వభావం కలిగి ఉంటాయని గుర్తెరిగి మెలగాలి.

వైరస్ ఇలా సోకుతుంది: కుక్కలు కాటేస్తే లాలాజలం ద్వారా బాధిత వ్యక్తి రక్తంలోకి వైరస్ నెమ్మదిగా వెళ్తుంది. కాలి, చేతి భాగంలో కరిస్తే.. పైభాగంలో కట్టు కట్టాలి. తద్వారా వైరస్ శరీరమంతా వ్యాపించదు. గాయం వద్ద ధారాళంగా పారే నీటితో ఐదు నిమిషాలు కడగాలి. సబ్బు, పసుపు, ఇతరత్రాలు పెట్టొద్దు. ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

**రేబిస్ నివారణ:** కుక్క కరిచిన తొలిరోజు నుంచి పోస్టుబైట్ వ్యాక్సినేషన్(మూడు నెలల వ్యవధిలో) ఏడు డోసులు తీసుకోవాలి.



తద్వారా రేబిస్‌ను నివారించుచ్చు. సదరు టీకా పీహెచ్‌సీ, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తోంది. పశువులకు కరిస్తే ప్రైవేటు మందుల దుకాణాల్లో టీకా దొరుకుతుంది.

పిల్లలను, వృద్ధులను కుక్కలు లక్ష్యంగా చేసుకుంటాయి. ఈ తరుణంలో కుటుంబ సభ్యులు కన్నేసి ఉంచాలి. కళ్లలోకి సూటిగా చూడొద్దు. అనవసరంగా కర్రలు, రాళ్లతో తరమొద్దు, రెచ్చగొట్టేలా వ్యవహరించి పరుగెత్తొద్దు. అవి సమీపిస్తుంటే మౌనంగా వెళ్లిపోవాలి. ద్విచక్ర వాహనాలు వేగంగా నడిపితే కొన్ని సందర్భాల్లో వెంటపడతాయి. అనవసరంగా వాహనాల హారన్ మోగించొద్దు. ఆరోగ్యంగా ఉన్న కుక్కలు కరిస్తే రేబిస్ రాదు.. ఆ వ్యాధి ఉన్న కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని పశు వైద్య నిపుణులు జానయ్యకు తెలిపారు.

## మిరప రైతులకు ఊరట!

ఖమ్మం విదేశాలకు భారీ ఎగుమతులు లేవు.. సీజన్ అంతకన్నా కాదు.. కొన్ని నెలలుగా స్తబ్దుగా ఉన్న మిరప ధరలు స్వల్పంగా పెరుగుతుండటంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏసీ మిరప ధరల పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం క్వింటా గరిష్ఠ ధర రూ.14,150 పలకటం విశేషం. జిల్లాలోని ఖమ్మం, మధిర, వైరా, తల్లాడ పరిసర ప్రాంతాల్లో శీతల గిడ్డంగులు 49 ఉన్నాయి. వీటి నిల్వ సామర్థ్యం 51,35,500 బస్తాలు కాగా రైతులు, వ్యాపారులు 38,26,572 బస్తాలు నిల్వ చేశారు.

**స్వల్పంగా పెరుగుతున్న ధరలు**

కొద్దిరోజులుగా మిరప ధరలు స్వల్పంగా పెరుగుతున్నాయి. గత సీజన్‌లో సరైన ధర లేకపోవటం వల్ల చాలామంది రైతులు తమ పంట ఉత్పత్తులను శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచారు. అప్పటి నుంచి క్వింటా ధర రూ.13,000– 13,600 పలుకుతోంది. ఇబ్బందులు వచ్చినప్పటికీ రైతులు నష్టానికి సరకు అమ్మటం ఇష్టం లేక ఏసీల నుంచి బయటకు తీయలేదు. అత్యవసరమైనవారు మాత్రమే తక్కువ నిల్వలను అమ్ముకున్నారు.

**సాగు విస్తీర్ణం తగ్గటంతో..**

రైతులు నెల తరబడి సరకును విక్రయించకపోవటం, ఈసంవత్సరం మిరప సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గటంతో ప్రస్తుతం మిరప ధరలు ఆశాజనకంగా ఉన్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. క్వింటా ధర రూ. 15వేలకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. చైనా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్‌కు ఎగుమతులు లేకపోయినా ధర పెరుగుతుండటం రైతులకు ఊరట కలిగించే విషయం. ఇప్పుడు ఇక్కడి సరకును దేశీయంగా కొంత డిమాండ్ ఏర్పడింది. ప్రధానంగా ఉత్తరప్రదేశ్, పశ్చిమబంగా, బిహార్ రాష్ట్రాలకు ఎక్కువగా రవాణా చేస్తున్నారు. 'భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో మిరప నిల్వలు తరిగిపోయాయి. కుటుంబ అవసరాలకు గిరాకీ అధికమవుతోంది. అందుకే ధరల్లో కొంత పెరుగుదల కనిపిస్తోంది. విదేశాల నుంచి ఇప్పుడిప్పుడే ఆర్డర్లు వస్తున్నాయి. రానున్న రోజుల్లో ధరలు పెరిగే అవకాశముంది' అని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణకుమార్‌కు తెలిపారు.

## ఆగుతూ.. సాగుతూ..!

మణుగూరు బీటీపీఎస్ రైలు మార్గం పనులు ఎప్పుడు పూర్తవుతాయో అంతుపట్టడం లేదు. మణుగూరు నుంచి బీటీపీఎస్ వరకు బొగ్గు రవాణా కోసం రైలు మార్గం పనులు నాలుగేళ్ల క్రితం ప్రారంభించారు. ఇప్పటివరకు 50 శాతం పనులూ పూర్తికాలేదు. రూ.300 కోట్లతో మొదలుపెట్టిన పనులు ఇంకా బండ్ వేయటం వరకు కూడా కాలేదు. అసలు పూర్తవుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీటీపీఎస్‌కి మణుగూరు బొగ్గు గనుల నుంచి రోజుకు 15వేల టన్నుల బొగ్గు రవాణా అవుతోంది. ఇది పూర్తయితే రైలు ద్వారా బొగ్గు రవాణా కానుంది.

**స్థానికుల నుంచి వ్యతిరేకత..**

రైలు మార్గం ఏర్పాటులో స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చెరువుముందు సింగారం మీదుగా ఏర్పాటు చేస్తుండటంతో అక్కడ 29 ఇళ్లను తీసుకోవాలని కోరుతున్నారు. ఓ వైపు సింగరేణి ఓబీ గుట్టలు, మరోవైపు రైలుమార్గం వెళ్లటాన్ని గాంధీనగర్ వాసులు వ్యతిరేకిస్తున్నారు. రామానుజవరంలో పనులు చేపట్టడాన్ని గ్రామస్థులు వ్యతిరేకిస్తుండటంతో ఆవరోధాలు ఏర్పడుతున్నాయి.

**కొలిక్కిరాని భూ సేకరణ**

మణుగూరు నుంచి బీటీపీఎస్ వరకు 16కి.మీ రైలుమార్గం వేస్తున్నారు. ఇందుకోసం మణుగూరు, సమితిసింగారం, రామానుజవరం గ్రామాల నుంచి ప్రభుత్వం ఆర్ఓఎఫ్ఆర్‌తో కలిపి 129 ఎకరాల మేర భూమిని సేకరించింది. ఆ భూమి విషయంపై కుటుంబీకుల మధ్య వివాదం, పరిహారం పెంచాలని కొంతమంది కోర్టు మెట్లు ఎక్కారు. 47 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా 6 కి.మీ భూమిని సేకరించాలి. పరిహారం చెక్కులు తీసుకోనివారు మరో 200 మంది నిర్వాసితులు ఉన్నారు. ఈ నేపథ్యంలో రైలు మార్గం పూర్తి చేయటం జెన్కోకు సవాల్‌గా మారిందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

రెవెన్యూ నుంచి భూమి ఇవ్వకపోవటంతో ఆలస్యం అవుతోంది. భూమి ఇవ్వగానే ఏడాదిన్నరలో రైలుమార్గం పనులు పూర్తి చేస్తాం. ఎప్పటికప్పుడు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నాం.
బిచ్చన్న, సీఈ

## ఆదిలోనే గుర్తిస్తే.. ఆటంకాలు తప్పినట్లే



ఆలేరు : విద్యార్థులు ఇతరులతో మెదిలే తీరు, అలవాట్లు, నడవడిక వారికి భవిష్యత్తులో ప్రభావం చూపుతుంది. విద్యాలయాల్లో ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు ఏరోజుకారోజు మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత ఉంటుంది. ఇందుకు పాఠశాలలో నిర్వహించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) చక్కటి వేదికగా వినియోగించుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి నెలా మూడో శనివారం పీటీఎం నిర్వహించాలి. కొన్నిచోట్ల పీటీఎం సమావేశాలు అంతగా నిర్వహించక పోగా మరికొన్ని చోట్ల పీటీఎం సమావేశాలకు 30 శాతమైనా విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావడం లేదు. బడిలో విద్యార్థుల ప్రవర్తన ఉపాధ్యాయులకు తెలుస్తుంది. ఇంట్లో పిల్లల నడవడిక తల్లిదండ్రులకు తెలుస్తుంది. ఒకరికొకరు తెలుసుకుని పరిష్కార మార్గం కనుగొనాల్సి ఉంటుంది.

**ఏం జరుగుతుందంటే...**

సామాజిక మాధ్యమాల ప్రభావంతో పిల్లలు, తల్లిదండ్రుల మధ్య అంతరం ఏర్పడుతోంది. తల్లిదండ్రులు నెలకోసారైనా పాఠశాలకు వెళ్లి తమ పిల్లల ప్రగతిని తెలుసుకోవడం లేదు.

కొందరు విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియకుండా పాఠశాలకు దుమ్మా కొడుతున్నారు. తోటి విద్యార్థులు గేలిచేస్తున్నారనే ఆవేదనతో చదువులపై దృష్టి పెట్టడంలేదు. ఇళ్లలో పిల్లల ముందే కుటుంబ సభ్యులు గొడవలు పడుతున్నారు. ఇది వారిపై ప్రభావం చూపుతోంది.

కొందరు విద్యార్థులు చురుకుగా లేకపోయినప్పటికీ ఉపాధ్యాయులు కొందరు పట్టించుకోవడం లేదు.

**ఇరువురి పాత్రకీలకం**

పిల్లలు క్రమశిక్షణతో కూడిన ఎదుగుదలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం. కుటుంబంలోని పెద్దలు పిల్లలకు రోజూ కొంత సమయం కేటాయించి వారి చెప్పింది విని అర్థం చేసుకోవాలి. ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు ఎలా ఉంటున్నారనేది స్నేహపూర్వకంగా ఆరాతీయాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల శ్రద్ధ పెడితే పిల్లలకు క్రమశిక్షణ అలవడుతుంది.
ఎర్ర లక్ష్మి, ఎంఈవో, ఆలేరు

## గుంత తీస్తేనే.. ఇంకేను..!



సూర్యాపేట : సూర్యాపేట విద్యానగర్ కాలనీ అధిక జనసాంద్రత ఉన్న ప్రాంతం. అంతటా సీసీరోడ్లు వేశారు. ఇళ్లలోనూ సీసీ పరిచారు. వర్షం, వాడకం నీరు నేలలో ఇంకే పరిస్థితి లేదు. దీంతో వేసవిలోనే కాదు.. వర్షాకాలంలోనూ భూగర్భ జలాలు పడిపోతూ నీటి ఎద్దడి తలెత్తుతోంది. కుళాయి నీరే దిక్కు.. ఇంకుడు గుంతలు నిర్మిస్తే ఈ పరిస్థితి ఉండేది

జిల్లాలోని పురపాలికల్లో ఇంకుడు గుంతల నిర్మాణం అటకెక్కింది. కొత్తగా ఇళ్లు నిర్మించుకొనేవారు కూడా అనుమతి తీసుకుంటున్నారు. కానీ నిర్మాణం చేపట్టడం లేదు. దీంతో చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ జలమయమవుతున్నాయి.

సూర్యాపేటలో అపార్ట్‌మెంట్లు, వీటిపై అవగాహన ఉన్నవారే మాత్రమే నిర్మించుకుంటున్నారు. వార్డుల్లో ప్రధాన చోట్ల వీటిని నిర్మించాల్సి ఉన్నా పుర అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో నిర్మించినవి ప్రస్తుతం కనుమరుగయ్యాయి. వాటికి మరమ్మతు కూడా చేపట్టడం లేదు. దీంతో వర్షం నీరు ఇంకే పరిస్థితి లేకుండాపోతోంది.

**నేరేడుచర్లలో నామమాత్రం**

పురపాలికలో నిర్మాణం నామమాత్రంగానే ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లలో మాత్రమే ఉన్నాయి. పట్టణంలో సీసీరోడ్ల నిర్మాణం పెరుగుతున్నందున భూగర్భ జలాలు పెరగాలంటే వీటి నిర్మాణం తప్పనిసరి. ఇంటి నిర్మాణ అనుమతుల సమయంలో ఏర్పాటు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారే తప్ప ఆ తర్వాత చర్యలు తీసుకోవడం లేదు. నేరేడుచర్ల గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి గుంతలు తప్ప కొత్తగా లేవు.

**అవగాహన లేక**

తిరుమలగిరి పురపాలికలో ఇంటినిర్మాణాలకు దరఖాస్తు చేసుకునే వారికి అధికారులు ఇంకుడుగుంతల నిర్మాణాలతో కలిగే లాభాలు వివరించడం లేదు. దీంతో ప్రజలకు అవగాహన లేక వాటిపై ఆసక్తి చూపటం లేదు. చిన్నపాటి వర్షానికే రోడ్లపై వరదపారి కాలనీలోకి చేరుతున్నాయి.

**సంతకాలకే పరిమితం**

హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో ఇళ్ల నిర్మాణ సమయంలో చేపడతామని అనుమతి పత్రాలపై యజమానులు సంతకాలు చేస్తారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో అమలు కావడంలేదు. వ్యక్తిగతంగా ఇంటిని నిర్మించుకునే వారే కాకుండా ఇళ్లను నిర్మించి అమ్ముతున్న స్థిరాస్తి వ్యాపారులు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో పురపాలికల్లో నిర్మాణం పడకేసింది.

**తప్పక నిర్మించుకోవాలి**

భూగర్భ జలాల పెంపునకు తప్పకుండా ఇంకుడు గుంత అవసరం. కొత్తగా ఇళ్లు కట్టేవారు నిర్మిస్తేనే అనుమతి జారీ చేస్తాం. ఇళ్లను తనిఖీ చేసి నిర్మించకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. పట్టణంలో పలుచోట్ల నిర్మించిన వాటిని పరిశీలించి మరమ్మతు చేపడతాం.
హనుమంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట

## అనుగ్రహానికి కసరత్తు!



సూర్యాపేట: జిల్లాలో ఇళ్లులేని పేదల సొంతింటి కల నెరవేరబోతోంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తై.. పంపిణీ జరగని రెండు పడకగదుల ఇళ్ల విషయంలో కదలిక మొదలైంది. వీటిని అర్హులైన పేదలకు కేటాయించాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. పంద్రాగస్టు నాటికి లబ్ధిదారులకు గృహాలకు సంబంధించిన పత్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలంటూ ఇప్పటికే ఆదేశించింది. జిల్లాలో సుమారు 1369 పూర్తైన ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. వీటిని అర్హులకు అందజేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

**మరమ్మతులు అవసరం**5,424 ఇళ్లను మంజూరు చేయగా.. 3,086 గృహాలు పూర్తి చేశారు. వీటి పంపిణీ కొన్నిచోట్ల నాలుగేళ్లు, మరికొన్ని మండలాల్లో రెండేళ్లు దాటింది. ఆ ప్రక్రియ ఆలస్యం కావడంతో కొన్నిచోట్ల ఇళ్ల తలుపులు, కిటికీలు, విద్యుత్తు మీటర్లు దొంగలు ఎత్తుకెళ్లారు. మరికొన్ని చోట్ల స్థానికంగా ఉన్న పేదలు వాటిల్లోకి అనధికారికంగా చేరిపోయారు. కాగా వస్తువులు చోరీ గురైన, కిటికీల అద్దాలు ధ్వంసమైన ఇళ్లకు మరమ్మతులు చేసేందుకు గతంలో నిధులు మంజూరయ్యాయి. కానీ, చాలాచోట్ల మరమ్మతులు చేపట్టలేదు. పంపిణీ నాటికి మరమ్మతులు చేసేందుకు అవకాశాలున్నాయి. ఈ విషయంలో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి మరి.!

**ఆక్రమణలకు ప్రయత్నాలు**నిర్మాణాలు పూర్తవుతున్న చోట పేదలు ఎక్కువ సంఖ్యలో ఉండి.. ఇళ్లు తక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపిక విషయంలో సందిగ్ధం ఏర్పడింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పంపిణీ ప్రక్రియ జరగలేదు. కొన్నిచోట్ల అప్పటి ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు లబ్ధిదారుల జాబితాలపై కసరత్తు చేశారు. కొన్ని పేర్లతో సిద్ధం చేశారు కూడా. వాటికి ఆమోద ముద్రవేయటంలో ఆలస్యం జరిగింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావటం.. కొన్ని చోట్ల అప్పటి ప్రజాప్రతినిధులు ఓటమి చెందటంతో అప్పటి లబ్ధిదారుల జాబితాలను ప్రస్తుత అధికారులు ధ్రువీకరించటం లేదు. ఆయా ప్రాంతాల్లో కొత్తగా లబ్ధిదారుల ఎంపికల కోసం ప్రయత్నాలు జరుగుతుండటంతో గతంలో పేర్లు ఉన్నవారు ఇళ్లను ఆక్రమించుకొనేందుకు పలుమార్లు ప్రయత్నాలు చేయటం ఉద్రిక్తతలకు దారితీసింది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో వివాదాలకు తావులేకుండా ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. తాజాగా పంపిణీకి సిద్ధమవుతున్న క్రమంలో లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారనే విషయాలపై అధికారులు గోప్యతను పాటిస్తున్నారు.

## ప్రత్యామ్నాయం చూపరు.. పరిహారం ఇవ్వరు

సిరిసిల్ల: భవిష్యత్తు అవసరాలు.. అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు చేయాలి. దాని తగినట్లు నిర్మాణాలు ఉండాలి. కానీ సిరిసిల్లలో కరకట్ట నిర్మించిన ఇంజినీరింగ్ అధికారుల పనితీరును చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. ఈ నిర్మాణంతో 418 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. ఇక్కడి భూములు ఏడేళ్లుగా పంటల సాగుకు నోచుకోవడంలేదు. కనీసం ముంపు తొలగించేలా ప్రత్యామ్నాయ చర్యలు లేవు. ఉన్న భూమినైనా సేకరించి పరిహారం ఇస్తారా అంటే అదీ లేదు. తాజాగా వ్యవసాయాధికారులు ఈ భూములను పరిశీలించి సాగుచేయడంలేదని రైతు భరోసాలో అనర్హులుగా తేల్చేశారు. ఇటు సాగుకు నోచుకోక.. భరోసా అందక ముంపు రైతుల వేదన వర్ణనాతీతం.

**శాశ్వత పరిష్కారం ఎప్పుడో?**

మధ్యమానేరు జలాశయాన్ని 27.55 టీఎంసీ సామర్థ్యంతో నిర్మించారు. దీని వెనక జలాలు మానేరువాగు సిరిసిల్ల పట్టణం వరకు నిలిచి ఉంటాయి. నీరు నిలిచి ఉండే ప్రాంతంలో పట్టణ శివారులో వాగు



పొడవునా కరకట్టను నిర్మించారు. పట్టణం ఎగువ నుంచి వచ్చే వరదనీరు దామెరకుంట, తుమ్మలకుంట నుంచి మానేరులోకి చేరాలి. కానీ ఇక్కడి కట్టిన కరకట్ట అడ్డుగా మారింది. దీనికితోడు జలాశయంలో 20 టీఎంసీల మేరకు నీరు చేరడంతో కరకట్ట పైన ఊటనీరు ఉబికి వస్తుంది. దీంతో వరదనీరు.. ఇటు ఊట నీరుతో సిరిసిల్ల శివారులోని 418 ఎకరాలు ఏడాది పొడవునా ముంపులో ఉంటాయి.

ఈ ముంపు ప్రభావం సిరిసిల్ల పట్టణంపైనా చూపుతోంది. ఎగువ వరదంతా సాఫీగా వెళ్లలేక పట్టణంలోని పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. దీనిని తప్పించేందుకు జలాశయం ఇంజినీరింగ్ అధికారులు 120 హెచ్‌పీల సామర్థ్యంతో మూడు మోటార్లతో ఎత్తిపోతలు ఏర్పాటు చేశారు. ఏడేళ్లలో రూ.10 కోట్లకు పైనే ఈ ఎత్తిపోతల కరెంటు బిల్లులకు వెచ్చించారు. ఈ తాత్కాలిక ఉపశమనానికే ఏటా రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నారే తప్ప.. శాశ్వత ప్రణాళికలకు మాత్రం అడుగులు పడటంలేదు.

**ఏడేళ్లుగా సాగుకు నోచుకోని భూములు**


రెండు సీజన్లలో వరి సాగు చేసుకునే అయిదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పది గేదెలను పెంచుతుండేవాళ్లం. కరకట్ట నిర్మాణంతో వరదనీరు సాఫీగా వెళ్లలేని పరిస్థితి. ఏడేళ్లుగా పంటలు సాగు చేయలేని దుస్థితి. గేదెల పోషణ భారంగా మారింది. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవించేవాళ్లం. ముంపుతో కుటుంబం మొత్తం వీధిన పడింది. ఎన్నిసార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది.
– ఖాజా అఫ్జల్ మోహియొద్దీన్, సిరిసిల్ల పట్టణం

## ముర్రేడు బాధితుల గోడు పట్టదా?

కొత్తగూడెం: ముర్రేడు ముంపు బాధితుల కష్టాలు తీరటం లేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ముర్రేడు పరీవాహక ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికే నదీ తీరం వెంట పదుల సంఖ్యలో కట్టడాలు నేలమట్టమయ్యాయి. ఉన్నవాటినైనా కాపాడుకునేందుకు రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా.. ప్రభుత్వం నుంచి ఉలుకూ.. పలుకూ లేదు.

**ప్రజా సమస్యపై చిత్తశుద్ధేది..?**

ముర్రేడు రక్షణ గోడ నిర్మాణ అంశం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకంలో పడేస్తోంది. భారాస హయాంలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి స్థానిక నాయకులు ఆర్భాటంగా శంకుస్థాపన చేసినా.. ఆర్థికపరమైన అనుమతులు ఇవ్వకపోవటంతో పనులు ముందుకు సాగలేదు. కాంగ్రెస్ సర్కారు సైతం అదే బాటలో పయనించటంపై స్థానికులు ఆవేదన



వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**మంత్రుల దృష్టికి చేరినా.. స్పందన అంతంతే**

ముర్రేడు వరదల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ఏడాది క్రితం ముర్రేడు రక్షణ గోడ దస్త్రం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జలవనరులశాఖ ఈఎన్సీ వద్దకు చేరినా ఇప్పటివరకు వారి నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

**ప్రతిపాదనలకే పరిమితం**

ముర్రేడు పరీవాహకంలో కోతకు గురవుతున్న ప్రాంతాల రక్షణకు కొన్నేళ్లుగా కసరత్తు కొనసాగుతోంది. భారాస హయాంలో రూ.33.50కోట్లతో రక్షణ గోడ(గ్యాబ్రియన్ వాల్) నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. ఆర్థిక శాఖ నుంచి పరిపాలన అనుమతులు రాకపోవటంతో పనులు పట్టాలెక్కలేదు. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో గతేడాది డిసెంబర్‌లో నీటిపారుదలశాఖ అధికారులు రూ.45కోట్లతో మరోసారి ప్రతిపాదనలు పంపించారు. గ్యాబ్రియన్ వాల్ స్థానంలో తక్కువ ఖర్చుతో సాధారణ గోడ నిర్మించాలనే అంశాన్ని పరిశీలించారు. తదనంతరం ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవటంతో ముర్రేడు అంశం పక్కదారి పట్టింది. ఈ ఏడాది సైతం వరదల ముంపును ఎదుర్కోవాల్సి వస్తుండటంపై బాధితులు ఆవేదన చెందుతున్నారు. ముర్రేడు రిటైనింగ్ వాల్ నిర్మాణ ఆవశ్యకతను ఇటీవల కొత్తగూడెం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఖమ్మం, భద్రాద్రి జిల్లాల సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. తక్షణమే పనులు చేపట్టేలా నిధులు మంజూరు చేయాలని కోరారు. ముర్రేడు రక్షణ గోడ నిర్మాణంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. ఇప్పటికే రూ.45కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. సర్కారు ఆర్థికపరమైన అనుమతులిస్తే.. టెండర్ ప్రక్రియ చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. రవికుమార్, డిప్యూటీ సీఈ,

చురకలు



# ఆర్టీసీ కార్గో బుకింగ్ సేవలు ప్రైవేటుపరమా?

కరీంనగర్ : ఒకప్పుడు పార్సిళ్లు పంపించడానికి అందరూ తపాలా శాఖను ఆశ్రయించేవారు. తరువాత కొరియర్ సంస్థలు వెలిశాయి. ఇదే బాటలో ఆర్టీసీ కూడా అడుగేసి, పార్సిల్ బుకింగ్ (లాజిస్టిక్) సేవలు అందిస్తోంది. రాష్ట్రం లోపలే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా సర్వీసులు నడపడంతో గంటల వ్యవధిలోనే పార్సిళ్లు ఆయా గమ్యస్థానాలకు చేరుతున్నాయి. వినియోగదారుల నుంచి కూడా మంచి ఆదరణ లభిస్తోంది. అయితే ఇటీవల బుకింగ్ కేంద్రాల సంఖ్య తగ్గిపోవడం, సంస్థ సిబ్బందిని కుదించడంతో కార్గోను ప్రైవేటుపరం చేస్తున్నారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రీజియన్‌లోని లాజిస్టిక్ కేంద్రాలపై కథనం.

**రోజుకు రూ.3 లక్షల ఆదాయం**

కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల పరిధిలో 47 కార్గో బుకింగ్ కేంద్రాలున్నాయి. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, గోదావరిఖని స్టేషన్లలో మాత్రం వీటిని ఆర్టీసీ నిర్వహిస్తుండగా మిగిలిన 43 కేంద్రాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. కేవలం కరీంనగర్ బుకింగ్ కేంద్రం నుంచే రోజుకు రూ.1.50 లక్షలు, రీజియన్ వ్యాప్తంగా దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

ఆర్టీసీ ఉద్యోగులు మాత్రమే కౌంటర్లలో పార్సిళ్లను బుకింగ్ చేసి




డబ్బులు తీసుకునేవారు. జులై 1 నుంచి పొరుగు సేవల సిబ్బంది ద్వారా మాత్రమే బుకింగ్ ప్రక్రియ చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ సిబ్బంది డబ్బుల సంబంధిత శాఖకు జమచేసే విధులు మాత్రమే నిర్వహిస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

**కారణమేంటో..?**

కార్గో కేంద్రాల్లో పార్సిల్, బుకింగ్ బాధ్యతను పొరుగు సేవల సిబ్బంది నిర్వహిస్తుండటంతో ఆర్టీసీ సిబ్బందిని ఆయా డిపోలకు తిరిగి పంపించారు. బుకింగ్ కేంద్రాల్లో పని చేస్తున్న వారంతా కండక్టర్లు కావడం, సంస్థలో గత కొంతకాలంగా నియామకాలు లేకపోవడంతో సిబ్బంది కొరత ఉంది. సంస్థ ఉద్యోగులను తగ్గించారా? లేక కార్గోను పూర్తిగా ప్రైవేట్‌పరం చేయనున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో బుకింగ్ సేవలను ప్రైవేట్‌కు అప్పగించినట్లు సమాచారం.

రీజియన్‌లో బుకింగ్ కేంద్రాలు : 47

ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించేవి : 4

# చెరువుల్లోకి చేప చేరేనా!

పెద్దపల్లి : మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఉచిత చేపల పిల్లల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి జులై సమీపిస్తున్నప్పటికీ టెండర్ల ప్రక్రియ ఊసే లేదు. గతేడాది నాణ్యత లేని చిన్న చేప పిల్లలు పంపిణీ చేయగా.. మత్స్యకారులు అడ్డుకోవడంతో ఈ ప్రక్రియ నిలిపి వేశారు. ఈ ఏడాదైనా పంపిణీ చేస్తారా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతుండగా.. మత్స్యశాఖ మంత్రి శ్రీహరి ప్రకటన కాస్త ఊరటనిచ్చింది.

**పంపిణీ సాధ్యమయ్యేనా**

జిల్లాలో 1,073 చెరువులు, కుంటల్లో 79.31 లక్షలు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించారు. చెరువులు, కుంటలతోపాటు శ్రీపాద జలాశయంలో చేపలు, రొయ్యలు విడుదల చేస్తున్నారు. గతంలో సుందిళ్ల జలాశయంలో చేపల పెంపకం చేసేవారు. గతేడాది నుంచి గేట్లు ఎత్తేయడంతో ఇక్కడి మత్స్యకారులకు ఉపాధి కరవైంది. గతేడాది టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు చేప పిల్లలు సరఫరా చేశారు. సుల్తానాబాద్, అంతర్గాం మండలాల్లో 1.30 లక్షల పిల్లలను చెరువుల్లో ప్రజాప్రతినిధులు వదిలారు. నాణ్యత లేకపోవడంతో గతేడాదికి సంబంధించి పంపిణీ ప్రక్రియ మధ్యలోనే పూర్తిగా నిలిచిపోయింది. కాగా ప్రస్తుతం ఇప్పటికే టెండర్లు పూర్తి చేసి నీటి వనరుల్లో చేప పిల్లలను వదలాల్సి ఉంది. తక్కువ సమయంలో టెండర్లు ఖరారు చేసి పంపిణీ చేస్తారా లేదా అనే సందిగ్ధం నెలకొంది.

**సమస్యలు ఇలా..**

ప్రతి సీజన్‌లో పిల్లల పరిమాణం, మోతాదు విషయంలోనూ కచ్చితమైన ప్రామాణికత పాటించడం లేదు.

పెద్ద సైజు(80 నుంచి 100 ఎంఎం) పిల్లలు, చిన్న సైజు(35-40



ఎంఎం) పిల్లలను చెరువుల్లో వదలాలి. పోషకాహారలోపంతో రెండు కిలోలు ఉండాల్సిన చేప అర కిలోకే పరిమితమవుతోంది.

కల్తీ విత్తన పిల్లల పంపిణీ చేయడంతో రవ్వ, బొచ్చ రకాల ఉత్పత్తి పెరగకపోవడంతో నష్టం వస్తుంది.

ఆదేశాల కోసం చూస్తున్నాం

జిల్లాలో ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఇప్పటికే టెండర్లు నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం.

నరేష్‌నాయుడు, జిల్లా మత్స్యశాఖ అధికారి

జిల్లాలో ఉచిత చేప పిల్లల వివరాలు

సొసైటీలు : 281

సభ్యులు : 13,450

చేపలు వదిలే వనరులు : 1,073

ఈ ఏడాది లక్ష్యం : 79.31 లక్షలు

శ్రీపాద జలాశయం : 6,10,500

# రాయలసీమకు నామకరణం చేసిన తాత్వికుడు చిలుకూరి


## ఆగస్టు 9...చిలుకూరి నారాయణరావు జయంతి



దాదాపు 130 సంవత్సరాలు దత్తమండలాలు , సీడెడ్ జిల్లాలు అంటూ అవమాన కరంగా పిలుచుకునే ప్రాంతానికి రాయలసీమ అని గౌరవ ప్రదంగా పిలుచుకునే నామకరణం చేసింది చిలుకూరి నారాయణ రావు. 1946లో ఒక రేడియో ప్రసంగంలో చిలుకూరి నారాయణరావు తాను రాయలసీమ అన్న పేరును సూచించినందుకు గర్వపడు తున్నానని చెప్పుకోవటాన్ని ఎవరూ ఖండించలేదు. కాబట్టి ఈ పేరును చిలుకూరి నారాయణ రావే పునరుద్ధరించి ఉంటాడని భావిస్తున్నారు. 1800 సంవత్సరంలో నిజాం నవాబు ఎలుబడిలో ఉన్న నేటి సీమ ప్రాంతం సైనిక ఒప్పందంలో భాగంగా ఆంగ్లేయులకు నిజాము వదిలి వేయించు కున్నారు. అందుకే నాటి నుంచి సీడెడ్ జిల్లాలు అని పిలిచే వారు. సీడెడ్ అంటే అర్థం వదిలివేయించు కోవడం ఈ పేరు అవమానకరంగా ఉన్నదన్న పేరుతో ఆంగ్లేయులు దత్త మండలాలు అని కూడా పిలిచారు. ఇలా 1928 వరకు సాగింది. ఉత్తరాంధ్రకు చెందిన చిలుకూరి నారాయణరావు తెలుగు అధ్యాపకుడిగా అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో చేరారు. ఈ ప్రాంతంలోని గొప్పతనాన్ని పరిశీలించి, ఇంత గొప్ప చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతానికి అవమాన కరంగా సీడెడ్ , దత్తమండలాలు అని పిలవడం సరికాదని భావించారు. 1928 నవంబరులో ఆంధ్ర మహాసభలు నంద్యాలలో జరిగాయి. ఆ సభలలో సీమ నేతల కోరిక మేరకు 17,18 తేదీన దత్తమండలాల ప్రధమ మహాసభ కడప కోటి రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో చిలుకూరి నారాయణ రావు, ఘన చరిత్ర కలిగిన ఆ ప్రాంతానికి దత్త మండలం , సీడెడ్ జిల్లాలు అని పిలవడం సరికాదని శ్రీకృష్ణ దేవరాయలు ఏలిన ప్రాంతం కనుక రాయలసీమ అని పేరు పెట్టాలని ప్రతిపాదించారు. ఆ సభలో పాల్గొన్న పప్పూరి రామాచార్యులు , నీలం సంజీవరెడ్డిలు బల పరచడంతో సభ ఆమోదించింది. నాటి నుంచి రాయలసీమగా మారింది. డా.చిలుకూరి నారాయణరావు (ఆగష్టు 9, 1889 - జూన్ 22, 1951) భాషావేత్త, చరిత్ర కారులు, సంస్కృతాంధ్ర పండితులు. మద్రాసు విశ్వ విద్యాలయంలో తొలిసారిగా తెలుగు సాహిత్యంలో పి.హెచ్.డి. చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఖురాన్ గ్రంథాన్ని అనువదించిన తొలివ్యక్తి చిలుకూరి నారాయణ రావు కావడం గమనార్హం. ఆయన విశాఖపట్నం జిల్లా, పొందూరు సమీపంలోని ఆనంద పురంలో 1889, ఆగష్టు 9 న జన్మించారు. తండ్రి భీమాచారి. తల్లి లక్ష్మమ్మ. మాతృభాష కన్నడం. ఆయన శ్రీకాకుళం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసి, పర్లాకిమిడి, విజయనగరం లోని మహారాజా కళాశాలలో చదివి పట్టభద్రులయ్యారు. మద్రాసు విశ్వ విద్యాలయం నుండి తెలుగు, కన్నడం భాషలలో ఎం.ఏ. పట్టా పొందారు. పదకొండవ శతాబ్దం నాటి ఆంధ్ర భాష గురించి పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఉత్తర సర్కారు జిల్లాలలో ఇంగ్లీషు బోధన విధానం ప్రచారం చేయటానికి కొంతకాలం పాఠశాల పరీక్షకులుగా పనిచేశారు. తరువాత అనంతపురం దత్త మండల కళాశాల (తరువాతి కాలంలో గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ)లో ఆంధ్రోపన్యాసకులుగా చాలాకాలం పని చేశారు. ఆయన ఆంధ్ర విశ్వకళా పరిషత్తు చే 'కళాప్రపూర్ణ' బిరుదును, కాశీ సంస్కృత విద్యాపీఠంచే 'మహోపాధ్యాయ' బిరుదును పొందారు. 'ఆంధ్ర బెర్నార్డ్ షా' అనే బిరుదుకూడ ఆయనకు దక్కింది. చిలుకూరి నారాయణరావు గిడుగు రామ్మూర్తితో పాటు వ్యావహారిక భాషా ఉద్యమ ప్రచారానికి విశేష కృషి చేశారు. 1933 లో జరిగిన అభినవాంధ్ర కవిపండిత మహాసభ, నారాయణరావు అధ్యక్షతన ఆధునిక వ్యవహారిక భాషనే బోధన భాషగా ఉపయోగిం చాలని తీర్మానించింది. ఆలంకారికులు, వైయాకరణుల మధ్యలో తెలుగు కవులు నలిగి పోయారని భావించారు. అందుకే 1937లో వెలువ రించిన ఆంధ్ర భాషా చరిత్రను అప్పట్లోనే వాడుక భాషలో రాశారు. మద్రాసు విశ్వ విద్యాలయంలో 1930 ఫిబ్రవరి ఆరోతేదీన తొలి సారిగా తెలుగు సాహిత్యంలో పిహెచ్.డి. చేసిన పండితుడు ఆయనే. ఆయన 240 గ్రంథాలు వ్రాశారు. ఒకలక్షా యాభైవేల తెలుగు సామెతలు సేకరించారని చెపుతారు. నవ్య సాహిత్య పరిషత్తు తొలి అధ్యక్షునిగా పని చేశారు. శ్రీకృష్ణ దేవరాయ విద్యా పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షులుగా, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలు ద్రావిడ భాషలని కాల్డ్ వెల్ పండితుని సిద్ధాంతంతో చిలుకూరి విభేదించారు. తమిళ, మలయాళ భాషలకు సన్నిహిత సంబంధం ఉంది, తెలుగు భాషకు తక్కిన ద్రావిడ భాషలతో సంబంధం లేదు, స్వతంత్రమైన స్థానం ఉందన్న గ్రియర్‌సన్ వాదనతో చిలుకూరి ఏకీభవించారు. తెలుగు లోకి ఖురాన్ గ్రంథాన్ని అనువ దించిన తొలివ్యక్తి చిలుకూరి నారాయణ రావు. మొదటి "తెలుగు కురాను" (1925), రెండవ ముద్రణ 1938 పీఠికలో ఆయన ఇలా అన్నాడు "ఎన్నియో సమయములందు హిందువులకు, ముస్లిములకు కలిగిన కలహముల వలన ఆపద రానున్నపుడు ఈ యాంధ్రానువాదము ఈ రెండు మతముల వారికిని సామరస్యమును కుదిరించినది. ఇదియే గ్రంథకర్తకును, గ్రంథ ప్రకాశకులకును బహుమానము". అని పేర్కొన్నారు. ఉమర్ ఖయ్యూమ్ వ్రాసిన రుబాయత్‌లను ముత్యాల సరములు అనే పేరుతో తెలుగులో వ్రాశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# నవ్వుల పూలంగి రేలంగి - ఆగస్టు 9... హాస్య చక్రవర్తి రేలంగి జయంతి



కమెడియన్‌గా, విలన్‌గా, క్యారెక్టర్ నటుడిగా, తన ప్రతిభను అన్ని కోణాల్లో ఆవిష్కరించిన హాస్య చక్రవర్తి రేలంగి. తెలుగు సినీ హాస్యనటుల్లో తొలి పద్మశ్రీ పురస్కారం అందుకున్న కామెడీ కింగ్. తెలుగు సినీ హాస్య సామ్రాజ్యాన్ని దాదాపు రెండు దశాబ్దాలు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన హాస్యపు రారాజు రేలంగి. తెలుగు ప్రజల ఆదరాన్ని చూరగొన్నారు. 'మా రేలంగోడు' అని అభిమానంగా పిలిపించు కున్నారు. చెప్పులు లేకుండా నడచిన పాండీ బజారులో ఏనుగు అంబారీమీద ఊరేగాడు. పుట్టి పెరిగిన నేలమీద ఆయన గజారోహణం చేయించు కున్నారు. అసాధ్యాలను సాధ్యాలుగా మలుచు కున్నారు. అగ్రశ్రేణి హీరో రామారావు చేత బావా' ' అని ప్రేమతో, ఆదరంగా పిలిపించు కున్నారు. నటీనటుల చేత, జర్నలిస్టుల చేత సత్కారాలు పొందారు. దేశాధ్యక్షుని చేతిమీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకొని తొలి హాస్య నటుడిగా చరిత్ర పుటల కెక్కారు... పుట్టిన నేల తల్లిని మరవకుండా చివరి దశలో అక్కడే తనువు చాలించారు. అంతటి గొప్ప పాత తరం నటుడైన రేలంగి వెంకట రామయ్య (9 ఆగష్టు 1910 - 26 నవంబర్ 1975) జయంతి సందర్భంగా ఆయన జీవన ప్రస్థానంలో ప్రత్యేకతల గురించి తెలిపే చిరు ప్రయత్నం ఇది. రేలంగి వెంకట్రామయ్య తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ సమీపంలోని రావులపాడులో 1910, ఆగష్టు 9వ తేదీన జన్మించారు. తొలి రోజుల్లో తనపాటలు తనే పాడుకునేవారు. 'పాతాళభైరవి'లో 'వినవే బాలా నా ప్రేమ గోలా', 'తాళలేనే నే తాళలేనే అమ్మలారా ఓయమ్మలారా', పాటలుబీ విప్రనారాయణ సినిమాలో 'ఆడది అంటే లయం లయం ఆ నీడంటేనే భయం భయం' పాటబీ మిస్సమ్మ సినిమాలో 'ధర్మం చెయ్ బాబూ కాణీ ధర్మం చెయ్ బాబూ', ' సీతారాం సీతారాం, సీతారాం జై సీతారాం'బీ ఎత్తుకు పైఎత్తు చిత్రంలో 'ఎవడను కున్నావు' పాటలు వాటిలో కొన్ని మాత్రమే. సినిమాలన్నిటిలోనూ వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ, పాత్రోచితంగా సంభాషణలు నొక్కి వక్కాణించడం హాస్యనటుడిగా ఒక్క రేలంగికే సాధ్యమైంది. అందుకే హీరోతో సమాన ప్రాధాన్యంగా ఉండేలా రచయితలు రేలంగి పాత్రలను తీర్చిదిద్దారు. ఒక హీరో మరియు హీరోయిన్‌కు లభించే జీతం వలె రేలంగి వెంకట రామయ్యకు భారీ మొత్తాన్ని అందించారు. జెమినీ వారు నిర్మించిన 'బాలనాగమ్మ' (1942) చిత్రంలో తలారి రాముడు పాత్ర పోషించిన రేలంగి మళ్ళీ పదిహేడు సంవత్సరాల తరువాత శ్రీవేంకటరామణా వారు నిర్మించిన 'బాలనాగమ్మ' (1959) చిత్రంలో అదే పాత్రను పోషించడం విశేషం. అలాగే 'గొల్లభామ' (1947) చిత్రంలో ధరించిన విదూషకుడి పాత్రనే ఇరవై ఏళ్ల తరవాత 'భామా విజయం' (1967) చిత్రంలో తిరిగి పోషించారు. రేలంగి పోషించిన ఏ పాత్రైనా కథలో ప్రధాన భాగంగా ఉండేదే కానీ, అతికించినట్లు వుండేది కాదు. 'చెంచులక్ష్మి' చిత్రంలో నారదునిగా 'నీలగగన ఘన శ్యామా దేవా' అనే హరినామ కీర్తన చేస్తూ నటిస్తుంటే ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. రేలంగి కోసం 'సరదా సరదా సిగిరెట్టు ఇది దొరల్ తాగు బల్ సిగిరెట్టు' (సిరి సంపదలు), 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే' (కులగోత్రాలు), 'హరి గోవింద గోవింద' (వెలుగు నీడలు), 'ఇంగ్లీషులోన మ్యారేజి' (ఆరాధన), 'గనగజా తనయం సహృదయం' (వాగ్దానం), 'చెక్కిలి మీద చెయ్యి జేర్చి చిన్నదానా' (మాంగల్య బలం), 'ఆ దేవుడు మనిషిగ పుట్టాలిరా' (అంతస్తులు), 'నీసోకు చూడకుండ నవనీతమ్మో' (తోడి కోడళ్ళు), 'భలేచాన్సులే బలే చాన్సులే' (ఇల్లరికం) వంటి ఎన్నో సరదా పాటలు ఆరోజుల్లో సినిమాల్లో పెడితే ప్రేక్షకులు ఎంతబాగా ఆదరించారో చెప్పాల్సిన పనే లేదు. రేలంగి నటించిన చివరి సినిమా ఎన్టీఆర్ నటించిన 'నిప్పులాంటి మనిషి. 1970లో భారత ప్రభుత్వం రేలంగికి 'పద్మశ్రీ' అవార్డు ఇచ్చి సత్కరించింది. పద్మ పురస్కారం అందుకున్న తొలి హాస్య నటుడు రేలంగి కావడం విశేషం. శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయానికి రేలంగి సెనేట్ సభ్యుడుగా వ్యవహరించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు, హైదరాబాదు వారు 1955లో రేలంగికి ఘనసత్కారం చేశారు. తనవద్ద పనిచేసిన డ్రైవరుకు వృద్ధాప్యం వలన కళ్లు కనుపించక పోతే, అతనికి ఒక ఇల్లు కట్టించి నెలనెలా పించను వచ్చేలా కొంత పెద్ద మొత్తాన్ని బ్యాంకులో వేసి ఆదుకున్న మానవతా మూర్తి ఆయన. రేలంగి వృద్ధిలోకి వచ్చాక కష్టాలను, కష్టాలలో ఆదుకున్న మిత్రులను మరచిపోలేదు. తను తిండితిప్పలు లేకుండా అవస్థపడిన వాడు కనుక, తను భోజనం చేసేటప్పుడు కనీసం పాతిక మందికి భోజనం పెట్టే సదాచారాన్ని పాటించారు. నాటి అగ్ర కథా నాయకులు రామారావు, నాగేశ్వరరావు కన్నా ముందే చిత్రసీమలో అడుగు పెట్టినవాడు కావడంతో ఇద్దరూ రేలంగిని ఎంతగానో గౌరవించేవారు. వరవిక్రయం' సినిమాలో భానుమతి నటించడానికి కారకులు రేలంగి. అలాగే అంజలీదేవి 'గొల్లభామ'లో నటించడానికి ఆమెను పుల్లయ్యకు పరిచయం చేసిన వ్యక్తి రేలంగి. రేలంగి కాస్టింగ్ ఏజంటుగా పనిచేస్తుండడంతో కృష్ణవేణి, పుష్పవల్లి, హైమవతి, భానుమతి, అంజలీదేవి వంటి నటీమణుల్ని సినిమాల్లో పరిచయం చేసే గొప్ప అవకాశం రేలంగికి దక్కింది. 1910లో జన్మించి, 65 వ ఏట 1975 సంవత్సరంలో మరణించిన రేలంగి తెలుగు సినిమా మనగలిగినంత కాలం హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోతారు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# రైతు వెన్నంటి.. సేవల్లో మేటి

జగిత్యాల : పంటలపై పరిశోధన.. వంగడాల రూపకల్పన.. క్షేత్ర స్థాయి అవగాహన.. ఇలా బహుముఖ సేవలతో జగిత్యాల మండలం పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్) నాలుగు దశాబ్దాలుగా అన్నదాత సేవలో తరిస్తోంది. 1986 జులై 9న నాటి సీఎం ఎన్టీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన పరిశోధన స్థానం నేడు 40వ వసంతంలోకి అడుగు పెడుతోంది.

పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలో మొదట ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మెదక్ జిల్లాలుండేవి. అనంతరం వరంగల్‌లో ఆర్ఏఆర్ఎస్‌ను ఏర్పాటు చేసి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మెదక్ జిల్లాలను చేర్చారు. ప్రస్తుతం పొలాస పరిధిలో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని మొత్తం 10 జిల్లాల్లో పరిశోధన, విస్తరణ కార్యకలాపాలు సాగుతున్నాయి. 15 జిల్లాలకు ఇక్కడి నుంచే ప్రతి వారం రెండు సార్లు వాతావరణ బులెటిన్లు అందిస్తున్నారు. వ్యవసాయ అధికారులకు నిరంతర శిక్షణ, రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**భావి శాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతూ..**

పొలాస పరిధిలో కరీంనగర్, కూనారం, ముథోల్, ఆదిలాబాద్, రుద్రూరులలో పరిశోధన స్థానాలు, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, జమ్మికుంట, రుద్రూరు, బెల్లంపల్లిల్లో ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రాలు, పొలాస, జమ్మికుంట, రుద్రూరుల్లో వ్యవసాయ



పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. పొలాసలో డిగ్రీ, పీజీ కళాశాలలు అనుబంధంగా కొనసాగుతున్నాయి. వరి, నువ్వుల్లో కొత్త వంగడాల రూపకల్పన, ఇతర పంటల్లో యాజమాన్యం, చీడపీడల నివారణ, నీటిపారుదల, ఎరువుల వాడకంపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు.

**సృష్టించిన వంగడాలు**

వరిలో పొలాసప్రభ, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, మానేరు సోన, జగిత్యాల మశూరి, కరీంనగర్ సాంబ, ప్రాణహిత, అంజన, ప్రత్యుమ్న, బతుకమ్మ, జగిత్యాల రైస్-1, జగిత్యాల వరి-2, జగిత్యాల వరి-3 రకాలను విడుదల చేశారు. పసుపులో సుగుణ, సుదర్శన, వేరుశనగలో జేసీసీ88, జగిత్యాల పల్లి-1, నువ్వుల్లో స్వేతా తిల్, రాజేశ్వరి, హిమ, చందన, జగిత్యాల తిల్-1, జగిత్యాల తిల్-2 రకాలను ఆవిష్కరించారు. రైతులు వరిలో సంకర రకాలపై మక్కువ చూపడంతో జేజీహెచ్131, జేజీహెచ్141 రకాలను శాస్త్రవేత్తలు రూపొందించారు. వరి, నువ్వుల్లో శాస్త్రవేత్తలు రూపొందించిన మరిన్ని కొత్త రకాలు రైతుల క్షేత్రాల్లో మినీ కిట్ పరీక్షల్లో ఉన్నాయి.

**దృష్టి సారిస్తే మేలు**


భారత వ్యవసాయ పరిశోధన మండలి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రకటించిన మేరకు పొలాసలో ఆవాల పరిశోధన కేంద్రం, న్యూక్లియస్ విత్తన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. పరిశోధన స్థానం ఆవరణలో నిర్మించిన ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభించాలి. మొత్తం 34 మంది శాస్త్రవేత్తలకు గాను 13 మంది మాత్రమే పని చేస్తుండగా శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి. హరితగృహం, ఆధునిక ల్యాబ్‌ల ద్వారా వంగడాల రూపకల్పన సమయాన్ని 12-13 సంవత్సరాల నుంచి ఆరేడు సంవత్సరాలకు కుదించాలి. ఆధునిక యంత్రాల తమయారీ, సంకర రకం విత్తనాల రూపకల్పన, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల క్షేత్రాలకు చేరేలా విస్తరణ కార్యక్రమాలను అమలు చేస్తే పరిశోధన స్థానం సేవలు మరింత విస్తృతమవుతాయి.

# కబ్జా చేసినా కన్నెత్తి చూడరు

గంగాధర : ఉమ్మడి జిల్లాలో పలువురు వరదకాలువ స్థలాలను సైతం ఆక్రమించి సాగు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కాలువలు కుంచించుకుపోతున్నాయి. కొందరి నిర్వాకంతో చాలామంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని వందలాది గ్రామాల మీదుగా 137 కి.మీ మేర వరదకాలువ విస్తరించి ఉంది. ఇరువైపులా దారులకు వంద మీటర్ల చొప్పున స్థలాన్ని వదిలిపెట్టగా.. దానిపక్కనే గత ప్రభుత్వం ఒక టీఎంసీ నీటిని తరలించేందుకు అదనపు కాలువ నిర్మాణాన్ని చేపట్టింది. అయితే చాలా గ్రామాల్లో వరదకాలువకు సంబంధించి మట్టి, రాళ్లను అక్రమార్కులు తవ్వుకొని తరలిస్తుండగా.. ఖాళీగా ఏర్పడిన స్థలాలను సమీపంలోని కొందరు తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. అంతకుముందే నష్టపరిహారం పొందినవారు సర్కారు భూములను కబ్జా చేశారు.

**పైపులైన్ల స్థలాన్ని సైతం..**

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, రాజన్న



సిరిసిల్ల జిల్లాల్లో ఆయా గ్రామాల చెరువులు నింపేందుకు 60 కి.మీ పొడవునా 40 మీటర్ల వెడల్పుతో రెండు పైపులైన్లు వేశారు. ఎల్లంపల్లి నుంచి ధర్మారం మండలం నందిమేడారం చెరువులోకి 11 కి.మీ, అక్కడి నుంచి గంగాధర, నారాయణపూర్ జలాశయాల్లోకి 25.50 కి.మీ, ఇక్కడి నుంచి 11 కి.మీ దూరంలో ఉన్న కొడిమ్యాలకు రెండు వరుసల పైపులైన్లు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ఆయా గ్రామాల్లో పైపులైన్ల పైభాగంలో మట్టి తవ్వి పంటలు సాగు చేస్తున్నారు. కొందరైతే అక్రమ నిర్మాణాలు చేశారు.

**అదనంగా రైతు భరోసా**

కొన్ని చోట్లయితే రెవెన్యూ రికార్డుల్లో వివరాలు సరిచేయక రైతు భరోసా సాయం కూడా పొందుతున్నారు. కాలువ స్థలాన్ని ఆక్రమించి వరినార్లు పోశారు. కాలువల దారులను దున్ని పంటలు వేస్తుండడంతో అటువైపు అధికారుల వాహనాలే కాకుండా రైతులు తమ ట్రాక్టర్లను తోలుకుపోవడం ఇబ్బందిగా మారింది. దారులు లేక రైతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రజావాణిలో అధికారులకు కొందరు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

# రొయ్యకు మళ్లీ సుంకాల దెబ్బ

నిడదవోలు : సిరుల పంటగా పేరొందిన రొయ్యల సాగుకు అమెరికా సుంకాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో భారత్ నుంచి దిగుమతయ్యే వస్తువులపై 30 శాతం సుంకాలు అమలు చేస్తామని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఆక్వా రైతులకు ఇచ్చే ధరలపై వేటు పడింది. ఆ సమయంలో వంద కౌంట్ ధర రూ.200కు పడిపోయింది. అదే సమయంలో సుంకాల అమలును మూడు నెలల పాటు వాయిదా వేయడంతో కొంతమేర ఆక్వా రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తిరిగి వంద కౌంట్ రూ.260కు చేరింది. ప్రస్తుతం ఈ నెల 1 నుంచి 25 శాతం మేర సుంకాలు వడ్డిస్తామని ప్రకటించడంతో ఆక్వా రైతుల్లో మళ్లీ అలజడి మొదలైంది.

**ఉమ్మడి జిల్లాలో 85వేల ఎకరాల్లో సాగు..** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చేపలు, రొయ్యలు 2.80 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిలో 80 వేల ఎకరాల్లో రొయ్య పంట సాగులో ఉంది. అధికంగా కోనసీమ జిల్లాలో 45వేల ఎకరాల వరకు సాగులో ఉండగా, మిగిలిన భాగం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉంది.



**మరో మూడు నెలల్లో పంట చేతికి..**

మరో రెండు మూడు నెలల్లో రైతుల వద్ద పంట ఉంటుంది. అటువంటి తరుణంలో తాజా అమెరికా సుంకాల దెబ్బ ఎంతవరకు ఉంటుందనే ఆవేదన రైతుల్లో ఉంది. మార్చి నెలలో రోజుకు రూ.10ల చొప్పున ధర పడిపోవడంతో రైతులు మానసిక ఆవేదనకు గురయ్యారు. ప్రస్తుతం వంద కౌంట్ రూ.240ల వరకు కొంటున్నారు. రైతుల వద్ద పంట చేతికి వచ్చే సమయంలో సుంకాలు అమలు చేస్తే తిరిగి గతంలో మాదిరిగానే వంద కౌంట్ ధర రూ.200లకు పడిపోయే అవకాశం ఉందని అధికారులు, ట్రేడ్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

# భద్రత తడ'బోటు'

నందికొట్కూరు : కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది.. అలలపై ప్రయాణికులను ప్రమాదకరంగా బోట్లలో తరలిస్తున్నారు. నదిలో 1,10,681 క్యూసెక్కుల నీరు పారుతోంది.. శ్రీశైల జలాశయంలో 880 అడుగుల మేర నీటిమట్టం ఉంది. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ ప్రాంతం.. నందికొట్కూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల మధ్య బంధుత్వం ఉంది.. నదిలో నీళ్లు లేనప్పుడు వాహనాల్లో వెళ్తుంటారు. ప్రస్తుతం నది ఉధృతంగా ప్రవహిస్తోంది.. నందికొట్కూరు నుంచి కర్నూలు మీదుగా తెలంగాణలోని పెంటవెల్లికి బస్సులో వెళ్లాలంటే 2.37 గంటలు పడుతుంది. నెహ్రూ నగర్‌లో కృష్ణా నది మీదుగా బోటులో వెళ్తే 30 నిమిషాల్లో చేరుకోవచ్చు కర్నూలు నుంచి బస్సులో ఛార్జీ రూ.140 కాగా బోటులో రూ.50 వసూలు చేస్తారు. ద్విచక్ర వాహనంపై కర్నూలు మీదుగా వెళ్లాలంటే పెట్రోలుకు సుమారు రూ.330 ఖర్చవుతుంది. బోటులో వాహనాన్ని తరలిస్తే రూ.50 వసూలు చేస్తారు. తక్కువ ఖర్చు. త్వరగా గమ్యానికి చేరుతుండటంతో చాలామంది బోట్లను ఆశ్రయిస్తున్నారు.

**నిత్యం ఆరు ట్రిప్పులు**బోటు ప్రయాణం నిషిద్ధమైనప్పటికీ పగిద్యాల మండలం నెహ్రూ నగర్, కొత్తపల్లి మండలం జానాలగూడెం, సంగమేశ్వరం ప్రాంతాల నుంచి తెలంగాణ ప్రాంతానికి యథేచ్ఛగా వెళ్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో నిత్యం నాలుగు నుంచి ఆరు ట్రిప్పుల్లో ప్రయాణికులను చేరవేస్తున్నారు. బోటు తిప్పాలంటే పర్యాటక శాఖ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. ప్రయాణికులను చేరవేసే బోటు వెంట ఇద్దరు గజ ఈతగాళ్లు, ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు ఇవ్వాల్సి ఉంది. 10 మందినే తీసుకెళ్లాలి. స్థానికంగా ఎవరూ అనుమతులు తీసుకోవడం లేదు.

# ఉపాధి అక్రమార్కులపై ఏ'ఐ'

నంద్యాల : ఉపాధిహామీ పథకంలో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయి..పనులు చేయకుండానే నిధులు స్వాహా చేస్తున్నారు. దొంగ హాజరు నమోదు చేస్తున్నారు. నేషనల్ మస్టర్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) ఆధ్వర్యంలో ముఖ ఆధారిత హాజరు విధానం అమల్లోకి తెచ్చినప్పటికీ ఉమ్మడి జిల్లాలో దొంగ మస్టర్లు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం నిర్ణయించింది. ఈ నెల 10వ తేదీ నుంచి ఏఐ ఆధారిత ముఖ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టనుంది.

**చిత్రంలో ఉన్నవారికే మస్టర్లు**

క్షేత్రస్థాయిలో 10 మంది పనిచేస్తుంటే 50 మందికి మస్టర్లు వేసి నిధులు పక్కదారి పట్టిస్తున్నారు. ఎక్కడో ఉండే వారిపేర్లతో నమోదు చేస్తున్నారు. వీటన్నింటిని గుర్తించిన కేంద్రం అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగిస్తోంది. ఏఐ ఆధారిత విధానంలో భాగంగా అప్‌లోడ్ చేసిన ఫొటోలో ఎంతమంది ఉన్నారో గుర్తిస్తారు. చిత్రంలో ఉన్నవారికే మస్టర్లు వేస్తారు. జాబ్ కార్డు ఉన్న వ్యక్తి పనికి వచ్చిన వెంటనే ఆ కూలీ చిత్రాన్ని ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతిరోజూ పని ప్రదేశంలోనే ఉదయం, సాయంత్రం వేళలో సిబ్బంది శ్రామికుల ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

**ఏటా రూ.కోట్లలో అవకతవకలు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద ఏటా రూ.కోట్లలో అవకతవకలు జరుగుతున్నాయి. 2024-25లో రూ.10 కోట్ల వరకు అక్రమాలు బయటపడ్డాయి. ఇదే సమయంలో సిబ్బంది నుంచి రికవరీ చేయడం సాధ్యం కావడం లేదు. మరికొన్నిచోట్ల అక్రమాలు వెలుగులోకి రాకుండా కొందరు అధికారులు, సిబ్బంది వివరాలు తొక్కిపెడుతున్నారు. వీటన్నింటినీ ఏఐ ముఖ ఆధారిత హాజరుతో అరికట్టాలని కేంద్రం భావిస్తోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో దొంగ మస్టర్లకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది.

# నిబంధనలకు గండి.. అక్రమాలు దండి!



అనకాపల్లి: క్వారీ నడపాలంటే ముందుగా మైనింగ్ ప్లాన్ ఉండాలి. పర్యావరణ అనుమతులు తెచ్చుకోవాలి. ఎంత విస్తీర్ణంలో తవ్వేది ముందస్తు సమాచారం ఇవ్వాలి. రవాణాకు అనుమతులు తీసుకోవాలి. జిల్లాలో కొందరు క్వారీల నిర్వాహకులు ఇవేవీ లేకుండానే కొండలను కరగదీసేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ.. సర్కార్ ఖజానాకు గండి కొడుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో కాదు.. జిల్లా కేంద్రానికి సమీపంలో జరుగుతున్నా.. మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే అదునుగా చూసుకుని అక్రమార్కులు రాత్రింబవళ్లు తేడా లేకుండా కొండలను పిండి చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 252 గ్రావెల్, స్టోన్స్, మెటల్ క్వారీలకు అనుమతులున్నాయి. కానీ.. అనధికారికంగా 620కి పైగా క్వారీలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఓ నేత అనుచరులు ఈ దందా నడిపించేవారు. ప్రస్తుతం కూటమికి చెందిన కీలక నేతలు, వారి అనుచరుల కనుసన్నల్లో మైనింగ్ మాఫియా నడుస్తోంది. వేటజంగాలపాలెం సర్వే నంబర్ 84లో ఉన్న కొండ చుట్టూ 15కి పైగా క్వారీలున్నాయి. అందులో ఏ ఒక్కదానికీ అనుమతులు లేవు. అయినా.. దర్జాగా తవ్వకాలు జరుపుతున్నారు.

**మొక్కుబడిగా తనిఖీలు...** జిల్లాలో అనధికారికంగా నడుస్తున్న క్వారీల నిర్వహణ, పేలుళ్లపై స్థానికులు ఫిర్యాదులు చేసినప్పుడు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. రెండు, మూడు వాహనాలను పట్టుకుని చేతులు దులిపేసుకుంటున్నారు. అనకాపల్లి మండలంలోని మామిడిపాలెం, తుమ్మపాల, మార్టూరు, మాకవరం పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో అక్రమ క్వారీయింగ్ నడుస్తోంది. ఇటీవల కుంచంగి ప్రాంతంలో ఓ అనధికారిక క్వారీలో తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే.. తెదేపాకు చెందిన ఓ నేత ఫిర్యాదుదారునికి ఫోన్‌చేసి ఆ క్వారీ జోలికి పోవద్దని హెచ్చరించారు. ఆ ఆడియో కొన్ని రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

**కబళిస్తున్న క్వారీ కాలుష్యం...** అనకాపల్లి పట్టణ పరిసర, గ్రామీణ ప్రాంతాల్లో క్వారీలు, క్రషర్ల నిర్వహణ అధికంగా ఉంది. అక్రమార్జనే ధ్యేయంగా కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లతో నల్లరాళ్లను తరలించేస్తున్నారు. పేలుళ్లు, వాహనాల రాకపోకలతో వెలువడే ధూళి ద్వారా ఎంతో మంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. జిల్లాలో ఇటీవల వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్వారీలు, క్రషర్ల ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించగా కళ్లుచెదిరే నిజాలు బహిర్గతమయ్యాయి. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లోని 11 గ్రామాల్లో 136 మంది కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు ప్రాథమిక పరీక్షల్లో వైద్యులు ధ్రువీకరించారు. మాకవరం, మార్టూరు, మామిడిపాలెం, వల్లూరు, బవులువాడ, చింతనిప్పుల అగ్రహారం, వేటజంగాలపాలెం, సంపతిపురం, కుంచంగి, దొంగలివానిపాలెం, సుందరయ్యపేట గ్రామాల్లో ప్రజలు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు.

**అక్రమ క్వారీయింగ్ చేస్తే చర్యలు..**

జిల్లాలో గడువు పూర్తయిన ఏ క్వారీకీ అనుమతులు ఇవ్వలేదు. వాటన్నింటిపై నిఘా పెట్టాం. నిబంధలనకు విరుద్ధంగా పేలుళ్లు, రవాణా చేస్తే అపరాధ రుసుం విదిస్తాం. వాహనాలు సీజ్‌చేసి.. క్వారీ యజమానులపై కేసులు నమోదు చేస్తాం. అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

# బాలల కళ్లల్లో 'మసక' తుపాన్



సీతంపేట: పుస్తకాలు చదవాలంటే కంటి చూపు బాగుండాలి. ఆ చూపే క్రమంగా తగ్గిపోతుంటే...రోజురోజుకు కలవరం పెరుగుతుంది. ప్రస్తుత కాలంలో పలు ఉద్యోగాలకు కంటి చూపు చాలా కీలకంగా పరిగణిస్తారు. ఓ స్థాయి దాటి లోపం ఉంటే... ఆ అవకాశాలూ చేజారిపోతాయి. అందుకే చిన్నతనం నుంచి కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న నేత్ర వైద్య పరీక్షల్లో నివ్వెరపోయే విషయాలు బయటపడుతున్నాయి. విద్యార్థుల్లో దృష్టి లోప సమస్యను గుర్తించిన ప్రభుత్వం గత నెల 21 నుంచి పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తోంది. అక్టోబరు 31 వరకు ఈ కార్యక్రమం జరగనుంది. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 16 ఏళ్ల వయస్సుగల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తారు. అవసరం ఉన్నవారికి కళ్లద్దాలు అందించే ప్రయత్నం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో నేత్ర వైద్య బృందం చేస్తోంది.

విశాఖపట్నం జిల్లాలో 595 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 54,000 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 34,500 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టింది. వీరిలో సుమారు 4,500 మందికి దృష్టి లోపం ఉండవచ్చునని అంచనా. 3,600మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమవుతాయని భావిస్తున్నారు. సోమవారం నాటికి 61 పాఠశాలల్లో 7,521మందికి నేత్ర పరీక్షలు పూర్తి చేశారు. 806 మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. వారిలో 668 మందికి కళ్లద్దాలు అవసరమవుతాయి. 138 మందిని ఇతర పరీక్షలకు రిఫరల్ చేశారు. వీరిలో ఐదుగురు మెల్ల కన్ను ఉన్నవారున్నారు.

**కారణాలు...గుర్తింపు:** బాలలకు తక్కువ వయసులోనే దృష్టి లోపాలకు కారణాలను నేత్ర వైద్యనిపుణులు పాఠశాలల్లో వివరిస్తున్నారు. బీ గర్భిణులు సరైన పోషకాహారం తీసుకోకపోవడం, పిల్లలకు విటమిన్ ఏ లోపం, కొందరు తల్లిదండ్రులకున్న దృష్టి లోపం పిల్లలకు సంక్రమించే అవకాశం ఉండటం చరవాణి, కంప్యూటర్, టీవీ అతిగా చూడటం పాఠశాల గదులు ఇరుకుగా ఉండటం, తగినంత వెలుతురు లేకుండా ఉండటం. పిల్లలు అందరిలో కలవకపోవడం, చదువులో వెనుకబడటం, ఒంటరిగా ఉండడం వంటివి గమనిస్తే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలి.

**పాఠశాలల్లో చేర్చేముందే:** 'పిల్లలను పాఠశాలల్లో చేర్చే ముందు కంటి పరీక్షలు చేయించాలి. చాలా మందికి ఎనిమిదేళ్లు వచ్చే వరకు ఈ సమస్య అంతగా బయటపడదు. గుర్తించిన వెంటనే దృష్టిలోపం పెరగకుండా కళ్లద్దాలు వాడాలి. లేదంటే వయసు పెరిగాక తగు చికిత్స చేయించాల్సి ఉంటుంది. ఆకు కూరలు, చేపలు, కాయగూరలు వంటివి ఆహారంగా అందించాలి. సాధ్యమైనంతవరకు కళ్లకు పెన్సిళ్లు, పుల్లలు తగలకుండా చూసుకోవాలి' అని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ మీనాక్షి పేర్కొన్నారు.

# ఉసురు తీస్తున్న నిర్లక్ష్యం!

చిత్తూరు :ఈ ఏడాది ఏప్రిల్‌లో పుత్తూరులోని ఈశలాపురం రెవెన్యూ పరిధిలోని ఓ గ్రానైట్ క్వారీలో బాంబులు పెట్టి రాళ్లు పేల్చారు. పక్కనే మామిడి తోటలో ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారికి బలంగా పదునైన రాయి తాకడంతో గాయపడ్డాడు. నాలుగేళ్ల క్రితం చౌడేపల్లె మండలం కడియాలకుంటకు సమీపంలోని క్వారీలో ఎలాంటి అనుమతి లేకున్నా పేలుడు పదార్థాలు అమర్చి బండరాళ్లను పగలకొట్టడంతో సమీప పొలంలో పనిచేస్తోన్న జాకీర్ అనే వ్యక్తి అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. యాజమాన్యాలకు కాసుల వర్షం కురిపిస్తున్న క్వారీలు కార్మికుల ఉసురు తీస్తున్నాయి. గనుల్లో సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం, పర్యవేక్షించాల్సిన యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరించడంతో విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో సమీపంలో ఆడుకుంటున్న చిన్నారులు, కూలీలు మృత్యువాత పడుతున్నారు. భద్రతా వారోత్సవాల సమయంలోనే కాకుండా ఏడాదిలో అన్ని రోజులూ కార్మికుల రక్షణపై దృష్టి సారించాల్సిన బాధ్యత అటు యజమానులు, ఇటు అధికారులపై ఉంది. లేదంటే బాపట్ల జిల్లా బల్లికురవ తరహాలోనే జిల్లాలోనూ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 631 గ్రానైట్ క్వారీలున్నాయి. వీటిపై దాదాపు 40 వేల మంది ఆధారపడ్డారు. ప్రభుత్వానికి ఏటా రూ.200 కోట్ల వరకు ఆదాయం లభిస్తోంది. క్వారీల్లో పనిచేయడానికి ప్రధానంగా ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్ నుంచి కార్మికులు ఎక్కువగా వస్తుంటారు. విద్యుత్తు తీగ ద్వారా (వైర్ షా) గ్రానైట్ బండను కోసే వ్యక్తుల్లో అత్యధిక శాతం మంది రాజస్థాన్ వాసులు. స్థానిక మేస్త్రీల పర్యవేక్షణలో బ్లాస్టింగ్ జరుగుతోంది. క్వారీలోని మెటీరియల్‌ను బయటకు తీయాలంటే పేలుడు పదార్థాలు వినియోగించడం తప్పనిసరి కాబట్టి ముందస్తుగానే పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం అనుమతి తీసుకోవాలి. ఎవరి నుంచి వాటిని కొనుగోలు చేస్తున్నారు? లైసెన్సు ఉందా? లేదా? అనే సమాచారం కూడా అధికారులకు ఇవ్వాలి.



**వ్యక్తిగత భద్రతా పరికరాలు ఇవ్వాల్సిందే..**

మరోవైపు క్వారీల్లో పనిచేసే వ్యక్తులకు శిరస్త్రాణం, గ్లౌజులు, షూలు, ఇతర వ్యక్తిగత భద్రతా పరికరాలు ఇవ్వాలి. కేవలం బూట్లు మాత్రమే వారికి ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల మాత్రం శిరస్త్రాణం అందిస్తున్నారు. కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేసి నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలి. వారు ఈవిషయంలో సరైన శ్రద్ధ చూపకపోవడంతోనే కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

**రిమితికి మించి వాడుతూ**

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బ్లాస్టింగ్‌కు అనుమతి తీసుకుంటున్నప్పటికీ ఆ తర్వాత పరిమితికి మించి పేలుడు పదార్థాలు వాడుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానికులు, కార్మికులు గాయపడినప్పుడో, మరణించిన సమయంలో మాత్రమే ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పేల్చే ముందు అక్కడున్న వ్యక్తులను బయటకు పంపించాలి. స్థానికులను అప్రమత్తం చేయాల్సినప్పటికీ పట్టించుకోవడంలేదు. ప్రధానంగా కుప్పం, నగరి, పుంగనూరు నియోజకవర్గాల్లో ఇలాంటి ఉదంతాలు తరచూ బయటపడుతున్నాయి. పుత్తూరులో ఈశలాపురం, బొజ్జనత్తం, శాంతిపురం మండలం సి.బండపల్లె, కుప్పం మండలం తిమ్మాపురంలోని కంకర పరిశ్రమను ఆపాలని ప్రజలు నిరసన వ్యక్తం చేశారు.

# ఇక స్మార్ట్ రేషన్ కార్డులు

ఒంగోలు : ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు అందించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే వీటిని ముద్రిస్తున్నారు. గత వైకాపా సర్కారు ఇచ్చిన బియ్యం కార్డులు ఆ పార్టీ రంగుల్లో ముద్రించారు. ఓవైపు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, మరోవైపు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలను పొందుపరిచారు. ప్రస్తుతం కొత్తగా ఇవ్వనున్నవి క్యూఆర్ కోడ్‌తో ఏటీఎం కార్డు పరిమాణంలో ఉంటాయి. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో, రేషన్ కార్డు, చౌక దుకాణం నంబర్లుబీ వెనుక వైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలు ఉండేలా ప్రణాళిక చేశారు. ఈ నెల 25 నుంచి పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

**అందరికీ లబ్ధి చేకూరేలా...**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు రేషన్ కార్డే ప్రామాణికం. అది లేకుంటే పథకాలకు దూరమైనట్లే. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కార్డుల మంజూరుకు గత మూడేళ్లుగా అర్హులైన పేద కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. గత వైకాపా సర్కారు పలు ఆంక్షలు పెట్టడంతో కుటుంబం నుంచి విడిపోయినవారు, వివాహమైన కొత్త దంపతులు బియ్యం కార్డు పొందేందుకు వీల్లేకుండా పోయింది. పేర్ల తొలగింపు, కొత్తగా పిల్లల పేర్లు చేర్పించడం వంటి వాటికీ ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం ఈ చిక్కులు తొలగిస్తూ



చిరునామా మార్పులు, సభ్యుల చేర్పులు, తొలగింపు, కొత్త కార్డుల మంజూరు, విభజనకు అవకాశం కల్పించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో మే 7 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. ప్రస్తుతం జిల్లాలో 6.71 లక్షల కార్డులు ఉండగా... కొత్తగా మంజూరు, ఉన్నవాటిలో మార్పులు చేర్పులకు ఇప్పటి వరకు 90,240 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 57,763 ఆమోదించారు.

విభాగాలవారీ వచ్చిన దరఖాస్తులు ఇలా..

కొత్త కార్డులు: 10,168 చిరునామా మార్పు: 2,200
వివరాల సవరణ: 1,480 ఆధార్ దిద్దుబాట్లు: 1,198
దుకాణం పునరుద్ధరణ: 11 కొత్తగా సభ్యుల చేర్పు: 63,738
సభ్యుల తొలగింపు: 1,481 కార్డు విభజన: 9,918
సరెండర్: 46

# పేరుకే పురమిత్ర!

ఒంగోలు ప్రజలకు సత్వర సేవలందించేందుకు రాష్ట్ర పురపాలకశాఖ ప్రవేశపెట్టిన పురమిత్ర యాప్‌ను నగర పాలక సంస్థ సక్రమంగా నిర్వహించడంలేదు. ఈ మాధ్యమంలో సమస్యలు తెలియజేసినా వారాల తరబడి కనీస సమాచారమూ ఉండడం లేదని పలువురు ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

**సమాచారం ఇవ్వాల్సి ఉన్నా...**

మార్చి 15న తుణుకులో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ప్రారంభ వేడుకలో ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఏ సమస్య ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారన్న వివరాలు సైతం పొందుపరిచారు. పని పూర్తిచేశాక ఫిర్యాదుదారుకు ఆ వివరాలు తెలియజేయాలి. వీలుకాని పని అయితే కారణాలు తెలియజేస్తూ సమాచారం ఇవ్వాలి. ఈ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. నెలవారీ సమీక్షలు కరవయ్యాయి. సకాలంలో సమస్య పరిష్కరించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్లకు ఆదేశాలిచ్చినా ఫలితం లేదు.

**కనీస స్పందన కరవు...**

ఒంగోలు నగర పరిధిలో ఇప్పటి వరకు 364 సమస్యలు యాప్ ద్వారా వచ్చాయి. వీటిలో 353 పరిష్కరించినట్లు చూపినా... సంబంధిత ఫిర్యాదుదారుకు ఆ సమాచారం ఇవ్వలేదు. సమస్య తెలియజేసిన వారు ఫోన్ చేసినా, వెబ్‌సైట్‌లో తమ విజ్ఞప్తిని నమోదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఉదాహరణకు సాంబశివనగర్ మొదటి లైన్‌లో ఐకాన్ గ్లోబల్ స్కూల్ పక్కన రహదారి వెంట ఉన్న కొబ్బరిచెట్టు మట్టలు ఎండిపోయి అటుగా వెళ్లేవారిపై పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాటిని తొలగించాలని స్థానికంగా నివాసముండే సురేష్ చంద్ర ప్రసాద్ జులై 15న యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇంతవరకు సమస్య పరిష్కరించకపోగా... ఆయనకు కనీస సమాచారమూ ఇవ్వలేదు. ఇప్పటికైనా యాప్‌లో సాంకేతిక చిక్కులు తొలగించి... కార్యాచరణ చేపడితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

# ఆబ్కారీ... ఏదీ జవాబుదారీ

ఒంగోలు: యూనిఫాం సర్వీసుల్లో నిబంధనలు కఠినంగా ఉంటాయి. క్రమశిక్షణకు పెద్దపీట వేస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించి తీరాల్సిందే. వారికి ఎదురు తిరగడం అంటే అదో సాహసమనే చెప్పాలి. అటువంటి కీలకమైన శాఖల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఒకటి. గత కొన్నాళ్లుగా ఈ విభాగంలో క్రమశిక్షణ కట్టుతప్పింది. ఈ కారణంగానే మూడు నెలల వ్యవధిలో ముగ్గురు అధికారులపై వేటు పడడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**ఏకపక్షంగా వ్యవహరించి...**జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారిపై ఇటీవల బదిలీ వేటు పడింది. ఇక్కడి నుంచి కమిషనరేట్‌కు పంపారు. లైసెన్సు ఫీజుల విషయంలో అక్రమాలతో పాటు... ఒకే ప్రాంతంలో మంజూరైన దుకాణాలను మరో ప్రాంతానికి మార్చడంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారంటూ ఆయనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దుకాణదారుల నుంచి వసూళ్ల విషయంలోనూ ఆరోపణలు వెల్లువెత్తాయి. క్షేత్రస్థాయి అధికారులతో ప్రమేయం లేకుండా అంతా నేనే అన్నట్లుగా పనిచేశారాయన. అదే సమయంలో ఇతర అధికారులతోనూ విభేదాలు తీవ్రమయ్యాయి. వసూళ్ల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సైతం జరిగాయి. దీంతో అంతర్గత పోరు అధికమైంది. చివరకు బాధ్యతలు చేపట్టిన నెలల వ్యవధిలోనే జిల్లా నుంచి ఆయనను సాగనంపారు. ఇప్పటికీ ఎక్కడా పోస్టింగ్ కేటాయించకపోవడం గమనార్హం.

**విభేదాలతో రచ్చకెక్కారు...**

పొదిలిలో ఎస్సై సైమన్ వ్యవహారం తీవ్ర దుమారాన్నే రేపింది. ఓ గొలుసు దుకాణ నిర్వాహకుడిని పట్టుకుని ఉన్నతాధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా వదిలేయడాన్ని అక్కడి మహిళా సీఐ ప్రశ్నించారు. దీంతో ఆమెపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడారు. ఉన్నతాధికారులకు ఆమె ఫిర్యాదు చేయడంతో ఆయనను సస్పెండ్ చేశారు. తాజాగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగంతో ఒంగోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లీనా వ్యవహరించిన తీరు, వారి మధ్య చోటుచేసుకున్న వివాదం రచ్చకెక్కింది. ఈ విషయమై అందిన నివేదికతో ఉన్నతాధికారులు ఆగమేఘాల మీద స్పందించి సీఐను కమిషనరేట్‌కు సరెండర్ చేశారు.

**సిబ్బందిలో కలవరం...**ఆబ్కారీశాఖలో ప్రశాంతమైన జిల్లాగా ప్రకాశానికి పేరుండేది. ఇప్పుడు అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, అధికారులు, సిబ్బంది మధ్య విభేధాలు కలవరం పుట్టిస్తున్నాయి. గతంలో ఏదైనా సమస్య తలెత్తితే అంతర్గతంగా మాట్లాడుకుని సరి చేసుకునేవారు.

# ఆర్థిక చేయూత.. భవితకు భరోసా..!

విశాఖ : విశాఖ జిల్లాలో సుమారు 70 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. ఇక్కడి గ్రామాల్లో వేలాది మంది మత్స్యకారులు ఉన్నారు. వారంతా సముద్రంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏటా 1.30 లక్షల టన్నుల సముద్ర ఉత్పత్తులను వేటాడి ఒడ్డుకు తీసుకొస్తున్నారు. వారి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఆ వివరాలు..

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై)లో భాగంగా చేపలవేట సాగించేందుకు అవసరమైన పరికరాల పంపిణీ, రవాణా వాహనాలు, బోటు ఇంజిన్లు సమకూర్చడం, చేప పిల్లల సరఫరా వంటివి రాయితీపై ఇస్తున్నాయి. సాధారణ మత్స్యకారులకు 40 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీ అందిస్తున్నాయి. మొత్తం యూనిట్ విలువలో లబ్ధిదారుడు పది శాతం చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన సొమ్ము బ్యాంకు నుంచి రుణంగా లభిస్తుంది. మెకనైజ్డ్ బోట్లకు తాబేళ్ల సంరక్షణకు వినియోగించే టెడ్ పరికరాలను 100 శాతం రాయితీపై అందిస్తున్నాయి.ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి యోజన కింద మత్స్య సహకార సంఘాలకు ఆర్థిక సహాయం అందుతుంది. ఆయా సంఘాలు సొసైటీల రిజిస్ట్రేషన్ కింద నమోదై ఉండాలి. ప్రతీ సంఘం మనుగడలో ఉంటే లబ్ధి చేకూరుతుంది.



మత్స్యకార సేవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేట విరామ సమయంలో ఒక్కో మత్స్యకారుడికి రూ.20 వేలు చొప్పున ఆర్థికసాయం చేతికొస్తుంది.ఎంఎఫ్ఆర్ చట్టం కింద రిజిస్టరై...చేపలవేట క్రమం తప్పకుండా సాగించే బోట్లకు ఇంధన రాయితీ ఇస్తున్నాయి. లీటర్ డీజిల్‌ను రూ.9లకే సరఫరా చేస్తున్నాయి. నెలకు 3వేల లీటర్ల వరకు అవకాశం ఉంటుంది.సీకేజ్, సీ వీడ్ (సముద్రపు నాచు) పెంపకంపై మత్స్యకార మహిళలకు అవగాహన కల్పించి, ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నాయి. వీటికి అవసరమైన సామగ్రిని రాయితీపై పంపిణీ చేస్తూ, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నాయి.

# ఎర్రమట్టి.. కొల్లగొట్టి

కుందుర్పి: కుందుర్పి మండలంలో పలుచోట్ల సహజసిద్ధంగా ఏర్పడిన ఎర్రమట్టి కొండలను కొందరు ఆదాయార్జనే ధ్యేయంగా పొక్లెయిన్లు, జేసీబీ యంత్రాల సాయంతో కొల్లగొడుతున్నారు. ఈ మట్టిని ఎక్కువగా నూతన గృహ నిర్మాణాల్లో బేస్‌మట్టం, పూడికకు వినియోగిస్తుంటారు. వాణిజ్య పంటలు సాగుచేసే రైతులు సైతం భూమిలో సత్తువకు ఈ మట్టిని వాడుతుండటంతో అధిక డిమాండు ఏర్పడింది. ఈ నేపథ్యంలో అక్రమార్కులు ఎర్రమట్టిని యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**రాత్రిళ్లు కొనసాగుతున్న తవ్వకాలు**మహంతపురం– బెస్తరపల్లి గ్రామాల మధ్య ఉన్న మట్టికొండను నిత్యం వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ జేసీబీ సాయంతో తవ్వించి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బెస్తరపల్లి సమీపం నుంచి కర్ణాటకకు కూడా దీనిని రవాణా చేస్తున్నట్లు ఆ ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కుందుర్పి



నుంచి అపిలేపల్లికి వెళ్లే పూలదిబ్బను(ఎర్రమట్టి దిబ్బ) గతంలో అక్రమార్కులు అనేకచోట్ల తవ్వించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధాన దారికి ఆనుకుని ఉన్న ఈ మట్టిదిబ్బల తవ్వకాన్ని అధికారులు గుర్తించి నిలిపివేయడంతో అక్రమార్కులు వారి పంథా మార్చుకున్నారు. రాత్రుళు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు చేస్తున్నారు. కుందుర్పి నుంచి బొమ్మాజిపల్లికి వెళ్లే దారి పక్కనున్న నిమ్మాజిగుట్ట రాతిబండ వరకూ మట్టిని ఇప్పటికే తవ్వేశారు.

**సిబ్బందితో నిఘా పెడతాం :** తిప్పేస్వామి ఉప తహసీల్దార్, కుందుర్పి కొండల్లోని ఎర్రమట్టి అక్రమ తవ్వకాల నివారణకు రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తాం. అక్రమంగా తవ్వకం దారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# రద్దీ రహదారులకు మహర్దశ

సూళ్లూరుపేట : జిల్లాలోని రహదారులు, భవనాల శాఖ పరిధిలోని రోడ్లకు మంచి రోజులొచ్చాయి. గతంలో జిల్లాలో బాగా రద్దీగా ఉండి రాకపోకలు అధిక సంఖ్యలో సాగే రహదారులను గుర్తించి, ఎన్‌డీబీ కింద ఆధునికీకరించాలని తలచారు. ఆ మేరకు నిధులు సైతం మంజూరయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వడంలో జాప్యం చేయడంతో గుత్తేదారులు ముందుకు రాలేదు. పనులు ప్రారంభానికి నోచుకోలేదు. రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం వాటిని రద్దుచేసి తాజాగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో చేపట్టాలని నిర్ణయించింది.**హ్యామ్ అంటే?..** జిల్లాలో ఇప్పటి వరకు ఈ విధానంతో ఎక్కడా రహదారుల పనులు చేయలేదు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హ్యామ్) విధానంలో రహదారుల నిర్మాణాల నిధుల్లో ప్రభుత్వం ముందుగా 40 శాతం భరిస్తుంది. మిగతా 60 శాతం నిధులను బ్యాంకు రుణం ద్వారా గుత్తేదారునికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటుంది. ఈ మొత్తం నిధులతో గుత్తేదారు రహదారులను బాగు చేస్తారు. రుణాన్ని ప్రభుత్వం 15 ఏళ్లలో తిరిగి చెల్లిస్తుంది. గుత్తేదారు 15 ఏళ్ల పాటు రహదారుల నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో జిల్లాలోని సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో కొన్ని రహదారులను ఎంపిక చేశారు.

**రహదారులను పరిశీలిస్తే..** సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రహదారి పెరిమిటిపాడు వరకు రెండు వరుసలుగా ఉంది. అక్కడి నుంచి బుచ్చినాయుడుకండ్రిగ వరకు విస్తరించేందుకు 2018లో ఎన్‌డీబీ నిధులు మంజూరు చేశారు. 2019లో టెండర్లు నిర్వహించగా చిత్తూరుకు చెందిన పీఎల్ఆర్ సంస్థ టెండరు దక్కించుకుంది. వైకాపా ప్రభుత్వంలో మంత్రులు శిలాఫలకం వేయగా అక్కడక్కడ కల్వర్టు పనులు చేసినా విస్తరణ పనులు ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం వాటిని రద్దుచేసి నూతన విధానంతో బాగు చేయాలని నిర్ణయించింది.

# బుగ్గవంకను చూడండి.. చొరవ చూపండి!



అనంతపురం: కడప నగరం మధ్యలో ప్రవహించే బుగ్గవంక మొన్నటివరకు చెత్తాచెదారం కంపచెట్లతో నిండిపోయి ఉండేది. వరదల సమయంలో ప్రవాహం ముందుకు సాగకుండా రెండువైపులా ఉన్న కాలనీల్లోకి నీరు చేరేది. జనావాసాల నుంచి వచ్చే మురుగు వంకలో కలిసేది. గుర్రపుడెక్క, జంతుకళేబరాలు, ఇతర వ్యర్థాలు చేరడంతో సమీప కాలనీలవాసుల దుర్గంధం మధ్య జీవనం సాగించాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం రాగానే అక్కడి ప్రజాప్రతినిధుల చొరవతో బుగ్గవంకను ప్రక్షాళన చేశారు. వంకను సుందరంగా తీర్చిదిద్ది 3 కి.మీ మేర రక్షణ గోడ నిర్మించి నగరవాసులకు వరద నుంచి రక్షణ కల్పించారు. ఇందుకు జిల్లా జలవనరుల శాఖ అధికారులు రూ.70 కోట్లు ఖర్చు చేశారు. తెదేపా ప్రభుత్వం 2016లో అనంత నగరంలోని నడిమివంకకు రెండువైపులా రక్షణ గోడ నిర్మాణానికి రూ.67 కోట్లు కేటాయించడంతో 50 శాతానికి పైగా పనులు జరిగాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఏమాత్రం పట్టించుకోలేదు. 2022, అక్టోబరులో వరదలు ముంచెత్తిన సమయంలో రక్షణ గోడ నిర్మాణంపై అప్పటి సీఎం జగన్ స్వయంగా హామీ ఇచ్చినా పనులు పట్టాలెక్కలేదు. సోమనాథ్‌నగర్‌లో కొట్టుకుపోయిన వంతెన పునఃనిర్మాణానికి నోచుకోలేదు. ఐదేళ్లపాటు నిర్వహణను గాలికొదిలేయడంతో చెత్తాచెదారంతో పాటు కంపచెట్లు ఏపుగా పెరిగి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. లక్ష్మీనగర్, ఆజాద్‌నగర్, సీపీఐ కాలనీ, 4, 5, 6 రోడ్లు, రంగస్వామినగర్, సోమనాథ్‌నగర్, శాంతినగర్, భగత్‌సింగ్‌నగర్, రజకనగర్, గౌరవగార్డెన్స్, రుద్రంపేట, కక్కలపల్లికాలనీ, ఆదర్శనగర్‌లకు ముంపు ముప్పు వెంటాడుతోంది.

**పండమేరును పట్టించుకోరా?**

నగరంలోని పండమేరు వంకలో కొన్నేళ్లుగా కంపచెట్లు తొలగించలేదు. ఆర్డీటీ స్టేడియం సమీపాన వంకలో కంపచెట్లు అడవిని తలపిస్తున్నాయి. గతేడాది అక్టోబరులో వచ్చిన వరదలకు ఎగువ ప్రాంతంలోని కళాకారులకాలనీ మునిగింది. ఉప్పరపల్లి పరిధిలో వంకను ఆక్రమించి ఇటుక బట్టీలు, జగనన్న కాలనీల నిర్మాణం చేశారు. కంపచెట్లు తొలగిస్తామని అటు పాలకులు, ఇటు అధికారులు ప్రకటించి ఏడాది గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదు. కాలనీలను వరద ముంచెత్తకుండా నివారణ చర్యలు చేపట్టలేదు. కనీసం వంకల్లోని కంపచెట్లు, చెత్తను తొలగించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా పాలకులు, యంత్రాంగం చొరవ తీసుకుని కడపలోని బుగ్గవంకలా అనంత నగరంలోని నడిమివంక, పండమేరును సుందరీకరణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తాడిపత్రికి సౌర వెలుగులు



తాడిపత్రి: తాడిపత్రి పురపాలిక అధికారులు ఇప్పటి వరకు విద్యుత్తు ఛార్జీల భారాన్ని ఎలా తగ్గించుకోవాలో ఆలోచించి సఫలమయ్యారు. అందులో భాగంగా అవసరమైన విద్యుత్తు మాత్రమే వినియోగించి ఆదర్శంగా నిలిచి పురస్కారాన్ని సైతం అందుకున్నారు. ఇదంతా గతం. ప్రస్తుతం రూ.లక్షల విద్యుత్తు బిల్లులను శాశ్వతంగా తగ్గించుకోవాలని పురపాలికంతా సౌరవిద్యుత్తు ఏర్పాటు చర్యలు తీసుకోనున్నారు. సౌర వెలుగుల దిశగా అడుగులు వేస్తున్నారు.

**పురపాలికకు రూ.లక్షల్లో భారం..**

పురపాలికలో మూడు వాటర్ వర్క్స్, రెండు ఎస్టీపీలు, సుమారు 4120 వేల వీధి దీపాలున్నాయి. వీటితో పాటు మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలకు కలిపి ప్రతి నెలా రూ.35 లక్షల వరకు విద్యుత్తు ఛార్జీలు వస్తున్నాయి. గతంలో సుమారు రూ.43 లక్షల వరకు చెల్లించేవారు. అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్తు ఉపయోగించుకుంటూ ఆదా చేయడంతో రూ.7లక్షల వరకు తగ్గించుకున్నారు.

**15వ ఆర్థిక సంఘం నిధులతో..**

ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధుల్లో సౌర విద్యుత్తును ఏర్పాటు చేసుకోవచ్చని అనుమతులు రావడంతో స్థానిక మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒక్కచోటే కాకుండా పురపాలిక అంతా ఏర్పాటు చర్యలు చేపట్టారు. మొదటి దశగా రూ.3.50 కోట్లతో సుమారు ఏడు ఎకరాల్లో సౌర విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీని ద్వారా మూడు వాటర్ వర్క్స్, రెండు ఎస్టీపీలకు విద్యుత్తును అందించవచ్చు. రెండు, మూడు దశల్లో రూ.2 కోట్లతో వీధి దీపాలకు, కార్యాలయాలకు సౌర విద్యుత్తు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సౌర విద్యుత్తు కేంద్రం ఏర్పాటైతే ప్రస్తుతం రూ.35 లక్షల విద్యుత్తు బిల్లు నుంచి కేవలం రూ.3 నుంచి రూ.5 లక్షలు మాత్రమే విద్యుత్తు బిల్లు వస్తుంది. 10 రెట్ల వరకు విద్యుత్తు ఛార్జీలు తగ్గించుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**ఏటా ఖర్చు తగ్గుతుంది : శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్**

పరపాలికలో సౌర విద్యుత్తు కేంద్రం వస్తే ఏటా సుమారు రూ.3 కోట్ల వరకు ఖర్చు తగ్గుతుంది. విద్యుత్తు అంతరాయంతో సంబంధం లేకుండా పురపాలికలో రాత్రి సమయాల్లోనూ వీధిదీపాలు వెలుగుతాయి. మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచనలతో నందలపాడులో ఉన్న ఏడు ఎకరాల మున్సిపల్ స్థలంలో కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. సౌర విద్యుత్తుతో నీటి సరఫరా, ఎస్టీపీల నిర్వహణ, వీధి దీపాలు వెలిగిస్తే దేశంలోనే తాడిపత్రి ఆదర్శంగా నిలిచే అవకాశాలున్నాయి.

# రాబడి ఉన్నా.. వసతులు మృగ్యం



ధర్మవరం : జిల్లాలో అత్యధిక రాబడి ఉన్న సంత మార్కెట్లలో ధర్మవరం ఒకటి. 2023లో రూ.8 కోట్లతో 1.79 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన సంతమార్కెట్‌లో 102 దుకాణాల గదుల సముదాయాన్ని నిర్మించారు. ప్రతి నెల మున్సిపాలిటీకి సుమారుగా రూ.6,7 లక్షలు దాకా అద్దెలు వసూలవుతాయి. కూరగాయాల మార్కెట్‌తో పాటు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇందులోనే ఉంది. దీంతో ఆస్తుల క్రయ, విక్రయాలతోపాటు నిత్యావసర వస్తువులతో కొనుగోళ్లతో మార్కెట్ నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి మార్కెట్‌లో మౌలిక వసతులు లేక వినియోగదారులు, దుకాణదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి**

పట్టణంలోని వారాపు సంతకు వచ్చే కొనుగోలుదారులు వేలల్లో ఉంటారు. వారికి కనీస వసతులైన మరుగుదొడ్లు, తాగేందుకు మంచి నీళ్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్ల నిర్వాహణ బాధ్యతలను చేజిక్కించుకున్న గుత్తేదారులు వాటిని శుభ్రం చేయకుండా కేవలం బ్లీచింగ్ పౌడి చల్లి చేతులుదులుపుకొంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**సేదతీరేందుకు ప్రత్యేక గదులేవీ?**

పట్టణ మార్కెట్‌లోకి కూరగాయాలు విక్రయించుకునేందు వచ్చే వ్యాపారులు, రైతులు కాసేపు సేద తీరుదామంటే ప్రత్యేక గదులు లేవు. దీంతో ఎక్కడపడితే అక్కడే వేచి ఉండి..వారు తెచ్చిన కూరగాయలు, నిత్యావసర వస్తువులు అమ్మకాలైన వెంటనే వెళ్లిపోతున్నారు. సంత మార్కెట్‌కు ఏటా సుంకాల బహిరంగ వేలంపాట ద్వారా రూ.70 లక్షల ఆదాయం వస్తుంది. సుంకాల నుంచి వచ్చిన ఆదాయంతో మార్కెట్‌లో రైతులు, దుకాణదారులకు విశ్రాంతి గది ఏర్పాటు చేయాల్సి ఉండగా, అధికారులు ఆ ఆలోచన చేయడం లేదు.

**మౌలిక వసతులు కల్పిస్తాం** గతంలో తాగునీటి వసతిని ఎందుకు ఏర్పాటు చేయలేదో తెలియదు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. మిగతావాటిపై కూడా చర్చిస్తాం. వీరేశ్ కుమార్, డీఈ, పురపాలక సంఘం

# టోకెన్ తీస్కో.. లోడ్ చేస్కో!

మామిడికుదురు : అధికారికంగా అనుమతులుంటే తీసుకున్న పైకానికి రసీదులు ఇస్తారు.. లేదంటే టోకెన్లు ఇచ్చి ఇష్టారీతిన కొల్లగొడతారు.. వశిష్ఠ నదీ తీరంలోని రాజోలు మండలం సోంపల్లి రీచ్‌లో ఇసుక దందా ఇదే రీతిన సాగుతోంది. అనధికారికంగా ఇసుక తరలిపోతున్నా స్థానిక యంత్రాంగానికి ఏవిధంగా పట్టకపోవడంతో అక్రమానికి అడ్డులేకుండా పోయింది. వరద కారణంగా నదిలో నీటిమట్టం పెరగడంతో కొన్ని రోజుల పాటు ఆగిన అక్రమార్కులు గత పది రోజులుగా యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ సొమ్ములు వసూలు చేసుకుంటున్నారు.

**భారీగా తరలింపులు**

సోంపల్లిలో ఇసుక రీచ్ గురించి సంబంధిత అధికారులను అడిగితే ఏవిధమైన అనుమతులు ఇవ్వలేదని కచ్చితంగా చెబుతున్నారు. విచ్చలవిడిగా ఇసుక తరలిపోతోందని చెబితే పరిశీలిస్తామంటున్నారు. అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తే కొద్ది రోజుల పాటు తాత్కాలికంగా నిలుపుదల చేసి మళ్లీ దందా కొనసాగిస్తున్నారు. స్థానిక బలం అండతో అక్రమ తరలింపులు, వసూళ్లు నిరాటంకంగా సాగిపోతున్నాయి. ఇక్కడ నిత్యం 60 వరకు ట్రాక్టర్ల ఇసుక తరలిపోతోంది. దందా నిర్వాహకులు ప్రతి ట్రాక్టర్‌కు ఓ టోకెన్ ఇస్తున్నారు. ఒక్కో దానికి రూ.1,400



చొప్పున వసూలు చేస్తున్నారు. ఇసుక తీసి లోడ్ చేసే కార్మికులకు రూ.1,050 ఇస్తున్నారు. మిగతా రూ.350 స్వాహా అవుతోంది. ఇక్కడి అక్రమార్కులే దీనికి సమీపంలోని మలికిపురం మండలం దిండి రీచ్‌లోనూ ఇదేవిధంగా ఇష్టారీతిన ఇసుక తరలింపులు చేస్తున్నారు. ఇక్కడ రోజుకు 40 ట్రాక్టర్ల వరకు తరలిస్తున్నారు. ఈ రెండు రీచ్‌ల్లోనూ రోజూ వంద ట్రాక్టర్ల ఇసుక తరలింపులకు సంబంధించి కార్మికులకు ఇచ్చింది పోను అదనంగా రూ.35 వేలు అక్రమార్జన చేస్తున్నారు. వారం వ్యవధిలోనే ఈ సొమ్ము లక్షల్లో పోగవుతోంది. అనుమతి లేని రీచ్‌ల్లో ప్రైవేటు వ్యక్తులు ఎలా ప్రవేశించారు, యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నా చూసీచూడనట్లు అధికారులు ఎందుకు వ్యవహరిస్తున్నారన్న అనుమానాలు ప్రశ్నార్థకంగానే ఉన్నాయి.

**పరిశీలించి చర్యలు చేపడతాం..**

వశిష్ఠ నదీ తీరంలో ఇసుక తీయడానికి ఏవిధమైన అనుమతులు ఇవ్వలేదు. ఇసుక తీసి తరలించడంపై పరిశీలన చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఎంత మేర ఇసుక తీసినదీ పరిశీలిస్తాం. ఇక్కడ పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తాం. వంశీధర్‌రెడ్డి, ఏడీ, గనుల శాఖ

# నాడి పట్టి.. నడక నేర్పి


కర్నూలు :ఓర్వకల్లు మండలం పూడిచెర్లకు చెందిన నాగమ్మ (72)కు గత నెల 22న కాలు.. చేయి పడిపోయింది. కుటుంబసభ్యులు వెంటనే సర్వజన వైద్యశాలలోని న్యూరో ఐసీయూలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు చేసి వారం పాటు చికిత్స అందించారు. ఆరోగ్యం కొంతమేర కుదుటపడింది. దీంతో ఆమెను జనరల్ వార్డుకు మార్చారు. మరో రెండు మూడు రోజుల్లో డిశ్చార్జి చేయనున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆమెకు వైద్యం చేశారు.

నేటి ఆధునిక సమాజంలో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. పలువురు పక్షవాతం బారిన పడుతున్నారు. నరాల సమస్య, స్పాండిలోసిస్, సయాటిక తదితర వాటితో బాధపడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలంటే రూ.లక్షలు వెచ్చించాల్సిందే. కర్నూలు సర్వజన వైద్యశాలలో ఇలాంటి బాధితులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో ఉంచి రోగులకు సేవలందిస్తున్నారు.

న్యూరో ఫిజీషియన్ విభాగంలో ప్రతి సోమ, గురువారాలు ఓపీ ఉంటుంది. మిగతా రోజుల్లో అత్యవసరమైనవారికి వార్డు వద్ద ఓపీ సేవలు అందిస్తారు. కాలు.. చేయి పడిపోయినవారికి అత్యవసర విభాగంలో ప్రాథమిక చికిత్స చేసి న్యూరో ఫిజీషియన్ విభాగంలోని ఐసీయూలో వైద్య సేవలందిస్తారు.

ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచేకాక వివిధ ప్రాంతాల నుంచి ప్రతి నెలా 1,500 నుంచి 2 వేల వరకు ఓపీ ఉంటుంది. ఐసీయూతోపాటు వార్డుల్లో ప్రతి నెలా 150 మంది రోగులకు చికిత్స అందిస్తుంటారు. ఆరోగ్యశ్రీ ఉన్నా.. లేకున్నా కార్పొరేట్ సేవలు అందిస్తున్నారు.

**పది పడకలతో ప్రత్యేక వార్డు**



వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు న్యూరో ఫిజీషియన్ విభాగానికి నిత్యం వస్తుంటారు. రెండేళ్ల కిందటి వరకు ఈ విభాగానికి ప్రత్యేకంగా న్యూరో ఐసీయూ (స్ట్రోక్ యూనిట్) అందుబాటులో ఉండేది కాదు. జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు రోగులను ఏఎంసీలో చేర్చుకొని చికిత్స అందించేవారు.

ప్రస్తుతం 10 పడకలతో ప్రత్యేకంగా న్యూరో ఐసీయూ స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఫలితంగా బాధితులకు సాంత్వన లభించింది. రక్తపోటు ఎక్కువై కాలు.. చేయి పడిపోయినవారు.. పక్షవాతంతో బాధపడేవారు, మెదడులో కణితులు ఉన్నవారికి న్యూరో ఐసీయూ విభాగంలో వైద్యం అందిస్తున్నారు. ఉత్తమ సేవలు అందుతుండటంతో ఇక్కడ చికిత్స పొందుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఉత్తమ సేవలందిస్తున్నాం

న్యూరో ఫిజీషియన్ విభాగంలో ఐసీయూ (స్ట్రోక్ యూనిట్) పెట్టిన తర్వాత చికిత్స పొందేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందిస్తున్నాం. డీఎం విద్యార్థులు అందుబాటులో ఉండటంతో రోగులకు 24 గంటలపాటు ఉత్తమ సేవలు వైద్యం అందిస్తున్నాం.

డా.శ్రీనివాసులు, న్యూరో ఫిజీషియన్ విభాగాధిపతి

చురకలు




# మత్తు మాయలో.. మృత్యు మార్గంలో

విజయనగరం : గతేడాది పెద్దచెరువు రోడ్డులో 19 ఏళ్ల యువకుడు, 15 ఏళ్ల బాలుడు డివైడర్‌ను ఢీకొని మృతిచెందారు. మార్గమధ్యలో ఇద్దరూ మద్యం తాగి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వారం తరువాత పూల్‌బాగ్ కాలనీ సమీపంలో 17 ఏళ్ల బాలుడు బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి తాటి చెట్ల మధ్యలోకి దూరి ప్రాణాలు కోల్పోయాడు. మత్తు కారణంగా ఈ ఘటన జరిగినట్లు తేల్చారు. బొండపల్లి రోడ్డులో 32 ఏళ్ల యువకుడు బైక్‌తో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పూటుగా మద్యం తాగిన అతడిని వైద్యులు కాపాడలేకపోయారు.

ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో చాలామంది మద్యం, గంజాయి మత్తులో ప్రాణాలు కోల్పోతున్నట్లు ఇటీవల పోలీసులు తెలిపారు. మృతుల్లో 15 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వారు ఎక్కువగా ఉంటున్నారని గుర్తించారు. నేరుగా ముందున్న వాహనాలు, చెట్లు, డివైడర్లను ఢీకొనడమో లేదా ఇతర ప్రయాణికులను క్షతగాత్రులుగా మారుస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ని దాడులు చేస్తున్నా రోజురోజుకూ కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

**తరచూ ప్రమాదాలు..** రెండు జిల్లాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో 25 శాతం వరకు మత్తులో ఉన్నవారి వల్లే చోటుచేసుకుంటున్నాయని పోలీసుశాఖ పేర్కొంటోంది. కొందరు గంజాయి, మద్యం తాగిన తరువాత శిరస్త్రాణాలు సైతం ధరించడం లేదని, ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ఇతర ప్రయాణికులను



భయాందోళనకు గురిచేస్తున్నట్లు గుర్తించింది. ఈ ఏడాది 255 ప్రమాదాల్లో 62 మంది మృతిచెందారు.

**అందుబాటులో కేంద్రాలు..**

తాగుడుకు దూరం కావాలనుకునే వారికి మహారాజా ప్రభుత్వాసుపత్రి, పార్వతీపురంలోని జిల్లా వైద్యాలయాల్లోని మత్తు వ్యసనపరుల విముక్తి కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. ఒక్కోచోట పది పడకల చొప్పున అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, కౌన్సెలర్లు, ఇతర సిబ్బందిని నియమించారు. బాధితుడితో పాటు అవసరం మేరకు అతడి కుటుంబ సభ్యులకు సైతం కౌన్సెలింగ్ అందిస్తారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 758 మంది చికిత్స పొందారు.

**భారీగా జరిమానాలు..**

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడినా, బహిరంగ, నిషేధిత ప్రాంతాల్లో తాగినా పోలీసులు వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల కోర్టులకు తరలిస్తుండడంతో రూ.10 వేల చొప్పున జరిమానాలు విధిస్తున్నారు. ఈ ఏడాది 366 మందికి రూ.36.60 లక్షల జరిమానా పడింది. ఇటీవల నగరానికి చెందిన 10 మంది రూ.1.60 లక్షలు చెల్లించారు. వీరంతా 15 నుంచి 35 ఏళ్ల లోపు వారే.

**మెదడుపై ప్రభావం..**

'మద్యం తాగి వాహనం నడపడం గుండెకు మంచిది కాదు. మెదడుపై నేరుగా ప్రభావం పడుతుంది. ఈక్రమంలో పట్టు కోల్పోతారు. ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువ. ఒకవేళ మద్యానికి బానిసైతే వైద్యులను సంప్రదించాలి' అని ప్రముఖ జనరల్ ఫిజీషియన్, ఎన్‌సీడీ సెల్ వైద్యుడు డా.మురళీకృష్ణ చెప్పారు. మందుబాబుల విషయంలో రాజీ పడడం లేదని, పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

# సన్నకారు రైతులకు సహకారం

ఒంగోలు : రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ పథకం రైతులకు ఆసరాగా నిలుస్తోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన యాంత్రీకరణ పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 50 శాతం రాయితీపై జిల్లాలోని 1,257 మంది రైతులకు రూ.275.62 లక్షల విలువైన వ్యవసాయ యంత్రాలు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికే 70 శాతం పంపిణీ పూర్తయింది. వీటిలో ఎస్సీలు 65 మందికి రూ.12.29 లక్షలు, ఎస్టీలు 12 మందికి రూ.1.74 లక్షలు రాయితీగా చెల్లించారు. రోటావేటర్స్, గొర్రులు, లెవలింగ్ బ్లేడ్, పురుగుమందు పిచికారీ స్ప్రేయర్లు, రోబో పవర్ టిల్లర్, బ్రేష్ కట్టర్, పవర్ వీడర్ తదితర పరికరాలు అందజేశారు. రైతు తన 50 శాతం వాటా చెల్లించిన వెంటనే వారు కోరుకున్న కంపెనీల వారు నేరుగా రైతుల ఇళ్లకు పరికరాలు సరఫరా చేస్తున్నారు.

2014-19 తెలుగుదేశం ప్రభుత్వంలో పథకం అమలులో ఉండగా, అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వంలో రద్దు చేశారు. ఒక ఏడాది అసలు ఏ పథకం అమలు కాలేదు. రెండో సంవత్సరంలో రైతులకు గ్రూపు రుణాలు కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాల పేరుతో మొత్తం 605 గ్రామాల్లో రూ.20.83 కోట్లతో పరికరాలు ఇచ్చారు. గ్రూపు సభ్యులు సొంతానికి వాడుకోవడంతోపాటు ఇతర రైతులకు ట్రాక్టరు, పరికరాలు అద్దెకు ఇవ్వడం దీని ఉద్దేశం. ఇది అమలులో ఫలితాలనివ్వలేదు. పెట్టుబడి పెట్టిన రైతులే వాటిని వినియోగించుకున్నారు. వీటి నిర్వాహణకు సంబంధించి భాగస్వాములైన గ్రూపు సభ్యులు సంతకాలు చేయాల్సి రావడంతో ఇతర రైతులకు సకాలంలో సేవలందలేదు. ఇప్పుడు అమలు చేసిన పథకంతో రైతులు 50 శాతం చెల్లిస్తే పరికరం తమ సొంతమవుతుంది.

# పల్లె ముంగిటకు గంగమ్మ



పాయకరావుపేట : పాయకరావుపేట నియోజకవర్గంలోని వందలాది గ్రామాల దాహం తీర్చే మెగా తాగునీటి ప్రాజెక్టుకు ఎట్టకేలకు గ్రహణం వీడింది. పుష్కర కాలం ఎదురుచూపులకు మరో ఆరు నెలల్లో ముగింపు పడనుంది. పైపులైను ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగడంతో వడివడిగా పనులు సాగుతున్నాయి.

నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లోని 130 గ్రామాలకు తాగునీటిని అందించేందుకు మెగా ప్రాజెక్టు పనులకు 2012లో రూ. 35 కోట్లతో శ్రీకారం చుట్టారు. నాతవరం మండలం శరభవరంలోని ఏలేరు కాలువ నుంచి నీటిని తీసుకువచ్చేందుకు పైపులైను ఏర్పాటు చేశారు. గోపాలపట్నం ఆవలో ఏలేరు జలాలను నిల్వ చేసేందుకు 60 ఎకరాలు సిద్ధం చేశారు. నక్కపల్లి మండలంలోని ఉద్దండపురం వద్ద ఏరియేటర్ల ఏర్పాటు, నీటిని శుద్ధి చేసేందుకు అవసరమైన నిర్మాణాలు పూర్తి చేశారు. అనంతరం నిధుల కొరతతో పనులు అప్పట్లో మూలకు చేరాయి. 2014లో ప్రాజెక్టు పనులు నిలిచిన విషయాన్ని నారా లోకేశ్ దృష్టికి హెూంమంత్రి వంగలపూడి అనిత తీసుకువెళ్లారు. దీనికోసం మరో రూ.51 కోట్లను కేటాయించారు. ఈ పనులకు 2017, మే 5న ఆయనే శంకుస్థాపన చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత పనుల్లో వేగం తగ్గింది. క్రమేణా పథకం పనులు నిలిచిపోయాయి.

**పనులకు రహదారి అడ్డంకి...**

కొంతకాలం తర్వాత పథకం పనుల నిమిత్తం మరో రూ. 80 కోట్లు నిధులు కేటాయించారు. పనులు మొదలైనప్పటికీ రహదారి పక్కన పైపులైను వేసేందుకు జాతీయ రహదారి అధికారులు ఒప్పుకోలేదు. మళ్లీ కథ మొదటికి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే మంత్రి అనిత దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో పలుమార్లు చర్చించారు. పైపులైను ఏర్పాటుకు అడ్డంకులు తొలగించారు. ప్రస్తుతం పాయకరావుపేట నుంచి ఉద్దండపురం వరకు పైపులు ఏర్పాటు చేశారు. త్వరలో ఉద్దండపురం నుంచి ఎస్.రాయవరం వరకు పనులు పైపులు వేసేందుకు రంగం సిద్ధం చేశారు.

**ఆరు నెలల్లో పనులు పూర్తి:** ప్రాజెక్టు పనులు మరో ఆరు నెలల్లో పూర్తి చేస్తాం. పైపులైను వేసేందుకు శరవేగంగా పనులు చేయిస్తున్నాం. ఇప్పటికే ఉద్దండపురం, గొడిచెర్ల, డొంకాడ సహా మరో 8 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నాం. రానున్న రోజుల్లో పరిధిలోని అన్ని గ్రామాలకు రక్షిత నీరు అందిస్తాం.- ఆనంద్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

# 'తుక్కు'టమారాలు



నంద్యాల : 'తుక్కు' కొందరికి కాసులు కురిపిస్తోంది. పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. పలువురు అక్రమంగా రవాణా చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. వేబిల్లులు లేకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వీరి జీరో దందాకు వాణిజ్య పన్నుల శాఖలోని కిందిస్థాయి అధికారులు సహకరిస్తుండటం గమనార్హం. నెలకు రూ.కోట్ల విలువైన తుక్కు అక్రమంగా తరలిపోతున్నట్లు అంచనా. తాజాగా అనంతపురం జిల్లాలో పట్టుబడటం కలకలం సృష్టిస్తోంది.

**తనిఖీ కేంద్రాల్లేక..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు లేకపోవడం అక్రమార్కులకు కలసి వస్తోంది. సేకరించిన తుక్కును బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు అక్రమ మార్గంలో తీసుకెళ్తున్నారు. ప్రత్యేకించి వేకువజామున అక్రమ రవాణా చేస్తుంటారు. వాహనాలు పట్టుబడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. తుక్కును తరలించే వాహనాల ముందు, వెనుక ఒక వాహనంలో వ్యాపారులు ఉంటారు. వారు చరవాణుల్లో వాహన డ్రైవర్లకు సమాచారం ఇస్తారు. అధికారులు ఎవరైనా రహదారులపై తిరుగుతుంటే వాహనాలను పక్కనే ఆపేస్తారు.

**పన్ను ఎగనామం**

తుక్కును ఇతర ప్రాంతాల్లో అమ్మాలన్నా.. రవాణా చేయాలన్నా తప్పనిసరిగా ఈ-వేబిల్లులు ఉండాలి. 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. ప్రతి రూ.100 కొనుగోలుకు సంబంధించి వాణిజ్య పన్నుల శాఖకు రూ.18 చెల్లించాలి. రెండు జిల్లాల పరిధిలో నెలకు లక్ష టన్నుల వరకు 'తుక్కు' సేకరణ జరుగుతోంది. బహిరంగ విపణిలో దీని విలువ రూ.30 కోట్ల వరకు ఉంటుంది. ఈ లెక్కన వాణిజ్య పన్నుల శాఖకు సుమారు రూ.5 కోట్ల వరకు జీఎస్టీ రూపంలో రావాల్సి ఉంది.

కర్నూలులోని మూడు కార్యాలయాలు, నంద్యాలలోని రెండు, ఆదోనిలో ఒక కార్యాలయం పరిధిలో తుక్కు ద్వారా వచ్చే ఆదాయం రూ.5 లక్షల లోపే ఉండటం గమనార్హం.

**ఆటోనగర్‌లో సేకరించి..**

కల్లూరు ఆటోనగర్, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల ఆటోనగర్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ పట్టణాల్లో పెద్దఎత్తున తుక్కు సేకరిస్తున్నారు. కిలో రూ.28-30 నుంచి తీసుకుంటారు. పోగైన సామగ్రిని గ్రేడింగ్ చేయించి లారీల్లో నేరుగా కంపెనీలకు తరలిస్తున్నారు. ఇందుకు కిలోకు అదనంగా రూ.10 నుంచి రూ.40 వరకు తీసుకుంటూ లాభాలు పొందుతున్నారు.

కర్నూలులో 30 మంది, నంద్యాలలో 15, ఆదోనిలో ఆరుగురు, ఆత్మకూరు ఐదుగురు, ఆళ్లగడ్డ, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో డీలర్లు ఉన్నారు. వీరికి ప్రతి నియోజకవర్గంలో సబ్ డీలర్లు ఉన్నారు. డీలర్ల వరకు అధికారికంగా గుర్తింపు పొందినా సబ్ డీలర్లు, పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేసే చిరు వ్యాపారులకు ఎలాంటి అధికారిక గుర్తింపు లేదు.

# పశువైద్య కళాశాల విద్యార్థులకు ఊరట



గరివిడి : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని గరివిడి పశువైద్య కళాశాలకు 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు ఎట్టకేలకు ప్రభుత్వం అనుమతులివ్వడంతో విద్యార్థులకు ఊరట లభించింది. కళాశాల శాశ్వత సభ్యత్వం కొనసాగించేందుకు ఆమోదం తెలిపారు. చివరి సంవత్సరం విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. చివరి ఏడాది విద్యార్థులను వేరే కళాశాలకు తరలించేందుకు అనుమతిచ్చారు.

గత తెదేపా హయాంలో 2016-17లో ఉత్తరాంధ్రకు ప్రాధాన్యతనిస్తూ గరివిడిలో పశువైద్య కళాశాలను మంజూరు చేశారు. రూ.81.72 కోట్ల నాబార్డు నిధులు కేటాయించారు. 2020లో ప్రవేశాలు ప్రారంభించారు. 2021-22, 2022-23 విద్యా సంవత్సరాలకు భారత పశు వైద్య మండలి (వీసీఐ) గుర్తింపు ఇచ్చింది. వైకాపా హయాంలో కళాశాల నిధులను మళ్లించడంతో ప్రధాన భవనాల నిర్మాణాలు పూర్తికాలేదు. సౌకర్యాలు లేక, బోధకులను నియమించక 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు వీసీఐ గుర్తింపు ఇవ్వలేదు. చదువు చెల్లుబాటు కావాలన్నా.. ఉద్యోగంలో చేరాలన్నా గుర్తింపు తప్పనిసరి. మొదటి బ్యాచ్ విద్యార్థుల బీవీఎస్సీ ఈ ఏడాది ఏప్రిల్‌లో పూర్తయ్యింది.

**కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**

వైకాపా ప్రభుత్వం నిర్వాకంతో కళాశాలలో నెలకొన్న గడ్డు పరిస్థితులను కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కటిగా చక్కదిద్దుతోంది. రూ.16 కోట్లు పెండింగ్ బిల్లులను విడుదల చేయడంతో నిర్మాణాలు ప్రారంభించారు. ఇటీవల వీసీఐ బృందం కళాశాలకు వచ్చి సదుపాయాలు, మౌలిక వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, కె.అచ్చెన్నాయుడు కళాశాల సమస్యను కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి లలన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. మరికొద్ది రోజుల్లో కళాశాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ప్రస్తుతం చివరి ఏడాది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని తెలపడంతో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో ప్రవేశాలకు గుర్తింపునిస్తూ సోమవారం కేంద్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో పూర్తిస్థాయిలో వీసీఐ అనుమతులు వచ్చే అవకాశం ఉంది.

**ఇంటర్న్‌షిప్‌కు పంపిస్తున్నాం..** విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం, విశ్వవిద్యాలయం చర్యలు తీసుకున్నాయి. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బీవీఎస్సీ మొదటి బ్యాచ్ 69 మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌కి పంపిస్తున్నాం. విద్యార్థులు జిల్లా కేంద్రాల్లో ఉన్న పశువైద్యశాలల్లో జూనియర్ వైద్యులుగా ఆరు నెలల పాటు పనిచేస్తారు. ఎం.శ్రీను, అసోసియేట్ డీన్, పశువైద్య కళాశాల, గరివిడి

# మిగులు భూములు మింగేస్తున్నారు!

త్రిపురాంతకం : త్రిపురాంతకం నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్‌ఎస్‌పీ) సబ్‌డివిజన్ పరిధిలోని మిగులు భూములను కొంతమంది అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారు. కొంతమంది పంటలు సాగు చేస్తుండగా, మరికొందరు ఏకంగా విక్రయించేస్తున్నారు. ఇక్కడ భూముల విలువ రెట్టింపు అవుతుండడంతో త్రిపురాంతకం పరిసరాల్లో ఎకరా రూ.2 కోట్ల వరకు పలుకుతోంది. దీంతో కొందరు అక్రమార్కుల కన్ను పడింది. నాగార్జున సాగర్ కాలువలు తవ్వేటప్పుడు అప్పట్లో రైతులకు పరిహారం చెల్లించి పుల్లలచెరువు మండలంలోని ప్రకాశం-గుంటూరు జిల్లా సరిహద్దు 85/3వ మైలురాయి నుంచి త్రిపురాంతకం మండలం దూపాడు వరకు 1,589 ఎకరాలు సేకరించారు. ఇందులో ప్రధాన కాలువ, మేజరు, మైనరు కాలువలు, గణపవరం, త్రిపురాంతకం, దూపాడు గ్రామాల్లో క్యాంపు నిర్మాణాలకు 707 ఎకరాలు వినియోగించారు. ఆ భూములు పోనూ 882 ఎకరాల వరకు మిగులు భూములున్నాయి. ఇప్పటికే అప్పట్లో భూములిచ్చిన కొంతమంది రైతుల వారసుల గుప్పిట్లో 106 ఎకరాలు ఉండగా, మరికొంతమంది ఆక్రమించుకున్నారు. దూపాడు, గొల్లపల్లిలో ఎన్‌ఎస్‌పీ కాలనీలుండగా, గొల్లపల్లిలో కొంత భాగాన్ని జగనన్న కాలనీకి కేటాయించారు.

త్రిపురాంతకం సబ్‌డివిజన్ పరిధిలోని ప్రధాన కాలువకిరువైపులా ఉన్న మిగులు భూములు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.



జాతీయ రహదారి వెంట త్రిపురాంతకం నుంచి దయ్యపువాగు వరకు గల మిగులు భూములను కొంతమంది రెండేళ్ల కిందట విక్రయానికి పెట్టారు. దీనిపై సమాచారం అందుకున్న అధికారులు అడ్డుకున్నారు. మిరియంపల్లి మైనరు కాలువను ఆనుకుని ఉన్న మిగులు భూములను కొందరు రైతులు ఇటీవల స్థిరాస్తి వ్యాపారులకు విక్రయించారు. ఇప్పటికే బ్రహ్మంగారి కాలనీ ప్రాంతంలో తారు రోడ్డుకు తూర్పు వైపు ఉన్న మిగులు భూములు కొన్నేళ్ల కిందటే కబ్జాకు గురి కావడం గమనార్హం. రెవెన్యూశాఖాధికారుల చేతివాటంతో ఆక్రమణదారుల పేరిట వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేస్తుండటంతో మిగులు భూములు అన్యాక్రాంతమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఫిర్యాదు చేశాం...:** ఆక్రమణలకు గురైన ఎన్‌ఎస్‌పీ మిగులు భూముల వివరాలు సేకరిస్తున్నాం. 128, 133 సర్వే నంబర్లలోని భూముల్లో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నట్లు తెలియడంతో రిజిస్ట్రేషన్లు నిలిపి వేయాలని యర్రగొండపాలెం సబ్‌రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశాం. హద్దు రాళ్లు వేసి భూములను అప్పగించాలని తహసీల్దారును కోరాం. ఆక్రమణదారులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నాం. విజయలక్ష్మి, డీఈఈ, ఎన్‌ఎస్‌పీ సబ్‌డివిజన్, త్రిపురాంతకం

# వారు చెప్పిందే ధర!

టంగుటూరు: జిల్లాలో జరుగుతున్న పొగాకు వేలం ప్రక్రియలో నిత్యం 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నా కొనుగోలులో 75 శాతం వాటా ప్రధానంగా మూడు కంపెనీలదే. ఇతర సంస్థల వారు హాజరవుతున్నా ఒకటి, రెండు బేళ్లు మాత్రమే కొనుగోలు చేసి మిన్నకుంటున్నారు. ఎందుకు కొనడం లేదంటే ఆ ధరలు తమకు గిట్టుబాటు కావడం లేదంటూ రైతుల ముఖం మీదే చెప్పేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోలు విషయంలో రైతులు, కంపెనీ ప్రతినిధులు, అధికారుల మధ్య నిత్యం వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి.

**ఆశలు ఫలించక.. అప్పులు తీరక**

2024-25 పంట కాలంలో గతంలో మాదిరిగా ధరలు ఉంటాయనే ఆశతో రైతులు అధికంగా పొగాకు సాగు చేశారు. ఒక్క టంగుటూరు బోర్డు పరిధిలో 11.79 మిలియన్ కిలోల అనుమతికి గాను 16.50 మిలియన్ కిలోల పొగాకును పండించారు. పొలం కౌలు, కూలీల ధరలతో సాగు చేపట్టిన రైతులకు జోరు వర్షాలు దెబ్బతీశాయి. దీనికితోడు ఫిబ్రవరిలోనే ఎండలకు బెట్టకొచ్చిన తోటలకు నీరు పెట్టడంతో మేలిరకం దిగుబడులు రాలేదు. వీటన్నింటినీ ఆసరాగా చేసుకున్న కంపెనీలు రైతులను మభ్యపెట్టే పనిలో పడ్డాయి. మరోవైపు బోర్డులో కంపెనీలు మాయాజాలం ప్రదర్శిస్తున్నాయి. తక్కువ ధర పలికిన నాణ్యమైన గ్రేడ్‌లు మాత్రమే కొని, మిగిలినవి బోర్డుతో సంబంధం లేకుండా బయట కొనుగోలు చేద్దామని నిమ్మకుంటున్నారు. బోర్డులో విక్రయాలకు సెప్టెంబర్ వరకు సమయం పడుతుందని, ధరలు మరింత దిగజారుతాయని, అధిక పంటకు ఈ ఏడాది రుసుము



విధిస్తారని, వడ్డీలు పెరిగిపోతాయంటూ రైతులను భయాందోళనకు గురిచేస్తున్నారు. కొందరు రైతులు తమ అప్పులు, ఇతర అవసరాల దృష్ట్యా వచ్చిన మేరకు అమ్ముకుంటున్నారు. కొండపి, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల పరిధిలో అధికంగా సాగుతోంది.

**తూతూమంత్రంగా విజిలెన్స్ దాడులు..**

ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11 వేలం కేంద్రాలున్నాయి. అక్రమ పొగాకు రవాణాను అరికట్టేందుకు ఒక్కో కేంద్రానికి ఒక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందాలపై సెంట్రల్ విజిలెన్స్, ఆపై మొబైల్ విజిలెన్స్ బృందాలు ఉంటాయి. అయినప్పటికీ అక్రమ కొనుగోళ్లపై పర్యవేక్షణ కొరవడింది. నిత్యం వేల కిలోల పొగాకు అక్రమంగా తరలిపోతుంది. వేలం కేంద్రాల్లో ఉన్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది అంతా మహిళలే. వారే విజిలెన్స్ బృందాలుగా కొనసాగుతున్నారు. దీంతో రాత్రి వేళ మహిళా సిబ్బంది బయటకొచ్చి అడ్డుకోలేకపోవడంతో పొగాకు అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. దీనిపై గుంటూరు పొగాకు బోర్డు విజిలెన్స్ ఓఎస్డీ రవికాంత్‌ను వివరణ కోరగా.. విజిలెన్స్ బృందాలు ముమ్మరంగా తిరుగుతున్నాయని, ఇప్పటి వరకు 17 కేసులు నమోదు చేశామని, పొగాకు అక్రమ రవాణాపై పరిశీలిస్తామని తెలిపారు.

# కన్నీళ్లే తడి..!

కుప్పం : ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనలతో జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వేరుసెనగ సాగు చేసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. కన్నీళ్లు మినహా జూన్‌లో వర్షపు జాడలు లేకపోవడంతో వేసిన పంట ఎక్కడిక క్కడ ఎండిపోతోంది. కుప్పం నియోజకవర్గంలో వర్షపాతం ఏప్రిల్‌లో 110.7 శాతం, మేలో 125.2 శాతం నమోదైంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 84.1 శాతం కురవాల్సి ఉండగా... 26.1 శాతం మాత్రమే నమోదైంది. నియోజకవర్గంలో సాధారణ సాగు 5,714 హెక్టార్లు కాగా.. 30 శాతం పొలాల్లో వేరుసెనగ సాగుచేశారు. మొదట కురిసిన



వర్షాలకు కొందరు విత్తనాలు విత్తుకోగా... మరికొందరు విత్తనాలు వేసేందుకు పొలాల్లో తేమ లేక ఆకాశం వైపు చూస్తున్నారు. ప్రస్తుతం ఈ విత్తనాలు మొలకెత్తినా... వర్షం పడకపోవడంతో పంట ఎండుము ఖం పడుతోంది. అప్పులు చేసి సాగు చేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే ఏం చేయాలో అర్థంకాక రైతన్నలు అయోమయంలో పడ్డారు. అదును దాటిపోతున్నా... కొందరు రైతులు విత్తనాలను సిద్ధం చేసుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

# పూర్వ విద్యార్థుల దాతృత్వం

తిరుపతి : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. రూ.16 కోట్లతో విద్యార్థినుల వసతిగృహ నిర్మాణం తలపెట్టగా ప్రస్తుతం రూ.6 కోట్లతో చేపట్టిన మొదటిదశ నిర్మాణాన్ని ఆగస్టు 15వ తేదీన ప్రారంభించనున్నారు. ఇందులో 28 గదులతో 112 మంది విద్యార్థినులకు వసతి కల్పిస్తున్నారు. ఉపకులపతి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులను మంగళవారం



సంఘం ప్రతినిధులు కలిశారు. 'శ్రీ పద్మావతి మహిళా హాస్టల్‌గా నామకరణం చేయనున్నట్లు తెలిపారు. రూ.16 కోట్లతో 500 మంది విద్యార్థులు ఉండేలా వసతి సముదాయాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శ్రీనివాసులు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఆచార్య దామోదర్ రెడ్డి, ఆచార్య కె.ఎం.భాను, ఆచార్య హేమ తదితరులు ఆగస్టు 15న జరగనున్న కార్యక్రమ ఆహ్వాన పత్రికను వర్సిటీ అధికారులకు అందజేశారు.

# జడ్పీ ఆస్తులు పరాధీనం

విశాఖపట్నం : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రూ. కోట్ల విలువైన జిల్లాపరిషత్తు స్థలాలు, భూములు ఆక్రమణదారుల చెరలో చిక్కుకుపోయాయి. ఉన్న అరకొర ఆస్తుల నుంచి ఆదాయం రాబట్టడంపై యంత్రాంగం విఫలమవుతోంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో జిల్లా పరిషత్తు ఆస్తుల సంరక్షణకు సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక కమిటీ పనిచేసింది. తర్వాత వచ్చిన ప్రభుత్వం కనీసం జడ్పీ ఆస్తుల గురించి కూడా పట్టించుకోలేదు. దీంతో ఉన్న కొద్దిపాటి ఆస్తులు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. ఇప్పటికైనా ఆస్తుల సంరక్షణపై దృష్టి సారించకుంటే.. గడ్డుపరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది. బుధవారం విశాఖపట్నం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కీలక అంశాలతో పాటు భూములు, ఆస్తుల సంరక్షణపై చర్చించి.. కార్యాచరణ మొదలెట్టాల్సి ఉంది.

జిల్లా పరిషత్తుకు 330 పైగా ఆస్తులు ఉన్నాయి. వీటిలో 290 వరకు ఉన్నత పాఠశాలల స్థలాలే ఉన్నాయి. మిగతా వాటిలో కొన్ని ఖాళీ స్థలాలు, మరికొన్ని అతిథి గృహాలున్నాయి. గత కొన్నేళ్లుగా పాలక వర్గం పట్టించుకోకపోవడం.. కోర్టుల్లో కేసులు, ఆక్రమణలపై అధికారులు ఉదాసీనత చూపడంతో వీటిపై ఆక్రమణదారుల పట్టు పెరిగిపోయింది. విశాఖ మొదలుకొని అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఇప్పటికే రూ. వందకోట్లకు పైగా విలువైన ఆస్తులు చేజారిపోయాయి. అచ్యుతాపురం మండలం దోసూరులోని ఉన్నతపాఠశాల స్థలం గురించి



కొన్నేళ్లుగా కోర్టులో కేసులు నడుస్తున్నాయి. నేటికీ అవి తేలలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ, పాడేరు, చింతపల్లి వంటి పర్యాటక ప్రాంతాల్లో జడ్పీ అతిథి గృహాలున్నాయి. అప్పట్లో రూ. కోట్లు ఖర్చు చేసి వీటిని నిర్మించారు. వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా తయారయ్యాయి. వీటి నుంచి పైసా ఆదాయం లేదు.

**ఆదాయ వనరుగా మార్చుతాం**

జిల్లా పరిషత్తు ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నాం. జడ్పీ సమావేశంలో ఆస్తుల సంరక్షణ, అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు చేయనున్నాం. ఉమ్మడి జిల్లాలో 12 అతిథి గృహాలున్నాయి. వీటిని ఉన్నతంగా తీర్చిదిద్ది ఆదాయవనరులుగా మార్చుకుంటాం. నారాయణమూర్తి, జడ్పీ ముఖ్యకార్యనిర్వహణాధికారి

# కాలువ బలహీనం.. ప్రవాహం గగనం



అనంతపురం : సుమారు 15 వేల ఎకరాలకు సాగునీరు అందించే గుంతకల్లు బ్రాంచి కెనాల్ మరమ్మతు పనులు మూడు అడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురికావడంతో కాలువ బలహీనపడింది. కూటమి సర్కారు వచ్చాక కంపచెట్ల తొలగింపుతో పాటు అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతుకు నిధులు కేటాయించింది. పనులు నత్తనడకన సాగడంతో ఈసారి కూడా నీటి వృథా తప్పదనే అభిప్రాయం వినిపిస్తోంది. ప్రధాన కాలువ పొడవు 59.5 కిలోమీటర్లు కాగా చాలాచోట్ల గట్టు దెబ్బతినడంతో ప్రవాహ సమయంలో గండ్లు పడే ప్రమాదం పొంచి ఉంది.

**పూర్తయినవి మూడే..**

ఒకటో కి.మీ. నుంచి 25 కి.మీ. వరకు అక్విడక్టు, అండర్ టన్నెళ్లలో చిన్నపాటి మరమ్మతులు చేస్తున్నారు. రూ.1.80 కోట్లతో 27 పనులు చేపట్టగా3 మాత్రమే పూర్తయ్యాయి. ఎస్కేప్ ఛానళ్లకు సంబంధించిన షట్టర్లు తుప్పు పట్టి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. అండర్‌టన్నెళ్లు, అక్విడక్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. విడపనకల్లు మండల పరిధిలో ప్రధాన కాలువ లైనింగ్ చాలాచోట్ల దెబ్బతినడంతో నీరు వృథాగా పోతోంది. దీనికితోడు అక్విడక్టుల వద్ద కొందరు రైతులు గండ్లు పెడుతూ నీటిని మళ్లిస్తున్నారు. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది.

**ఆధునికీకరణతోనే శాశ్వత పరిష్కారం**

2017లో జీబీసీ ఆధునికీకరణను రెండు ప్యాకేజీలుగా చేపట్టారు. ప్యాకేజీ-1లో రూ.120 కోట్లతో 28 కిలోమీటర్ల వరకు ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ప్రక్కరక్ష మరమ్మతులు చేయలేదు. ప్యాకేజీ-2లో 28వ కి.మీ. నుంచి 59వ కి.మీ. వరకు రూ.117 కోట్లతో పనులు మొదలుపెట్టారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక పనుల్ని పూర్తిగా నిలిపివేశారు. ఐదేళ్లలో నిర్వహణకు సైతం నిధులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం కెనాల్‌పై దృష్టి సారించి ఆధునికీకరణ పనుల్ని పునఃప్రారంభించి పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

**25 శాతం నీరు వృథా..**

గుంతకల్లు బ్రాంచి కెనాల్‌కు 6.89 టీఎంసీల కేటాయింపులున్నా ఆధునికీకరణ జరగకపోవడంతో 3 టీఎంసీలకు మించి తీసుకోవడం లేదు. అందులోనూ 25 శాతం వరకు వృథాగా పోతున్నాయి. జీబీసీ నుంచే గుత్తి సబ్ బ్రాంచి కెనాల్, ఆలూరు బ్రాంచి కెనాల్‌కు నీరందించాల్సి ఉంది. జీబీసీకి సంబంధించి మరమ్మతులు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో రెండు కాలువలకు నీరివ్వడం కష్టంగా మారింది. జీబీసీలోని మూడు సెక్షన్లలో 26 మంది లస్కర్లకు గాను ప్రస్తుతం ముగ్గురే ఉండటంతో కాలువ పర్యవేక్షణకు అగచాట్లు తప్పడం లేదు.

# సదరం.. నిరీక్షణమయం



హిందూపురం : సదరం శిబిరంలో వైకల్య ధ్రువపత్రం పొందేందుకు దరఖాస్తు చేసుకొన్న దివ్యాంగులు నాలుగు గంటలు వైద్యాధికారి కోసం నిరీక్షించి నీరసించారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి మాతాశిశు కేంద్రంలో సదరం శిబిరం ఏర్పాటు చేశారు. స్లాట్ నమోదు చేసుకొన్న దాదాపు 30మందిని ఉదయం 9గంటలకే శిబిరం వద్దకు చేరుకోవాలని పేర్కొనడంతో గోరంట్ల, పెనుకొండ, మడకశిర ప్రాంతాలకు చెందిన వారు అనేక ఇబ్బందులుపడి నిర్ణీత సమయానికి శిబిరం వద్దకు చేరుకొన్నారు. ప్రమాదంలో అవయవ లోపం, పక్షవాతానికి గురైన వారు, మూత్రపిండాలు పాడై, వెన్నెముక దెబ్బతిన్న వారున్నారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవటానికి వైకల్య ధ్రువపత్రం పొందేందుకు వచ్చారు. శిబిరానికి పెనుకొండకు చెందిన వైద్యుడు మోహన్‌నాయక్‌ను అధికారులు నియమించగా కోర్టు వాయిదాతో హాజరు కాలేదు. ఆయన స్థానంలో మడకశిరకు చెందిన అభిలాశ్‌ను నియమించటంతో అతను మడకశిరలో ఏర్పాటు చేసిన శిబిరానికి హాజరై మధ్యాహ్నం 1 గంటకు రావటంతో వచ్చినవారు తీవ్రనిరాశకు గురయ్యారు. ఇలాంటి పరిస్థితి మరెప్పుడు ఎదురుకాకుండా జిల్లాకలెక్టర్ చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

**జీవచ్ఛవంలా స్ట్రెచర్‌పై..**

ఈయన పేరు ఉమర్‌ఫరూక్, పది నెలల కిందట జరిగిన ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. కూర్చోవటానికి, కనీసం నిలబడటానికి అవకాశం లేదు. అలాంటి బాధితుడు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవటానికి వైకల్య ధ్రువపత్రం అవసరం కావడంతో స్లాట్ నమోదు చేసుకొని శిబిరానికి ఉదయం 8గంటలకే హాజరయ్యాడు. ఒంటిగంట వరకు స్ట్రెచర్‌పై జీవచ్ఛవంలా వైద్యుడికోసం ఎదురు చూశాడు.

**అద్దె కారు తీసుకొని..**

అమరాపురం మండలం హేమావతి నుంచి హిందూపురంలో ఏర్పాటు చేసిన సదరం శిబిరానికి హాజరుకావటానికి బాధితుడు శివన్న రూ.3వేలు చెల్లించి అద్దెకారులో వచ్చాడు. అతనికి పక్షవాతం సోకి ఎడమకాలు, ఎడమ చెయ్యి పనిచేయక ఇతరుల సాయం లేనిదే కదలలేని పరిస్థితి. ఇలాంటి బాధితుడు నాలుగుచక్రాల కుర్చీపై దాదాపు నాలుగు గంటలు వైద్యుడికోసం ఇబ్బందులకు గురై ఎదురు చూశాడు.


**ఆక్సిజన్ లేకుంటే అంతే..**

గోరంట్లకు చెందిన షకీలాబానుకు కొవిడ్ సమయంలో రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. రాత్రీపగలు నాలుగు గంటలకు ఒకమారు ఆక్సిజన్ తీసుకొంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అలాంటి బాధితురాలు సదరం ధ్రువపత్రానికి ఉదయం 8 గంటలకే శిబిరం వద్దకు హాజరైంది. మధ్యాహ్నం ఒంటి గంటవరకు వైద్యుడు రాకపోవటంతో నిరీక్షించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది.

# అన్నీ మోసాలే..!

తిరుపతి : స్థానిక లబ్ధిదారుల కోసం ఏర్పేడు మండలం చిందేపల్లిలో 10,500 పక్కా ఇళ్లకు స్థలాలు సిద్ధం చేశారు. ఇందులో శ్లాబ్‌లు పూర్తయినవి కేవలం 15 శాతం మాత్రమే. శ్రీకాళహస్తి పట్టణం, నియోజక వర్గ పేదల కోసం ఊరందూరు వద్ద 4,650 ఇళ్లతో కాలనీ ఏర్పాటు చేశారు. దీనికి అప్పటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి పైలాన్ వేశారు. అయినా ఐదేళ్లల్లో ఒక్క గృహం కట్టలేదు. శ్లాబ్ వేసిన ఇళ్లకు రంగులేశారే తప్ప.. లబ్ధిదారులకు అందించలేదు. నవరత్నాల్లో ముఖ్యమైన పక్కా ఇళ్ల పేరుతో లబ్ధిదారులను వైకాపా ప్రభుత్వం నిలువునా ముంచేసింది. ప్రత్యేకించి శ్రీకాళహస్తి నియోజక వర్గంలో పట్టణానికి సమీపంలోని ఊరందూరు, ఏర్పేడు మండలం చిందేపల్లి సమీపంలో భారీగా పక్కా ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అప్పట్లో ఇవి కాలనీలు కాదు.. ఊర్లంటూ చెప్పుకొచ్చిన వైకాపా ఒక్కంటే ఒక్క గృహప్రవేశం చేసి లబ్ధిదారులకు అందించలేకపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా పనులు గాడిన పడకపోవడంతో కట్టిన నిర్మాణాలు అప్పుడే శిథిలమవుతున్నాయి. వైకాపా హయాంలో నిర్మించిన పక్కా ఇళ్ల లేఔట్ల విషయానికి వస్తే భూముల కొనుగోలు నుంచి లబ్ధిదారుల ఎంపిక, పట్టాలు మంజూరు, నిర్మాణాల్లో అక్రమాలు, గుత్తేదారుల ఆరగింపు ఇలా అన్నీ స్థాయిల్లో అక్రమాలు జరిగాయి. కేవలం కాగితాలపై లెక్కల కోసం.. లెక్కకు మిక్కిలిగా గృహాలు ప్రారంభించేశారు. గొప్పలకు పోయి పునాదులు వేసి వదిలేశారు.

**అభివృద్ధికి.. అవినీతి అడ్డు..**



ఇక్కడి కాలనీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ చేసింది. తవ్వేకొద్దీ మూలాల నుంచి అవినీతి పెచ్చుమీరడంతో పూర్తి స్థాయి విచారణ చేపట్టాక అభివృద్ధి పనులు కొనసాగించాలని నిర్ణయానికి వచ్చారు. ఊరందూరు కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల పట్టాల బహిరంగ విచారణ ఏర్పాటు చేస్తే కనీసం వంద మంది కూడా లబ్ధిదారులు రాకపోవడంతో అవినీతి, అక్రమాలు ఏ మేర జరిగాయో తెలుస్తుంది. నిర్మాణం పూర్తయిన ఇళ్లల్లోనూ పగుళ్లు రావడం, సిమెంటు పూతలు వేయకనే ఇళ్లకు వెలుపల రంగులు వేయడం, అంతర్గత వసతుల అభివృద్ధి చేపట్టకపోవడం పట్ల లబ్ధిదారులు ఇక్కడి ఇళ్లు పొందేందుకు ఆసక్తిని చూపడం లేదు. ఇప్పటికైనా అంతర్గత వసతుల కల్పనతో పాటు ఇళ్ల నివాసానికి వీలుగా చేసి అందుబాటులోకి తెచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ లబ్ధిదారులు కోరుతున్నారు.

# అక్రమార్కుల 'పాక'పాచిక

విశాఖపట్నం : విశాఖలో కబ్జాలకు సరికొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. వైకాపా హయాంలో ఈ తరహా భూ దందాకు బీజం పడింది. 13వ వార్డు దారపాలెం, ఫైనాపిల్ కాలనీ శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఆక్రమణలు జరుగుతున్నాయి. సర్వే నెంబరు 15/12 లో ఉన్న 3.07 ఎకరాల్లో గత ఐదేళ్లలో రూ.కోట్ల విలువైన ఎకరా భూమిపైగా కబ్జాకు గురైంది. కూటమి ప్రభుత్వంలోనూ కొందరు ఇదే తరహా కబ్జాలకు అడుగులు వేస్తున్నారు. ఇటీవల యోగాంధ్ర నిర్వహణలో అధికారులు నిమగ్నమైన వేళ కొన్ని నిర్మాణాలు ఆగమేఘాలపై పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

**నాయకులు, రౌడీషీటర్లదే హవా:** పోరంబోకు స్థలంలో మొదట పశువుల కోసం ఎండుగడ్డి వేసి, అక్కడే వాటిని కట్టేస్తారు. కొన్ని రోజుల తర్వాత పశువుల రక్షణ పేరుతో పాకలు వేస్తారు. ఆ స్థలం ఇతరుల నుంచి కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించి చక్రం తిప్పుతున్నారన్న విమర్శలున్నాయి. ఆపై జీవీఎంసీ సిబ్బందితో లాలూచీ పడి పన్ను వేయించడం, ఆపై విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేయడం చకచకా జరిగిపోతున్నాయి. తరువాత కొన్ని రోజులకే రక్షణ గోడ నిర్మాణం చేపడతారు. ఎవరైనా ప్రశ్నిస్తే బీఆర్టీఎస్ రహదారిలో స్థలం



పోగొట్టుకున్నామని, ప్రతిగా ఇక్కడ స్థలం ఇచ్చారంటూ చెప్పుకొస్తుండటం గమనార్హం. ఈ వ్యవహారంలో నాయకులతోపాటు, కొందరు రౌడీషీటర్లు పావులు కదుపుతున్నారు. ఓ రౌడీషీటర్ ఆధ్వర్యంలో ఇటీవల కొన్ని నిర్మాణాలు సాగడంపై చర్చనీయాంశమైంది.

**అధికారుల 'భూ'చాట!:** ఇక్కడ విచిత్రం ఏమిటంటే కొందరు అధికారులే ప్రభుత్వ భూములు ఎలా కబ్జా చెయ్యాలో, ఆక్రమణదారులు ఏ విధంగా రక్షణ వలయంలో ఉండాలో సూచనలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆక్రమణదారులు భవన నిర్మాణం చేసేవరకు అటువైపు కన్నెత్తి చూడరు. ఫిర్యాదులొస్తే హడావుడి చేసి ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతి చేతులు దులిపేసుకుంటున్నారు. సృష్టించిన నకిలీ పత్రాలను వాస్తవమైనవా? నకిలీవా? అని అధికారులు తీరుబడిగా తేల్చేలోగా భవనాలు పూర్తిచేస్తున్నారు. ఈ భవనాలు కొన్ని చేతులు మారగా, మరికొందరు అద్దెలకిచ్చుకుంటున్నారు.

# దస్త్రాల్లో పేదలు.. పొలాల్లో పెత్తందార్లు

బొబ్బిలి : పేదల బతుకు తెరువు కోసం గతంలో ప్రభుత్వం అందజేసిన డి.పట్టా భూములు చేతులు మారుతున్నాయి. భూముల ధరలు పెరుగుదలతో లబ్ధిదారులను మోసగించి.. కారుచౌకగా వారి నుంచి లాగేస్తున్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతోనే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. దస్త్రాల్లో లబ్ధిదారులే ఉన్నా వందేళ్ల లీజు పేరుతో పత్రాలు సృష్టించి పెత్తందార్లు సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ అవసరాలకు ఈ భూములు సేకరిస్తే కొనుగోలు చేసిన వారికే లబ్ధి చేకూరుతోంది.

**ఇదీ పలుచోట్ల పరిస్థితి**

బొబ్బిలి పట్టణం మల్లంపేట, గున్నతోటవలస, గొల్లపల్లి, రామన్నదొరవలస, పుల్లేరువలస, పారిశ్రామికవాడ ప్రాంతం, విజయపురి ప్రాంతాల్లోని వందల ఎకరాలు బడాబాబుల చేతుల్లో ఉన్నాయి. గతంలో ఓ నాయకుడు రామన్నదొరవలస వద్ద గిరిజనుల డి.పట్టా భూములను కొనుగోలు చేసి జగనన్న కాలనీకి విక్రయించారు. రూ.లక్షలు లాభం పొందాడు. సీబీసీఐడీ అధికారులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు నిర్వహించారు. అధికారుల అండదండలతోనే ఇదంతా సాగింది. తెర్లాం మండలంలోని లోచర్ల, ఆమిటి, వెలగవలస, ఎం.ఆర్ అగ్రహారం తదితర గ్రామాల్లో సుమారు 50 ఎకరాల డి.పట్టా భూములను విశాఖకు చెందిన ఓ వైద్యుడు కొనుగోలు చేశారు. కొన్నాళ్లు సాగు చేశాక వివాదంలోకి వెళ్లడంతో స్థలాన్ని ఖాళీగా ఉంచారు.

భూబందరవలస రెవెన్యూలో పేదలకు ఇచ్చిన భూములను తెలంగాణకు చెందిన భూస్వామి కొనుగోలు చేసి, దర్జాగా పంటలు పండించుకుంటున్నాడు.

డొంగురువలస రెవెన్యూలో డి.పట్టాలు పేదల పేరున ఉన్నప్పటికీ భూములు మాత్రం పెత్తందార్ల చేతిలో ఉన్నాయి.

చింతాడ సమీపంలోని డి.పట్టా భూములను వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుడు కొనుగోలు చేశాడు. ప్లాట్లు వేయడానికి



చదును చేసిన తర్వాత రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.

రామభద్రపురం మండలం కొండకెంగువ, ఎనుబరువు, రావివలస గ్రామాల్లో డి.పట్టాల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

బొబ్బిలి మండలం కొయ్యకొండవలస గిరిజనులకు చాలా ఏళ్ల కిందట ఇచ్చిన భూములను సాలూరు మండలం బాగువలసకు చెందిన ఇద్దరు వ్యక్తులు కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారు. ఫిర్యాదు అందడంతో గతేడాది నవంబరులో తహసీల్దారు శ్రీను, వీఆర్వోలు స్వాధీనం చేసుకుని లబ్ధిదారులకు అప్పగించారు.

**రెవెన్యూ సిబ్బంది సహకారంతో..**

కొంతమంది పెత్తందారులు వీఆర్‌వోలను చేతిలో పెట్టుకుని గుట్టుగా బేరాలు సాగిస్తున్నారు. అన్ని కుదిరిన తర్వాత పలుకుబడితో పక్కనే ఉన్న జిరాయితీ నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.

**దృష్టి సారించాం..**

డి.పట్టా భూముల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాం. జగనన్న కాలనీలోని ఖాళీ భూమిలో ఇటీవల కొందరు నీలగిరి మొక్కలు వేస్తుంటే అడ్డుకున్నాం. డి.పట్టా క్రయవిక్రయాలు చెల్లవు. వీటిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం.రామ్మోహనరావు, ఆర్డీవో

# ప్రకృతి మధ్య అనసూయ న్యాచురల్ లుక్స్.. సో బ్యూటీఫుల్

ప్రముఖ యాంకర్ గా, నటిగా తెలుగు ప్రేక్షకులలో మంచి క్రేజ్ అందుకున్న అనసూయ భరద్వాజ తాను పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్‌తో మళ్లీ సోషల్ మీడియాను కదిలించింది. సింపుల్‌గా, ఉన్న ఓ సాంప్రదాయ సారీలో ప్రకృతిలో నిలబడి ఆమె ఇచ్చిన సందేశం ఎంతో భావోద్వేగాన్ని కలిగించింది. “భూమి మనకు చెందదు, మనమే భూమికి చెందాము” అనే మాటలతో ఆత్మీయతను వ్యక్తం చేశారు. ఈ ప్రకృతి ప్రేరణతో కూడిన లుక్స్ ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఆరెంజ్ అండ్ బ్రౌన్ షేడ్స్ కలిగిన ట్రెడిషనల్ కాటన్ సారీలో కనిపించిన అనసూయ... చీరకట్టులోనూ ఎలా ఉంటుందో చాటిచెప్పింది. చేతిలో టోటీ బ్యాగ్, చెవిపోగులు, చేతికట్లు,



ఆహ్లాదకరమైన చిరునవ్వుతో ఆమె ఫోటోలు చూస్తే, సహజంగా ఆకర్షితులయ్యేలా ఉంటాయి. ఆడపిల్లలందరికీ ఇది ఓ అందమైన ఇన్స్పిరేషన్ లా నిలుస్తుంది. కనీసమైన మేకప్‌తో మెరిసిపోతూ, ఫోటోలో ప్రకృతి కంటే ప్రకృతిరమ్యంగా కనిపించడంలో అనసూయ ప్రత్యేకత కనిపిస్తోంది. అనసూయ కెరీర్ విషయానికి వస్తే... యాంకరింగ్‌లోనే కాదు, నటనలోనూ తనదైన ముద్ర వేసింది.

‘జబర్దస్త్’ షోతో స్టార్ యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఆమె, తర్వాత ‘క్షణం’, ‘రంగస్థలం’, ‘పుష్ప’ వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి విమర్శకుల ప్రశంసలు పొందారు. గ్లామర్ పాత్రలతో పాటు డిఫరెంట్ పాత్రలకు కూడా ఆమె ఆసక్తి చూపుతూ, తన పరిధిని విస్తరిస్తున్నారు. నటిగా తనను నిరూపించుకోవడంలో ఆమె ఎంత శ్రమ పెడతారో ప్రతి సినిమాతో తెలిసిపోతోంది.

# స్లిమ్ సీక్రెట్ చెప్పేసిన నయా నటి!

తమ్ముడు చిత్రంతో లయ కంబ్యాక్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఒకప్పుడు హీరోయిన్ గా రాణించిన లయ కెరీర్ పీక్స్ లో ఉండగానే హీరోయిన్ అవకాశాలు వదులుకుని పెళ్లి చేసుకుని స్థిరపడింది. అప్పటి నుంచి ఇంతవరకూ మళ్లీ సినిమాల వైపు చూడలేదు. తమ్ముడుతోనే రీఎంట్రీ ఇస్తుంది. కానీ అప్పటి లయకు- ఇప్పటి లయకు పెద్దగా వ్యత్యాసం లేదన్నది కాదనలేని వాస్తవం. లయ ఇప్పటికీ హీరోయిన్ మెటీరియల్. వయసు జస్ట్ నెంబర్ మాత్రమే అనిపిస్తుంది. లయ వయసిప్పుడు నాలుగు పదులు దాటాయి. 43



రన్నింగ్ లో ఉంది. ఇద్దరు పిల్లల తల్లి. కానీ 30 ఏళ్ల భామలాగే వైరల్ అవుతుంది. మరి ఈ బ్యూటీ సీక్రెట్ ఏంటి? మంచి ఫిట్ నెస్ ప్రియురాలా? యోగా, జిమ్ లాంటివి లైఫ్ లో భాగం చేసుకుందా? అంటే అలాంటిందేమి లేదు. కేవలం మితంగా తినడం ద్వారానే ఇలా ఉన్నట్లు తెలిపింది. పెళ్లికి ముందు నుంచి కూడా మితంగా తినడం అలవాటు అని ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నానని తెలిపింది. కడపు నిండుగా తినడం అన్నది ఇంతవరకూ ఎప్పుడూ జరగలేదని..అందుకే సన్నగా ఉన్నానంది. అలాగే పూర్తి శాఖాహారి అట. కానీ వంటకాలన్ని మాత్రం స్పైసీ గా ఉంటాయట. పప్పు, కూర, పచ్చడి ఏదైనా సరే అన్నంలో పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకుంటుందిట. వాటన్నింటిని తానే స్వయంగా తయారు చేసుకుంటుందిట. బయట ఫుడ్ తినదట.

అమెరికాలో ఉన్న ప్పుడు పిల్లల కోసం, భర్త కోసం లంచ్ బాక్సులు తయారు చేయడం లాంటివి ఏవీ ఉండవని...అన్ని వాళు న్న ప్రదేశాల్లోనే అందుబాటులో ఉంటాయంది. సాయంత్రం మాత్రమే వంట చేస్తుందిట. తాను తినేది కూడా తక్కువ కావడంతో మరుసటి రోజు వాటినే తీసుకుంటానని తెలిపింది.




# ‘ధూమ్ 4’లో యంగ్ టైగర్ ఎన్టీఆర్?



ధూమ్ ఫ్రాంఛైజీలో అన్ని సినిమాలు బంపర్ హిట్ కొట్టిన సంగతి తెలిసిందే. యాక్షన్ అడ్వెంచర్ జానర్‌లో విజువల్ ఫీస్ట్‌ని అభిమానులు ఎంజాయ్ చేసారు. ఇప్పుడు ‘ధూమ్ 4’తో ఫ్రాంఛైజీని రీబూట్ చేసేందుకు ప్రతిష్ఠాత్మక వైఆర్ఎఫ్ సంస్థ సిద్ధంగా ఉందని తెలిసింది. అయితే ఈ ఫ్రాంఛైజీలో నటించేది ఎవరు? అంటే.. ఇందులో కచ్చితంగా ఒక పాపులర్ బాలీవుడ్ హీరో, ఒక టాలీవుడ్ టాప్ హీరో నటిస్తారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మారిన పాన్ ఇండియా ట్రెండ్‌లో ఎలాంటి కాంబినేషన్ సెట్ చేస్తే పాన్ వరల్డ్ బాక్సాఫీస్‌ని ఢీకొట్టగలమా? అనేది యష్‌రాజ్ ఫిలింస్ ఆలోచిస్తోందని గుసగుస వినిపిస్తోంది.

**ప్రభాస్ కి ఛాన్స్ లేనట్టేనా?...** నిజానికి అమీర్ ఖాన్ నటించిన ‘ధూమ్ 3’ 2013లో విడుదలైంది. ఆ తర్వాత 12 సంవత్సరాల గ్యాప్ వచ్చింది. ఒక బ్లాక్ బస్టర్ ఫ్రాంఛైజీలో కొత్త సినిమాని ప్రారంభించడానికి ఇంతకాలం పట్టడం నిజంగా ఆశ్చర్యం కలిగిస్తోంది. ‘ధూమ్ 4’ స్క్రిప్టు రెడీ అవుతోందని, కాస్టింగ్ ఎంపికలు సాగుతున్నా యని గతంలో చాలా ప్రచారం సాగినా కానీ, ఏదీ నిజం కాలేదు. పా న్ ఇండియా స్టార్ ప్రభాస్ ని ఒక పాత్ర కోసం యష్ రాజ్ ఫిలింస్ సంప్రదించిందని కూడా గుసగుసలు వినిపించాయి. కానీ ఏదీ ఫైనల్ కాలేదు.

**దేనికోసం ఈ కొత్త లీకులు:** తాజా సమాచారం మేరకు ధూమ్ 4లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించే అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తు న్నాయి. యష్ రాజ్ ఫిలింస్ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటనా లేకపోయినా కానీ, వారి ప్రయత్నం చూస్తుంటే, యంగ్ టైగర్ ని ఇప్పట్లో వదులుకునేందుకు యష్ రాజ్ ఫిలింస్ సిద్ధంగా లేదని, అతడితో నెక్ట్స్ లెవల్లో భారీ యాక్షన్ అడ్వెంచర్లను ప్లాన్ చేస్తోందని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. వార్ 2 రిలీజ్ సందర్భంగా ఈ కొత్త లీకులు సర్వత్రా అభిమానుల్లో ఉత్కంఠను పెంచుతున్నాయి.

**ఆ కోణంలో కనెక్ట్ చేస్తున్నారు:** ప్రస్తుతం వైఆర్ఎఫ్ ‘వార్ 2’తో ధూమ్ 4 ని కనెక్ట్ చేస్తోందని కూడా కథనాలొస్తున్నాయి. వార్ 2 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుండగా ఎన్టీఆర్, హృతిక్ రోషన్ అభిమానులు సర్వత్రా ఉత్కంఠగా వేచి చూస్తున్నారు.

ఇలాంటి సమయంలో వార్ 2తో ధూమ్ 4 కనెక్షన్ గురించి లీకులు అందడం ఆసక్తిని కలిగిస్తోంది. వార్ 2 తో ధూమ్ 4 ప్రచారానికి వైఆర్ఎఫ్ తెర తీయనుంది. దీనికోసం ఒక సీన్ ని వార్ 2కి కనెక్ట్ చేస్తోందని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రత్యేకించి సెన్సార్ కూడా చేస్తారట.

**నార్త్‌లోను తారక్ హవా:** అంతేకాదు.. వార్ 2 పతాక సన్నివేశం ముగుస్తున్న క్రమంలో, ఒక సీన్ వస్తుంది. ఆ సీన్‌లో షారూఖ్, సల్మాన్, ఆలియా, శార్వరి వంటి ప్రముఖ తారలు కనిపిస్తారు. దీని అర్థం వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ లోకి ఇతర ఫ్రాంఛైజీలను కలుపుతారు. పఠాన్, టైగర్, ఆల్ఫా వంటి సినిమాలతో కనెక్ట్ చేస్తారు. ఇది ఎంసియు తరహా ప్రయత్నమని కూడా చెబుతున్నారు. ఒక వేళ ఇదే నిజమైతే యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఇప్పటికే వార్ 2లో నటించాడు గనుక స్పై వర్స్ లో అతడి పాత్ర మునుముందు కొనసాగుతుంది. వైఆర్ఎఫ్ విధిగా అతడి పాత్రను ఇతరుల కంటే చాలా ప్రత్యేకంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఇప్పుడు వార్ 2 విడుదలై మంచి ఫలితం సాధిస్తే, తారక్ నార్త్ లో కూడా కేంద్రక ఆకర్షణగా మారతాడు. అతడి చుట్టూ వైఆర్ఎఫ్ కథలు అల్లించాల్సి ఉంటుంది. ఉత్తరాది- దక్షిణాది వ్యాపారాన్ని కొల్లగొట్టాలంటే వైఆర్ఎఫ్ కి ఉన్న ఏకైక ఆప్షన్ తారక్.

**అన్నిటికీ ఒకే జవాబు:** అయితే అన్నిటికీ ఒకే సమాధానం ‘వార్ 2’ బంపర్‌హిట్ కొట్టడం.. ఇది జరిగితే ఎన్టీఆర్ ని ధూమ్ 4 కి కనెక్ట్ చేస్తుంది.. అయాన్ ముఖర్జీ అవకాశాల్ని మెరుగుపరుస్తుంది.. భవిష్యత్ లో స్పై వర్స్ లో అయాన్ కూడా కొనసాగే వీలుంటుంది. అతడు మళ్లీ ఎన్టీఆర్ తో కలిసి పని చేసేందుకు ఆస్కారం ఉంటుంది. ఇంటర్ కనెక్టెడ్ యూనివర్స్ ఫార్ములా ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది.

# తెలుగు ప్రేక్షకులకు బిగ్‌బాస్ రిటర్న్ గిఫ్ట్



తెలుగు బుల్లి తెర ప్రేక్షకుల ముందుకు బిగ్‌బాస్ మరోసారి రాబోతున్నాడు. ఇప్పటి వరకు ఎనిమిది సీజన్‌లు పూర్తి చేసుకున్న తెలుగు బిగ్‌బాస్ ఈ ఏడాది 9వ సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. బిగ్‌బాస్ తెలుగు హోస్ట్ మారుతాడు అంటూ పుకార్లు పెద్ద ఎత్తున షికార్లు చేశాయి, విజయ్ దేవరకొండ మొదలుకుని పదుల సంఖ్యల హీరోల పేర్లు బిగ్‌బాస్ హోస్ట్‌గా వినిపించాయి. చివరకు నాగార్జున హోస్ట్ అంటూ అధికారిక ప్రకటన వచ్చింది. రెండు రోజుల క్రితం బిగ్‌బాస్ సీజన్ 9 ను అధికారికంగా ప్రకటించారు. ప్రోమోను విడుదల చేయడం ద్వారా అధికారికంగా ప్రకటన చేసిన షో నిర్వాహకులు మరో ఆసక్తికర ప్రకటన చేశారు. బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 హోస్ట్‌గా నాగార్జున కన్ఫర్మ్ కాగా, కంటెస్టెంట్స్ విషయమై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలతో షో నిర్వాహకులు ఒప్పందం చేసుకున్నారనే వార్తలు వస్తున్నాయి.

త్వరలోనే ఈ సీజన్ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో తాజాగా వచ్చిన ప్రోమోతో ఆసక్తికర విషయాన్ని ప్రకటించారు. ఈసారి బిగ్ బాస్ హౌస్‌లోకి సెలబ్రిటీలు మాత్రమే కాకుండా సామాన్యులకు కూడా ఎంట్రీ దక్కబోతోంది. గతంలోనూ సామాన్యులకు చోటు దక్కింది. ఆ సమయంలో కొన్ని విమర్శలు వచ్చాయి. పైరవీలు నడిపించిన వారికి మాత్రమే చోటు దక్కిందని, ఆ సమయంలో ఎంపిక సరిగ్గా జరగలేదు అంటూ చాలా మంది విమర్శించారు. ఈసారి అలాంటి తప్పు జరగకుండా ఉండేందుకు గాను జాగ్రత్తలు జడుతున్నారు. బిగ్‌బాస్ షో నిర్వాహకులు ఆడిషన్స్ నిర్వహించబోతున్నారు. బిగ్‌బాస్ హౌస్‌కి ఎందుకు వెళ్లాలి అనుకుంటున్నారు, మీ యొక్క ప్రతిభ ఏంటి అనేది తెలియజేస్తూ ఒక వీడియోను పంపించాలని ఒక లింక్‌ను నిర్వాహకులు ఇచ్చారు. బిగ్‌బాస్ సీజన్ 9 ఆగస్టులో ప్రారంభం అయ్యే అవకాశం ఉందని, అప్పటి వరకు ఈ ఎంపిక జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రతి సీజన్ కంటే ఈ సీజన్ కాస్త ముందుగానే ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అందుకే కంటెస్టెంట్స్ ఎంపిక విషయంలో స్పీడ్‌గా ఉన్నారు. ఇదే సమయంలో సామాన్యులకు ఛాన్స్ ఇవ్వనున్నారు. తాజా ప్రోమోలో తెలుగు బిగ్ బాస్‌ను ఇంతటి ఘన విజయాన్ని చేసినందుకు గాను ప్రేక్షకులకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని భావిస్తున్నాం అని, ఆ గిఫ్ట్ ఏంటంటే ప్రేక్షకులను బిగ్‌బాస్ హౌస్‌లోకి పంపడం అంటూ నాగార్జున ప్రోమోలో చెప్పుకొచ్చాడు. మొత్తానికి బిగ్ బాస్ సీజన్ 9 మరోసారి అందరి దృష్టిని ఆకర్షించే అవకాశాలు ఉన్నాయి. సెలబ్రిటీలతో పాటు సామాన్యులు హౌస్‌లో ఉంటే కచ్చితంగా కంటెంట్ బాగుంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. గత సీజన్ ప్రేక్షకులను మెప్పించడంలో విఫలం అయింది. అందుకే సామాన్యులు ఉంటే కాస్త కంటెంట్ కొత్తగా ఉంటుందని, హిట్ దక్కడం ఖాయం అని అనుకుంటున్నారు. అందుకే బిగ్‌బాస్ లో సామాన్యులకు ఛాన్స్ ఇవ్వబోతున్నారు.

# మృణాల్ రెండు పడవల ప్రయాణం!

రాజమౌళి, కన్నడ రాకింగ్ స్టార్ యష్‌ల తరహాలో టీవీ సీరియల్ నుంచి వెండితెరపై ప్రత్యక్షమైన మరాఠీ బ్యూటీ మృణాల్ ఠాకూర్. ‘సీతారామం’తో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించిన మృణాల్ విభిన్నమైన పాత్రలని ఎంచుకుంటూ కథానాయికగా హిందీ, తెలుగు భాషల్లో మంచి గుర్తింపుని సొంతం చేసుకుంది. మాతృభాష మరాఠీలో సినిమాలు తగ్గించి కేవలం హిందీ, తెలుగు భాషలపైనే ప్రత్యేక దృష్టిపెట్టింది. తెలుగులో నటించిన తొలి చిత్రం ‘సీతారామం’తో మంచి మార్కులు కొట్టేసిన మృణాల్ ప్రస్తుతం ఆరు క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తోంది. అందులో రెండు తెలుగు సినిమాలు, నాలుగు హిందీ మూవీస్. ఇందులో ముందుగా అజయ్‌దేవగన్ నటిస్తూ నిర్మిస్తున్న ‘సన్నాఫ్ సర్దార్ 2’ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీన్ని ‘సన్నాఫ్ సర్దార్’కు సీక్వెల్‌గా రూపొందించారు. తెలుగు హిట్ ఫిల్మ్ ‘మర్యాద రామన్న’ ఆధారంగా ‘సన్నాఫ్ సర్దార్’ రూపొందిన విషయం తెలిసిందే. అయితే తెలుగులో సీక్వెల్ చేయకుండానే కొత్త కథతో అజయ్‌దేవ్‌గన్



‘సన్నాఫ్ సర్దార్’కు సీక్వెల్‌ని చేస్తున్నాడు. ఇందులో అజయ్‌కి జోడీగా మృణాల్ కనిపించనుంది. యాక్షన్ కామెడీగా రూపొందుతున్న ఈ మూవీని జూలై 25న భారీగా రిలీజ్ చేస్తున్నారు. ఇందులో మృణాల్ పంజాబీ అమ్మాయిగా కనిపించనుంది. దీనితో పాటు హిందీలో మరో మూడు సినిమాలు చేస్తోంది. హై జవానీతో ఇష్క్ హోనా హై, తుమ్ హోతో, పూజా మేరీ జాన్ వంటి సినిమాల్లో నటిస్తోంది. ఇక తెలుగులో అడివి శేష్ నటిస్తున్న ‘డెకాయిట్’ చేస్తోంది. శృతిహాసన్ తప్పుకోవడంతో ఆ అవకాశాన్ని మృణాల్ దక్కించుకుంది. ఇక ఈ సినిమాతో పాటు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న పాన్ వరల్డ్ మూవీలోనూ మృణాల్ ఠాకూర్ నటిస్తోంది. దీపికా పదుకునే మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో మృణాల్ ఠాకూర్ కూడా మరో హీరోయిన్‌గా కనిపించనుంది.

సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ మృణాల్ ఠాకూర్ కెరీర్‌కు ఓ మైలురాయిలా నిలిచే అవకాశం ఉందని, ఈ సినిమాతో స్టార్ హీరోయిన్‌ల జాబితాలో మృణాల్ చేరుతుందని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. హిందీతో పాటు తెలుగులోనూ క్రేజీ సినిమాల్లో నటిస్తూ రెండు పడవల ప్రయాణాన్ని సాఫీగా సాగిస్తున్న మృణాల్ రానున్న రోజుల్లో భారీ విజయాల్ని దక్కించుకుని స్టార్ హీరోయిన్‌ల జాబితాలో చేరడం ఖాయం.

# ఇది తేడా కొడితే చోప్రా నెక్ట్స్ ప్లాన్ ఏంటి?

సిటాడెల్ సిరీస్ డిజాస్టర్ అయిన తర్వాత ప్రియాంక చోప్రా చూపులు పూర్తిగా భారతీయ సినిమా వైపు ప్రసరించిన సంగతి తెలిసిందే. క్వాంటికోతో హాలీవుడ్ లో అడుగు పెట్టి ఘనంగా భారీ ప్రాజెక్టులతో బిజీ అయిపోయిన ప్రియాంక చోప్రా ఉన్నట్టుండి భారతీయ సినిమా వైపు చూడటం, నేరుగా పాన్ ఇండియాలో దూసుకెళుతున్న టాలీవుడ్ లో అడుగుపెడుతుండడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పీసీ ప్రస్తుతం రాజమౌళి- మహేష్ కాంబినేషన్ లోని భారీ పాన్ ఇండియన్ సినిమా ఎస్.ఎస్.ఎం.బి 29లో నటిస్తూ బిజీగా ఉంది. ఈ సమయంలోనే హాలీవుడ్ లో నటించిన పెండింగ్ సినిమా హెడ్స్ ఆఫ్ స్టేట్ విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమాలో ఇద్రిస్ ఎల్బా ,జాన్ సెనా వంటి అద్భుతమైన తారాగణం నటించినా అందరి దృష్టి ప్రియాంక చోప్రా వైపే ఉంది. ఈ భామ సినిమా ప్రచార కార్యక్రమాలలోను ప్రధాన ఆకర్షణగా మారింది. అయితే భారతదేశంలో ఈ సినిమాకి ఆశించిన ప్రచారం లేకపోవడంతో, అంతగా హైప్ క్రియేట్ చేయడంలో విఫలమైంది. అలాగే ప్రమోషనల్ మెటీరియల్ కి కూడా ఇక్కడ ఆశించిన గుర్తింపు దక్కలేదు. దీంతో



జూలైలో రిలీజ్ ముంగిట ఈ సినిమా ఎలాంటి అంచనాలు హైప్ లేకుండానే వస్తోంది. నిజానికి సిటాడెల్ డిజాస్టరయ్యాక, అన్ని హోప్స్ ఈ సినిమాపైనే పెట్టుకుంది పీసీ. కానీ ఇది ఆశించిన ఫలితాన్ని ఇస్తుందా లేదా? అన్న సందేహాలు ఇప్పుడు అలుముకున్నాయి. ఒకవేళ హెడ్స్ ఆఫ్ స్టేట్ ఫలితం తారుమారు అయితే ప్రియాంక చోప్రా తదుపరి ప్రణాళికలు ఎలా ఉంటాయి? అంటే కచ్చితంగా పీసీ మరో తెలుగు సినిమా లేదా తమిళ సినిమాలో నటించేందుకు ఆస్కారం ఉ ంది. సౌత్ లోని పాన్ ఇండియన్ డైరెక్టర్లకు ప్రియాంక చోప్రా టచ్ లోకి వెళ్లే అవకాశం ఉంది. దీనికి కారణం ఇటీవల బాలీవుడ్ సినిమాలో నటించేందుకు ఆసక్తిని కనబరచకపోవడమే. హిందీ చిత్రసీమలో కొందరు తనపై కుట్ర చేసారని ఆరోపించిన ప్రియాంక చోప్రా, తన ఎగ్జిస్టెన్సీ కోసం సౌత్ సినిమాని ఆశ్రయించడమే ఉత్తమ మార్గమని భావిస్తున్నట్టు అర్థం చేసుకోవాలి. హాలీవుడ్ వర్కవుట్ కాకపోయినా, టాలీవుడ్ లో పనవుతుంది. ఇక్కడ పారితోషికం పరంగా కొంత పట్టు విడుపు ఉంటే తనను మరిన్ని అవకాశాలు వరించేందుకు అవకాశం ఉంది. సౌత్ లో ఒక ఊపు ఊపితే, బాలీవుడ్ లో మళ్లీ అవకాశాలు పుంజుకునే ఛాన్సుంటుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536